www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 10-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 252 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: దశమి తె. 3.43 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఉత్తరాభాద్ర మ. 1.30 తదుపరి రేవతి; వర్జ్యం: రా. 12.39-2.08; దుర్ముహూర్తం: ఉ. 8.50-9.34, రా. 9.54-10.44; అమృతఘడియలు: ఉ. 8.59-10.28; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.38; సూర్యాస్తమయం: 5.37 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎల్ఐసీ 'బీమా సఖి' యోజన!

మహిళల కోసం కొత్త పథకం

- ప్రారంభించిన ప్రధాని మోదీ.. 2 లక్షల మంది నియామకం
- మహిళా ఏజెంట్లకు స్టైపెండ్ కూడా.. తొలి మూడేళ్లు అందజేత
- టెన్త్ క్లాస్ ఉత్తీర్ణత.. 18 నుంచి 70 ఏళ్ల వయసు వారు అర్హులు
- ఆర్థిక వ్యవహారాలపై చైతన్యం.. బీమాపై అవగాహనే లక్ష్యం
- జీవిత బీమా సంస్థ వెబ్‌సైట్‌లో దరఖాస్తుల స్వీకరణ షురూ!

2



అమ్మ రూపమే

ప్రతి ఇంట్లోని కన్న తల్లిలా తెలంగాణ తల్లి

నమూనాను మార్చితే ఊరుకోం.. అవమానిస్తే చట్టపరంగా చర్యలు

- తెలంగాణ సంస్కృతికి రూపమైన బహుజన తల్లి
- జాతి అస్తిత్వానికి ప్రతీకగా విగ్రహ రూపకల్పన
- మేధావులు, ఉద్యమకారుల అభిప్రాయం మేరకే
- గత పదేళ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు
- టీజీని పునరుద్ధరించి.. రాష్ట్ర గీతాన్ని ప్రకటించాం
- 9మంది ఉద్యమకారులకు రూ.కోటి, 300 గజాలు
- అసెంబ్లీ, విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్
- రాష్ట్ర వేడుకగా తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం
- మండల స్థాయి వరకు 'డిసెంబరు 9' పండుగ
- ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహణకు ఆదేశాలు
- తెలంగాణ తల్లి రూపాన్ని ఆమోదిస్తూ ఉత్తర్వులు
- మాటలు, చేతలతో అగౌరవ పరచడం నేరం



తెలంగాణ తల్లి.. ఉద్యమ కాలం నుంచీ ఓ ఉద్వేగం! ఆ ఉద్వేగానికి ఇప్పుడు అధికారిక రూపం వచ్చింది! ప్రశాంత వదనంతో.. ఆకుపచ్చ చీరలో గ్రామీణ మహిళను పోలి ఉండే రూపంతో ఉన్న విగ్రహాన్ని సచివాలయం ఆవరణలో రేవంత్ సర్కారు ఏర్పాటు చేసింది! హుస్సేన్ సాగర్ తీరంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ తల్లిని బహుజనుల తల్లిగా అభివర్ణించారు. ప్రతి ఇంట్లోని తల్లికి ప్రతి రూపమే విగ్రహ రూపమని, దానిని మార్చినా.. ఏ రూపంలో అవమానించినా చట్టపరంగా తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. తెలంగాణ తల్లిపై తొలుత అసెంబ్లీలోనూ ఆ తర్వాత సచివాలయ ప్రాంగణంలో జరిగిన సభలోనూ ఆయన మాట్లాడారు.

12 13లో



సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు భారీగా హాజరైన జనం; అభివాదం చేస్తున్న రేవంత్



ఏపీ కేబినెట్‌లోకి నాగబాబు!

రాజ్యసభ సీటుకు బదులుగా మంత్రి పదవి


- కూటమి పార్టీల నడుమ అంగీకారం
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన
- ఎమ్మెల్సీని చేసి ఇస్తారా.. ముందే ఇస్తారా?
- ఖాళీ అయిన 3 ఎంపీ స్థానాల్లో ఒకటి తన అన్నయ్యకు ఇవ్వాలని పవన్ వినతి
- ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావుకు ముందే హామీ ఇచ్చామన్న బీజేపీ, టీడీపీ



అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జనసేన అధ్యక్షుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోదరుడు కె.నాగేంద్రబాబు త్వరలో రాష్ట్ర మంత్రివర్గంలో చేరనున్నారు. రాజ్యసభ సీటు వదులుకున్నందుకు ప్రతిగా ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించారు. కూటమి పార్టీల మధ్య ఈ మేరకు అంగీకారం కుదిరింది. ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం రాత్రి ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి మూడు

మిగతా 3వ పేజీలో...

మళ్లీ ఏపీ నుంచి రాజ్యసభకు కృష్ణయ్య



3

- బీజేపీ తరపున పెద్దల సభకు
- సభ్యత్వం పొందిన వెంటనే..
- టీడీపీ నుంచి బీద, సానా
- నేడు నామినేషన్లు.. ఏకగ్రీవమే

చెన్నమనేని జర్మనీ పౌరుడే

- రమేశ్ భారత పౌరసత్వం రద్దు సబబే
- కేంద్ర హోంశాఖ నిర్ణయం సరైందే: హైకోర్టు
- జర్మనీ పౌరసత్వాన్ని దాచినందుకు 30 లక్షల ఫైన్
- అందులో 25 లక్షలు ఆది శ్రీనివాస్‌కు చెల్లించాలి
- 15 ఏళ్లుగా కోర్టు సమయం వృథా చేశారని
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేపై ఆగ్రహం

14

ఆర్‌బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా



- 3 ఏళ్ల కాలానికి నియామకం
- రేపు బాధ్యతల స్వీకరణ

11

రూపాయి ధమాల్

ఒక్కరోజే 20 పైసల పతనం

మంచులో మంటలు

- మోహన్‌బాబు ఇంట్లో నిమిషానికో పరిణామం
- అనూహ్య మలుపులు.. పోలీసులకు ఫిర్యాదులు
- పహాడీ షరీఫ్ స్టేషన్‌కు వెళ్లిన మంచు మనోజ్..
- చిన్న కొడుకు నుంచి నాకు రక్షణ కల్పించండి
- రాచకొండ సీపీని అభ్యర్థించిన మోహన్‌బాబు
- బౌన్సర్లతో నిండిపోయిన జల్‌పల్లి నివాసం..

10

టీచర్ల ఫొటోలు ప్రదర్శించాలి

- స్కూళ్లలో వారి వివరాలు కూడా వెల్లడించాలి
- ఆఫీసులో లేదా బడి ఆవరణలో కనిపించాలి
- పాఠశాల విద్యాశాఖ సర్క్యులర్ జారీ
- నకిలీ టీచర్ల సమస్యకు పరిష్కారంగానే..
- మారుమూల ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి

14

మీరు మా దేశాన్ని కబ్జా చేస్తుంటే...
లాలీపాప్ తింటూ కూర్చుంటామా?

» బంగ్లాదేశ్ నాయకుల వ్యాఖ్యలపై మమత ఆగ్రహం



న్యూఢిల్లీ, డిసెంబరు 9: పశ్చిమ బెంగాల్, బిహార్, ఒడిశా రాష్ట్రాలపై తమకు హక్కులు ఉన్నాయంటూ బంగ్లాదేశ్ రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత భూభాగాలను ఆక్రమించుకోవడానికి బాహ్య శక్తులు ప్రయత్నిస్తుంటే భారతీయులు లాలీపాప్ తింటూ కూర్చుంటారని పొరుగు దేశం భావిస్తోందా అని ప్రశ్నించారు. సోమవారం రాష్ట్ర అసెంబ్లీలో ఆమె ప్రసంగించారు. కొందరు బంగ్లాదేశ్ నాయకులు చేస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యలకు స్పందించవద్దని, ప్రశాంతంగా, ఆరోగ్యంగా, మనశ్శాంతిగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఢాకా సభలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నాయకుడు రుహుల్ కబీర్ రిజ్వీ మాట్లాడుతూ బెంగాల్, బిహార్, ఒడిశాపై బంగ్లాదేశ్‌కు చట్టబద్ధమైన హక్కులు ఉన్నాయని వ్యాఖ్యానించారు. పొరుగు దేశంలో జరుగుతున్న పరిణామాలపై చర్చించేటప్పుడు బాధ్యతగా ఉండాలని రాజకీయ ప్రత్యర్థులు, మీడియా సంస్థలతో సహా అన్ని పార్టీలను మమత హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో పరిస్థితి విషమిస్తే అక్కడున్న మన బంధువులు, స్నేహితులపై ప్రభావం పడుతుంది కాబట్టి, సంయమనం పాటించాలని కోరారు. విదేశాంగ శాఖ మార్గదర్శకాలకు తమ ప్రభుత్వం, పార్టీ కట్టుబడి ఉంటాయని మమత స్పష్టం చేశారు.

హిందువులపై దాడులు ఆందోళనకరం

» బంగ్లాదేశ్‌కు భారత విదేశాంగ కార్యదర్శి స్పష్టం

ఢాకా, డిసెంబరు 9: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతుండడం పట్ల భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఆలయాలు, మత సంస్థలకు భద్రత కరవయిందని, వాటిపై దాడులు జరగడం విచారకరమని తెలిపింది. సోమవారం బంగ్లాదేశ్ పర్యటన నిమిత్తం వచ్చిన భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రం మిస్రి తన చర్చల్లో ఈ విషయాన్ని నిర్మొహమాటంగా తెలిపారు. ఆగస్టు 5న ప్రధాని షేక్ హసీనాను పదవి నుంచి తొలగించిన తరువాత భారత ప్రభుత్వ ఉన్నతాధికారి పర్యటనకు రావడం ఇదే ప్రథమం. ఆయన బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జషీం ఉద్దీన్, తాత్కాలిక ప్రభుత్వ విదేశీ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ తౌహిద్ హుస్సేయిన్‌లతో చర్చలు జరిపారు. ఇస్కాన్ గురువు చిన్మయ్ దాస్‌ను అరెస్టు చేసిన తరువాత జరిగిన హింసను ప్రస్తావించారు. తాత్కాలిక ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ యూనస్‌తోనూ భేటీ అయ్యారు. అయితే, ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రభుత్వ సలహాదారు యూనస్ మాట్లాడుతూ ఫాసిస్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా బంగ్లాదేశ్ ప్రజలు చేసిన విప్లవం భారత్‌కు నచ్చినట్టు లేదన్నారు. మైనార్టీలను వేధిస్తున్నారంటూ భారత్ మీడియా అతిశయోక్తులను ప్రచారం చేస్తోందన్నారు. తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు ఇతర దేశాలకు లేదని బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జషీం ఉద్దీన్ స్పష్టం చేశారు.

ఎంతకాలం ఉచితాలు...ఉపాధి కల్పించలేరా?

» 81 కోట్ల మందికి రేషన్ పంపిణీయా: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 9: "ఎంతకాలం ఉచిత పథకాలు ఇస్తూ పోతారు... ఉపాధి కల్పించలేరా?" అని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కరోనా దగ్గర నుంచి వలస కార్మికులకు ఉచిత రేషన్ ఇస్తుండడాన్ని గుర్తు చేస్తూ వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి, నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాల్సి ఉందని తెలిపింది. జాతీయ ఆహార భద్రత చట్టం-2013 కింద 81 కోట్ల మందికి ఉచితంగాగానీ, రాయతీపైనగానీ రేషన్ పంపిణీ చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెప్పగా ఆశ్చర్యం వ్యక్తం చేసింది. "పన్ను చెల్లింపుదార్లనే విడిచిపెట్టారన్న మాట!" అని వ్యాఖ్యానించింది. కరోనా సమయంలో వలస కార్మికుల సమస్యలపై సుమోటోగా చేపట్టిన వ్యాజ్యంపై సోమవారం ధర్మాసనం విచారణ జరిపింది. ఓ స్వచ్ఛంద సంస్థ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ కరోనా సమయంలో 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న వలస కార్మికులకు కూడా ఉచితంగా రేషన్ ఇచ్చారని, దాన్ని కొనసాగించాలని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఎంతకాలం ఉచితాలు కొనసాగిస్తారు...ఉపాధి ఎందుకు కల్పించరని కేంద్రాన్ని ప్రశ్నించింది. విచారణను జనవరి 8కి వాయిదా వేసింది.

మతం ఆధారంగా రిజర్వేషన్లు తగదు: సుప్రీం

న్యూఢిల్లీ, డిసెంబరు 9: మతం ఆధారంగా రిజర్వేషన్ల కేటాయింపు కుదరదని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. పశ్చిమ బెంగాల్‌లో కొన్ని ముస్లిం సముదాయాలకు ఓబీసీ కులాల హోదాను ఇచ్చి.. విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్లను కల్పించడాన్ని తప్పుబట్టిన కోల్‌కతా హైకోర్టు తీర్పును సమర్థిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ముస్లిముల్లోని 77 తరగతులకు పశ్చిమ బెంగాల్ రిజర్వేషన్ల చట్టం కింద, మరో 37 తరగతులకు పశ్చిమబెంగాల్ వెనుకబడిన తరగతుల చట్టం కింద 2010 నుంచి బెంగాల్ ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పిస్తోంది. దీనిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మే 22న కోల్‌కతా హైకోర్టు తీర్పును ఇచ్చింది. ఆయా సముదాయాలను ఓబీసీలుగా గుర్తించడంలో వెనుకబాటుతనం కంటే మతమే ప్రధాన అంశంగా పని చేసినట్టు కనిపిస్తోందని తన తీర్పులో హైకోర్టు తెలిపింది. ముస్లిముల్లో వెనుకబడ్డాయంటూ కొన్ని తరగతులను ఎంపిక చేయడం మొత్తంగా ముస్లిం సమాజాన్ని అవమానించినట్టే అవుతుందని వ్యాఖ్యానించింది. ఈ తరగతులకు రిజర్వేషన్ల కేటాయింపును నిలుపుదల చేసింది. దీనిని సవాలు చేస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సహా పలు సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. బెంగాల్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. మతం ఆధారంగా కాక, వెనుకబాటుతనాన్ని పరిగణనలోకి తీసుకునే ఆయా సముదాయాలకు రిజర్వేషన్లు కేటాయించారని, కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని ఆయన కోరారు.

కఠ్‌ముల్లాలు దేశానికి హానికరం.. జడ్జి వ్యాఖ్యలు

అలహాబాద్, డిసెంబరు 9: "దేశంలోని మెజారిటీ ప్రజల ఆకాంక్షల ప్రకారమే హిందుస్థాన్ నడుస్తుంది. ఇదే చట్టం. అంతేతప్ప.. "మాకు నలుగురిని పెళ్లి చేసుకునే హక్కుంది. హలాలా చేస్తాం. ట్రిపుల్ తలాఖ్ ఇస్తాం. అందుకు మా పర్సనల్ లా అంగీకరిస్తుంది" అనలేరు. ఆ హక్కులు ఇక్కడ పనిచేయవు" అని అలహాబాద్ హైకోర్టు జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వాట్సాప్ వంటి మెసెంజర్లలో, సామాజిక మాధ్యమాల్లో.. ముస్లింలను కించపరిచే విధంగా 'మూఢ ముస్లిం' అనే అర్థంలో వాడే 'కఠ్‌ముల్లా (మూఢ ముస్లిం)' అనే పదాన్ని కూడా ఆయన తన ప్రసంగంలో వాడారు. ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ)పై వీహెచ్‌పీ న్యాయవిభాగం ఆదివారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ పాల్గొని ప్రసంగించారు. యూసీసీ అంటే అదేదో వీహెచ్‌పీ, ఆరెస్సెస్‌లకు సంబంధించిన విషయం కాదని.. దేశ సర్వోన్నత న్యాయస్థానం కూడా దీని గురించి మాట్లాడిందని ఆయన పేర్కొన్నారు. "కానీ, ఈ కఠ్‌ముల్లాలు.. ఈ మాట అనడం సరైనది కాకపోవచ్చు.. కానీ, అనడానికి నేనేమీ సంకోచించను. ఎందుకంటే వారు దేశానికి ప్రమాదకరం. వ్యతిరేకం. వారిపట్ల మనమంతా జాగ్రత్తగా ఉండాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.

13న హిడ్మా గ్రామానికి హోంమంత్రి అమిత్ షా?

కొత్తగూడెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ రాజధానిగా పిలిచే ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూవర్తి గ్రామంలో ఈ నెల 13వ తేదీన కేంద్రం హోంమంత్రి అమిత్‌షా పర్యటించనున్నట్లు తెలుస్తోంది. ఆ రోజు అక్కడే బస చేసి గ్రామస్థులతో సమావేశమవనున్నట్లు సమాచారం. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మా స్వగ్రామమైన పూవర్తి... పూర్తిగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతం. కొన్ని నెలల క్రితం వరకు పూవర్తి పేరు వింటేనే పోలీసులకు వణుకు పుట్టేది. అలాంటిది అక్కడ కేంద్ర హోంశాఖ మంత్రి పర్యటించనుండడం చర్చనీయాంశంగా మారింది. 2026 మార్చి నాటికి ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు పార్టీని లేకుండా చేస్తామని ఇటీవల అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే.

ఢిల్లీలో 40 స్కూళ్లకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ, డిసెంబరు 9: ఢిల్లీలోని పాఠశాలలకు బాంబు బెదిరింపులు మరోసారి కలకలం రేపాయి. నగరంలోని సుమారు 40 పాఠశాలలకు సోమవారం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఈ మెయిల్స్ పంపిన వ్యక్తి 30వేల డాలర్లు(సుమారు రూ.25 లక్షలు) డిమాండ్ చేశాడని, దీంతో ఆయా స్కూళ్లలో తనిఖీలు నిర్వహించామని పోలీసులు వెల్లడించారు. అయితే అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదని పేర్కొన్నారు. మెయిల్స్ అన్నీ ఒకే ఈ-మెయిల్ నుంచి వచ్చినట్టు పోలీసులు గుర్తించారు.

దేశాన్ని అస్థిరపర్చే కుట్ర!

విదేశీ శక్తుల 'సాధనం'గా కాంగ్రెస్.. సోరోస్ నిధులిస్తున్న సంస్థతో సోనియాకు సంబంధాలు

» బీజేపీ అధ్యక్షుడు నడ్డా ఆరోపణలు
» తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ చీఫ్ ఖర్గే
» రాజ్యసభలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం



న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాల్లో అదానీ అంశంపై చర్చించాలని విపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో అధికార బీజేపీకి 'జార్జ్ సోరోస్' అస్త్రం దొరికింది. అమెరికన్-హంగేరియన్ వ్యాపారవేత్త జార్జ్ సోరోస్ ఫౌండేషన్ నిధులు సమకూరుస్తున్న సంస్థతో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి సంబంధాలు ఉన్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. బీజేపీ ఆరోపణలపై సోమవారం రాజ్యసభలో గందరగోళం నెలకొంది. కేంద్ర మంత్రి జేపీ నడ్డా; రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఖర్గే మధ్య మాటల యుద్ధం నడిచింది. కాంగ్రెస్ పార్టీ విదేశీ శక్తుల చేతుల్లో 'సాధనం'గా వ్యవహరిస్తోందని నడ్డా ఆరోపించారు. సోరోస్‌తో కాంగ్రెస్‌కు సంబంధాలు ఉన్నాయని, భారత్‌ను అస్థిరపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై ఖర్గే తీవ్రంగా స్పందించారు. నడ్డా అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. సమస్యల నుంచి ప్రజల నుంచి దృష్టి మరల్చేందుకే బీజేపీ నిరాధార ఆరోపణలు చేస్తోందన్నారు. ఈ క్రమంలో నడ్డా, ఖర్గేలను తన చాంబర్‌కు రావాలని ధన్‌ఖడ్ ఆదేశించారు. విపక్ష పార్టీల ఎంపీలు తాము లేవనెత్తిన అంశాలపై చర్చించాలని పట్టుబట్టడంతో సభ వాయిదాల పర్వంలో నడిచింది. రెండోసారి వాయిదా అనంతరం సభ తిరిగి ప్రారంభమైన తర్వాత నడ్డా మాట్లాడుతూ.. ఫోరమ్ ఆఫ్ డెమోక్రటిక్ లీడర్స్ ఇన్ ఆసియా పసిఫిక్ ఫౌండేషన్‌కు సోరోస్ సంస్థ నిధులు సమకూరుస్తోందన్నారు. ఆ ఫౌండేషన్‌కు సోనియా సహ అధ్యక్షురాలిగా ఉన్నారని చెప్పారు. ఇది చాలా తీవ్రమైన అంశమన్నారు. 'ఇది భారతదేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తుంది. జాతీయ భద్రతపై ఆందోళనను పెంచుతోంది. దేశ భద్రతతో కాంగ్రెస్ ఆటలు ఆడుకుంటోంది. అందుకే ఈ అంశంపై చర్చించాలని కోరుకుంటున్నాం' అని పేర్కొన్నారు. దీంతో సోనియా, సోరోస్ సంస్థ సంబంధాలపై వెంటనే చర్చ చేపట్టాలని కోరుతూ బీజేపీ ఎంపీలు నినాదాలు చేశారు. బీజేపీ సభ్యుల డిమాండ్‌పై కాంగ్రెస్ ఎంపీలు ఖర్గే, జైరాం రమేశ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని లేవనెత్తేందుకు బీజేపీ ఎంపీలను ఎలా అనుమతించారని చైర్మన్‌ను అడిగారు. సభలో లేని వ్యక్తి గురించి మాట్లాడడం వారి ప్రతిష్ఠను దిగజార్చడమేనన్నారు. చైర్మన్ ధన్‌ఖడ్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు మాట్లాడుతూ.. సోనియా-సోరోస్ మధ్య సంబంధాలు దేశ భద్రతకు ఆందోళనకరమన్నారు. కాగా,సభలో చైర్మన్ ధన్‌ఖడ్, కాంగ్రెస్ ఎంపీ జైరాంరమేశ్ మధ్య వాగ్వాదం జరిగింది. చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని రమేశ్ ఆరోపించారు. గందరగోళ పరిస్థితులతో చైర్మన్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

ధన్‌ఖడ్‌పై అవిశ్వాసం?

రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కాంగ్రెస్ సిద్ధమైనట్లు తెలిసింది. సదరు నోటీసుపై విపక్ష 'ఇండీ' కూటమి ఎంపీలు సంతకాలు కూడా చేసినట్లు సమాచారం. ధన్‌ఖడ్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని గత ఆగస్టులోనే అవిశ్వాసం పెట్టాలనుకున్నారు. అయితే మరో అవకాశం ఇవ్వాలని ఆగారు. ఇప్పుడు అవిశ్వాసం పెట్టక తప్పడం లేదని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. అవిశ్వాసానికి టీఎంసీ, ఆప్, ఎస్పీ, సీపీఎం, సీపీఐ సహా పలు పార్టీలకు చెందిన 70 మంది మద్దతు తెలిపినట్లు తెలిసింది.

లోక్‌సభలోనూ గందరగోళం..

లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదానీ వ్యవహారంపై జేపీసీతో విచారణ జరపాలని, మణిపూర్ అంశం, శంభులో రైతులపై రబ్బర్ బుల్లెట్లతో దాడి వంటి అంశాలపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. విపక్ష సభ్యుల నినాదాలతో సభ కొద్దిసేపటికే వాయిదా పడింది. మళ్లీ సభ ప్రారంభం కాగానే విపక్షాలు నినాదాలతో హోరెత్తించాయి. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. మళ్లీ అదే పరిస్థితి ఉండడంతో 3 గంటలకు వాయిదా వేశారు. ఒకవైపు ప్రతిపక్షాల ఆందోళన జరుగుతుండగానే, మరోవైపు బీజేపీ ఎంపీలు సోనియా-సోరోస్ అంశంపై చర్చించాలని పట్టుబట్టారు. దీంతో స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

రాహుల్ గాంధీకి అదానీ, మోదీ ఇంటర్వ్యూ!


అదానీపై పార్లమెంటులో చర్చ కోసం కాంగ్రెస్ వినూత్న నిరసన ప్రదర్శన

అదానీపై అమెరికా చేసిన అవినీతి ఆరోపణలపై పార్లమెంటులో చర్చ కోసం పట్టుబడుతున్న కాంగ్రెస్ పార్టీ సోమవారం వినూత్న రీతిలో నిరసన తెలిపింది. అదానీ, మోదీ మాస్కులు ధరించి పార్లమెంటుకు వచ్చిన కాంగ్రెస్ ఎంపీలు మాణిక్యం ఠాగూర్, సప్తగిరి శంకర్‌ను విపక్ష నేత రాహుల్‌గాంధీ ఇంటర్వ్యూ చేశారు. 'మీ ఇద్దరి మధ్య ఉన్న సంబంధం ఏంటి' అని వారిని ప్రశ్నించారు. దానికి.. 'ఏదైనా మేమిద్దరం కలిసే చేస్తాం. ఎన్నో ఏళ్ల బంధం మాది' అని బదులిచ్చారు. అదానీ మాస్కు వేసుకున్న ఠాగూర్.. 'నేనేది చెప్తే ఆయన అదే చేస్తారు. ఎయిర్‌పోర్టు అయినా పోర్టు అయినా.. ఏది అడిగితే అది ఇస్తారు' అని మోదీ మాస్కు వేసుకున్న శంకర్‌ను ఉద్దేశించి అన్నారు. అయితే, తర్వాత ఏం అడగబోతున్నారని రాహుల్ ప్రశ్నించగా.. 'ఈ సాయంత్రమే మాకు మీటింగ్ ఉంది' అని ఠాగూర్ అన్నారు.

'ఒకే దేశం-ఒకే ఎన్నిక' బిల్లుపై జేపీసీ?

పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి ఎలక్షన్లు నిర్వహించే 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విధానంపై ముందుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఏకాభిప్రాయ సాధన ద్వారానే ఈ బిల్లును ఆమోదింపజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు విస్తృతంగా చర్చలు జరిపేందుకు వీలుగా సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని కూడా నియమించే అవకాశం ఉంది.

లోకం తీరు



మహిళల కోసం ఎల్ఐసీ 'బీమా సఖి'

» కొత్త పథకాన్ని ప్రారంభించిన మోదీ
» మూడేళ్లలో 2 లక్షల మంది నియామకం

న్యూఢిల్లీ, డిసెంబరు 9: మహిళలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 70 ఏళ్ల వయసు గల మహిళలను ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ అయిన ఎల్ఐసీ ఏజెంట్లుగా నియమించనుంది. ఈ మేరకు మహిళల సాధికారత కోసం కొత్త పథకాన్ని ప్రారంభించింది. 2 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చే 'బీమా సఖి యోజన'ను ప్రధాని మోదీ సోమవారం హరియాణాలోని పానిపట్‌లో ప్రారంభించారు. మహిళలకు ఎదురయ్యే అన్ని ఇబ్బందులను తొలగించి, వారు సాధికారులయ్యేలా చేస్తున్నామని ప్రధాని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అన్ని రంగాల్లో మన ఆడబిడ్డలు ముందుకెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బీమా సఖి యోజనలో చేరేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. సోమవారం నుంచే ఎల్ఐసీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫామ్‌లు అందుబాటులో ఉంటాయి. ఈ పథకం తొలి దశలో భాగంగా 35 వేల మందిని బీమా సఖులుగా నియమించనున్నారు. అనంతరం దశలవారీగా దేశవ్యాప్తంగా నియామకాలు చేపట్టనున్నారు. ఎంపికైన మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఆర్థిక వ్యవహారాలపై చైతన్యం, బీమాపై అవగాహన కల్పించే ఈ మహిళా ఏజెంట్లకు మూడేళ్ల పాటు స్టైపెండ్ కూడా అందజేయనున్నారు. వీరికి తొలి ఏడాదిలో నెలకు రూ.7 వేల చొప్పున, రెండో ఏడాది నెలకు రూ.6 వేలు, మూడో ఏడాది నెలకు రూ.5 వేల చొప్పున స్టైపెండ్ ఇస్తారు. ఈ పథకం కింద మూడేళ్లలో 2 లక్షల మంది మహిళలను బీమా సఖులను నియమించనున్నారు. శిక్షణ అనంతరం ఎల్ఐసీ ఏజెంట్లుగా పనిచేసే వీరికి స్టైపెండ్‌తో పాటు కమీషన్ కూడా అందజేస్తారు. పట్టభద్రులైన బీమా సఖులను ఎల్ఐసీలో డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా నియమించే అవకాశం కూడా ఉంటుంది.

కొత్త సర్కారు దిశగా సిరియా

అల్-బషీర్‌కు సమన్వయ బాధ్యతలు.. ప్రకటించిన తిరుగుబాటుదారులు

» దేశవ్యాప్తంగా ఖైదీల విడుదల
» అసద్‌కు ఆశ్రయం కల్పించిన రష్యా

డమాస్కస్/న్యూఢిల్లీ, డిసెంబరు 9: కల్లోలిత సిరియా సుస్థిర ప్రభుత్వ ఏర్పాటు దిశగా ముందుకు సాగుతోంది. తిరుగుబాటు దళాలకు నేతృత్వం వహిస్తున్న హయాత్ తహ్రీర్ అల్ షమ్(హెచ్‌టీఎస్) ఈ విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది. అంతర్గత విభేదాల్లేకుండా.. గందరగోళానికి తావివ్వకుండా, సామరస్యపూర్వకంగా సర్కారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో సమన్వయానికి సిరియా సాల్వేషన్ ప్రభుత్వ(తిరుగుబాటు దారుల పాలనలో ఉన్న ప్రాంతాలు) అధినేత మహమ్మద్ అల్-బషీర్‌కు బాధ్యతలను అప్పగించారు. వివిధ వర్గాలతో ఆయన చర్చించి, సమన్వయంతో కొత్త ప్రభుత్వ ఏర్పాటు చేస్తారు. ఈ క్రమంలో అల్-బషీర్ సోమవారం వరుస భేటీలు ఏర్పాటు చేశారు. హెచ్‌టీఎస్‌తోపాటు.. అహ్మద్ అల్-షరా సంస్థ, సిరియా ప్రధాని మహమ్మద్ అల్-జలాలీ, ఇతర తిరుగుబాటు వర్గాలతో సమావేశమవుతున్నారు. మరోవైపు, సిరియా అధ్యక్షుడు అసద్ రష్యాకు పయనమవ్వగానే.. రెబెల్స్ నాయకుడు అల్-జోలానీ జాతినుద్దేశించి ప్రసంగించారు. "అసద్ పారిపోవడంతో దేశం పవిత్రమైంది. సిరియన్లు ఇక భయపడాల్సిన అవసరం లేదు. వివిధ దేశాల్లో శరణార్థులుగా ఉన్న సిరియన్లు వెనక్కి తిరిగి రావాలి. వారికి స్వాగతం పలికేందుకు సిరియాలోని విమానాశ్రయాలను సిద్ధం చేస్తున్నాం. ఆదివారం (ఈ నెల 8) కంటే ముందు జరిగిన నేరాలకు సంబంధించిన అన్ని శిక్షలను రద్దు చేస్తాం. నిందితులకు క్షమాభిక్ష ప్రసాదిస్తాం" అని ప్రకటించారు. దౌత్యవేత్తల ఆఫీసులు, ఇళ్లకు భద్రత కల్పిస్తామన్నారు. ఆయన ప్రసంగించిన వెంటనే.. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జైళ్లలోని ఖైదీలు విడుదలయ్యారు.



మాస్కో చేరుకున్న అసద్ కుటుంబసభ్యులు



అల్ బషీర్

మాస్కోకు చేరుకున్న అసద్

ఆదివారం ఉదయం డమాస్కస్ నుంచి పారిపోయిన సిరియా అధ్యక్షుడు బషర్ అల్-అసద్, అతని కుటుంబ సభ్యులు మాస్కోకు చేరుకున్నట్లు రష్యా ప్రభుత్వం ప్రకటించింది. ఆయనకు రాజకీయ ఆశ్రయం కల్పిస్తున్నట్లు తెలిపింది. అయితే.. డమాస్కస్ నుంచి పారిపోవడానికి ముందు అసద్ తన కార్యాలయ అధికారులు, సైన్యాధికారులకు కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. "వివాదాల్లేకుండా.. శాంతియుతంగా అధికారాన్ని బదిలీ చేయండి. నా భవిష్యత్ గురించి ఆందోళన వద్దు" అని సూచించినట్లు రష్యా మీడియా సంస్థలు పేర్కొన్నాయి.

సిరియాలో స్థిరత్వం రావాలి: భారత్

సిరియాలో పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. సిరియా సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను కాపాడేందుకు ఆ దేశంలోని అన్ని పార్టీలు సమష్టిగా కృషి చేయల్సిన అవసరం ఉందని పేర్కొంది. సిరియాలో శాంతిస్థాపన జరగాలని ఆకాంక్షించింది. అక్కడ ఉన్న భారతీయులంతా క్షేమంగా ఉన్నారని తెలిపింది.

రష్యా వైఖరిలో మార్పు!

అసద్ విషయంలో రష్యా వైఖరిలో మార్పు కనిపిస్తోందని పాశ్చాత్య మీడియా కథనాలను ప్రచురించింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైన నేపథ్యంలో.. అసద్‌కు దూరంగా ఉండాలని రష్యా నిర్ణయించినట్లు పేర్కొంది. సోమవారం ఉదయం మాస్కోలోని సిరియా రాయబార కార్యాలయం వద్ద రెబెల్స్ పతాకాన్ని ఎగురవేయడానికి కూడా రష్యా అనుమతించడాన్ని ఈ అనుమానాలు బలపరుస్తున్నట్లు తెలిపింది. ఇదిలా ఉండగా, డమాస్కస్, హోమ్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై అడపాదడపా దాడులు చేస్తున్న ఇజ్రాయెల్.. ఆదివారం సాయంత్రం నుంచి సిరియాపై దూకుడు పెంచింది. సోమవారం డమాస్కస్‌లో ఉన్న రసాయన ఆయుధాల డిపోలపై బాంబుల వర్షం కురిపించింది.

కెనడా, మెక్సికోలకు అన్ని రాయితీలా..
అవి అమెరికాలో విలీనమైతేనే మేలు

న్యూయార్క్, డిసెంబరు 9: పొరుగు దేశాలకు అమెరికా ఇస్తున్న రాయితీలపై కాబోయే ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో స్పందించారు. కెనడా, మెక్సికోకు భారీగా రాయితీలివ్వడం కంటే ఆ రెండు దేశాలు అమెరికాలో విలీనమైతేనే బాగుంటుందని వ్యాఖ్యానించారు. అమెరికాలోకి ఆయా దేశాల నుంచి అక్రమ వలసదారులను నియంత్రించకపోతే దిగుమతులపై భారీ సుంకాలు విధిస్తానని మరోసారి హెచ్చరించారు. ఆదివారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ పలు అంశాలపై మాట్లాడారు. 'మెక్సికోకు ఏటా 300 బిలియన్ డాలర్లు (రూ.24 లక్షల కోట్లు), కెనడాకు 100 బిలియన్ డాలర్ల (రూ.8 లక్షల కోట్లకు పైగా) రాయితీలు ఇస్తున్నాం.. అసలు ఎందుకు ఆ దేశాలకు మనం రాయితీలు ఇవ్వాలి. దానికంటే ఆ దేశాలు అమెరికాలో విలీనమై రాష్ట్రాలుగా మారితే మేలు' అని అన్నారు. ఇక అక్రమ వలసదారులపై స్పందిస్తూ.. అధికారం చేపట్టిన మొదటి రోజు నుంచే పుట్టుకతో సంక్రమించే పౌరసత్వంపై దృష్టి పెడతానని చెప్పారు. వచ్చే నాలుగేళ్లలో అక్రమ వలసదారులను అమెరికా దాటిస్తానని ప్రకటించారు.

కోర్టు బోను ఎక్కనున్న నెతన్యాహు

జెరూసలేం, డిసెంబరు 9: ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తొలిసారిగా మంగళవారం ఓ అవినీతి వ్యవహారంలో కోర్టు బోను ఎక్కనున్నారు. మీడియాలో ప్రచారం కోసం కొన్ని మీడియా సంస్థల అధిపతులకు లబ్ధి కలిగించే విధంగా ప్రభుత్వ నిబంధనలను నెతన్యాహు ఉల్లంఘించారని, ఓ హాలీవుడ్ నిర్మాతతోనూ ఇలాగే వ్యవహరించారని గతంలోనే మూడు కేసులు దాఖలయ్యాయి. వీటిపై 2020లోనే కోర్టులో విచారణ ప్రారంభమైంది. అయితే, గాజాలో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో విచారణను వాయిదా వేయాలంటూ నెతన్యాహు పలుమార్లు కోర్టును కోరుతూ వచ్చారు. పలు వాయిదాల అనంతరం, మంగళవారం నుంచి విచారణ పునఃప్రారంభం కానుంది. దీంట్లో భాగంగా, వారానికి మూడు రోజులపాటు నెతన్యాహు కోర్టు విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. తీర్పు 2026లో వెలువడొచ్చు.

చేతబడి చేశారన్న అనుమానంతో హైతీలో 184 మంది వృద్ధుల ఊచకోత

జెనీవా, డిసెంబరు 9: సాయుధ గ్యాంగుల హింసతో అట్టుడుకుతున్న హైతీలో ఒక బలమైన గ్యాంగ్ నాయకుడు గత వారాంతంలో 184 మంది వృద్ధులను ఊచకోత కోయించాడని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల విభాగం అధ్యక్షుడు వోకర్ టర్క్ చెప్పారు. హైతీ రాజధాని పోర్ట్-ఔ-ప్రిన్స్‌కు సమీపంలోని సిటే సోలీల్ ప్రాంతంలో ఈ హత్యలు జరిగినట్టు సోమవారం తెలిపారు. వార్ఫ్ జెరెమీ గ్యాంగ్ నాయకుడు మానెల్ మికానో ఫెలిక్స్ కుమారుడు అనారోగ్యానికి గురై శనివారం మరణించాడు. వృద్ధులు చేతబడి చేయడం వల్లే అతడి ఆరోగ్యం క్షీణించిందని ఊడో మతబోధకుడు ఒకరు చెప్పడంతో ఫెలిక్స్ అనుచరులు కొడవళ్లు, కత్తులతో స్వైర విహారం చేసి శుక్ర, శనివారాల్లో వృద్ధులను చంపేశారని టర్క్ వెల్లడించారు.

పంపాలో మహిళలకు ప్రత్యేక వసతి

శబరిమల, డిసెంబరు 9: శబరిమల యాత్రకు వెళ్లే మహిళల చిరకాల డిమాండ్ నెరవేరింది. కేరళ సర్కారు మహిళల కోసం పంపా బేస్‌లో ప్రత్యేక వసతి సదుపాయాన్ని కల్పించింది. ట్రావెన్‌కోర్ దేవొస్వం బోర్డు(టీడీబీ) అధ్యక్షుడు పీఎస్ ప్రసాద్ సోమవారం ఈ వసతి గృహాన్ని ప్రారంభించారు. ఇందులో ఏకకాలంలో 50 మంది మహిళలు విశ్రాంతి తీసుకునే వెసులుబాటు ఉంటుందని, అయ్యప్ప దీక్షాధారులతోపాటు వచ్చే మహిళలు తమవారు తిరిగి వచ్చేవరకు పంపా బేస్, హిల్‌టాప్ వద్ద వాహనాల్లోనే ఎదురుచూసేవారు. ఇలాంటి వారికి ఈ వసతిగృహం ఉపయోగపడుతుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

నోయిడా విమానాశ్రయంలో విమానం ల్యాండింగ్ పరీక్షలు సక్సెస్


న్యూఢిల్లీ, డిసెంబరు 9: ఢిల్లీ(ఎన్‌సీఆర్)లో నిర్మితమవుతున్న నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం (ఎన్ఐఏ)లో సోమవారం తొలిసారిగా విమాన ల్యాండింగ్ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేశారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ విమానాశ్రయం నుంచి సిబ్బందితో బయలుదేరిన ఇండిగో ఏ- 320 విమానం చేదన వ్యవస్థ పనితీరు, ఎయిర్ ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థల పరీక్షల అనంతరం సురక్షితంగా నోయిడా విమానాశ్రయ రన్‌వే పై ల్యాండ్ అయింది. ఈ సందర్భంగా విమానాశ్రయ సిబ్బంది విమానానికి వాటర్ సెల్యూట్ సమర్పించారు. దేశ రాజధానిలో ఇప్పటికే ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్నప్పటికీ అక్కడ పెరుగుతున్న రద్దీ, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఢిల్లీకి సమీపంలోని జేవర్‌లో అధునాతన హంగులు, సదుపాయాలతో ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు.

యూపీఎస్సీ మెయిన్స్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ, డిసెంబరు 9: అఖిల భారత సర్వీసుల్లో 1,056 ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన సివిల్ సర్వీస్ మెయిన్స్ ఫలితాలను యూపీఎస్సీ సోమవారం విడుదల చేసింది. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు సెప్టెంబరు 20 నుంచి 29 వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. ఇందులో ఎంపికైన అభ్యర్థుల జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ అభ్యర్థులు ఇంటర్వ్యూ (పర్సనాలిటీ టెస్ట్)కు హాజరు కావాల్సి ఉంటుంది. ఇందులో సత్తా చాటిన వారిని ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి కేంద్ర సర్వీసులకు ఎంపిక చేస్తారు.

ఆత్మహత్యకు ముందు స్నానం..
శివనామ స్మరణ చేయాలి

» ఏమేం చేయాలో రాసుకొని, ఆచరించి బెంగళూరులో యూపీ వాసి ఆత్మహత్య



అతుల్ సుభాష్ (ఫైల్)

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'ఆత్మహత్యకు ముందు స్నానం చేయాలి.. వందసార్లు శివనామస్మరణ చేయాలి. సూసైడ్ నోట్‌ను హైకోర్టు, సుప్రీంకోర్టు, ఆఫీసు, కుటుంబ సభ్యులకు మెయిల్ చేయాలి. చివరిగా తాడు సిద్ధం చేసుకోవాలి..' ఇలా ప్రతి ఒక్కటీ రెండు రోజుల ముందే అన్నీ ప్రణాళికాబద్ధంగా రాసిపెట్టుకుని.. ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బెంగళూరు నగరం మాతరహళ్ళిలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అతుల్ సుభాష్.. మాతరహళ్ళిలోని మంజునాథ లేఅవుట్‌లో నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నాడు. దీంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన ఆత్మహత్యకు కారణాలు, ప్రణాళిక.. ఇలా అన్ని వివరాలతో 40 పేజీల సూసైడ్ నోట్ రాసిపెట్టాడు. 'చనిపోవడానికి ఒక రోజు ముందే అన్ని పేమెంట్లు క్లియర్ చేయాలి. ఆఫీసు పనిపూర్తి చేయాలి. ల్యాప్‌టాప్, చార్జర్, ఐడీని ఆఫీసులో అప్పగించాలి' అని పక్కాగా టైం టేబుల్ రాసుకొని ఆచరించాడు. భార్యతో విబేధాలు వచ్చాక తాను ఎదుర్కొన్న సమస్యలను సూసైడ్ నోట్‌లో సమగ్రంగా పొందుపరిచాడని పోలీసులు తెలిపారు.

ఏపీ క్యాబినెట్‌లో నాగబాబు!

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యసభ స్థానాలకు ఉపఎన్నిక జరుగనుండగా.. ఒకటి తన అన్న నాగేంద్రబాబుకు ఇవ్వాలని పవన్ కోరారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఆర్.కృష్ణయ్యకు తాము ముందే హామీ ఇచ్చామని, ఆ సీటు ఇవ్వలేమని బీజేపీ నాయకత్వం నిస్సహాయత వ్యక్తం చేసింది. తెలంగాణలో బీసీ వర్గాలను దరిచేర్చుకోవడానికి కృష్ణయ్య అవసరం ఉందని ఆ పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. టీడీపీ కూడా తన కోటా కింద వచ్చిన రెండు రాజ్యసభ సీట్లలో ఒకదానిని.. వైసీపీకి, రాజ్యసభకు రాజీనామా చేసి వచ్చిన బీద మస్తాన్‌రావుకు ఇస్తామని ముందుగానే హామీ ఇచ్చామని.. రెండోది కాకినాడ జిల్లాకు చెందిన పార్టీ నేత సానా సతీశ్‌కు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపింది. ఈ నేపథ్యంలో నాగబాబుకు రాజ్యసభ సీటు అవకాశం దక్కలేదు. లోక్‌సభ ఎన్నికల్లో అనకాపల్లి సీటు జనసేన కోటా కిందకు వచ్చిందని.. అక్కడ నాగబాబును నిలిపాలనుకున్నామని.. కానీ బీజేపీ కోసం త్యాగం చేశామని పవన్ కూటమి పార్టీలకు గుర్తుచేశారు. దీంతో ప్రత్యామ్నాయంగా నాగబాబును రాష్ట్ర క్యాబినెట్‌లోకి తీసుకోవాలని కూటమి నిర్ణయించింది. రాష్ట్ర మంత్రివర్గంలో ప్రస్తుతం ఒక ఖాళీ ఉంది. నాగబాబు ప్రస్తుతం శాసనసభలో గానీ, శాసన మండలిలో గానీ సభ్యుడు కాదు. ఏ సభలోనూ సభ్యుడు కాకపోయినా మంత్రిగా తీసుకోవచ్చు. కానీ ఆరు నెలల్లోపు ఆయన ఏదో ఒక సభ నుంచి ఎన్నిక కావాలి. కూటమి సర్కారు వచ్చాక వైసీపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. వాటిని మండలి చైర్మన్ మోషేన్ రాజు ఇంకా ఆమోదించలేదు. అవి ఖాళీ అయితే.. అందులో ఒకటి నాగబాబుకు ఇస్తారు. లేదంటే వచ్చే మార్చిలో మండలిలో కొన్ని ఖాళీలు రానున్నాయి. అప్పుడైనా ఇచ్చే అవకాశం ఉంది. అయితే అంతకుముందే నాగబాబును మంత్రిగా తీసుకుంటారా.. లేక ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాక తీసుకుంటారా అన్నది చూడాల్సి ఉంది.

మళ్లీ ఏపీ నుంచి రాజ్యసభకు కృష్ణయ్య

» టీడీపీ తరఫున బీదా, సానా.. నేడు అభ్యర్థుల నామినేషన్

అమరావతి, న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు కూటమి అభ్యర్థులు ఖరారయ్యారు. టీడీపీ నుంచి బీదా మస్తాన్ రావు, సానా సతీశ్.. బీజేపీ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్యను రాజ్యసభకు ఎంపిక చేసినట్లు టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం అధికారికంగా ప్రకటించారు. ముగ్గురు అభ్యర్థులు మంగళవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. నామినేషన్లకు మంగళవారమే ఆఖరు తేదీ. వైసీపీకి తగిన సంఖ్యాబలం లేకపోవడంతో పోటీకి దూరంగా ఉంది. ఈ నేపథ్యంలో కూటమి అభ్యర్థుల ఎంపిక ఏకగ్రీవం కానుంది. కాగా, తెలంగాణకు చెందిన బీసీ నాయకుడు ఆర్.కృష్ణయ్య.. గతంలో వైసీపీ తరఫున రాజ్యసభలో అడుగుపెట్టారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయనను బీజేపీ తిరిగి రాజ్యసభకు పంపనున్నట్లు 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. ఇప్పుడు అదే నిజమైంది. కృష్ణయ్య సోమవారం ఆన్‌లైన్ ద్వారా బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. అటు రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను, పార్టీ సభ్యత్వ రశీదును కృష్ణయ్య ఒకేసారి తీసుకున్నారు.

అధిక వడ్డీ పేరిట పెట్టుబడుల సేకరణ

» బోర్డు తిప్పేసిన బీ-4 బ్లాక్ స్వాన్ సంస్థ!

» గజ్వేల్, సిరిసిల్ల, కామారెడ్డి, కరీంనగర్, హైదరాబాద్‌లో బాధితులు

» హైదరాబాద్ ఆర్థిక నేరాల విభాగంలో ఫిర్యాదు

» ఇప్పటికే పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

గజ్వేల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ సంస్థలో పెట్టుబడులు పెడితే అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపి బోర్డు తిప్పేసిన ఘటన తాజాగా వెలుగుచూసింది. పలువురు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బీ-4 బ్లాక్ స్వాన్ సంస్థ పేరుతో గజ్వేల్, సిరిసిల్ల, హైదరాబాద్, కరీంనగర్, కామారెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల్లో కోట్లాది రూపాయల పెట్టుబడులు సేకరించారు. సిరిసిల్లలో హోటల్ కమ్ బాంకెట్‌హాల్, కరీంనగర్‌లో హోటల్, గజ్వేల్‌లో హోటళ్లతోపాటు మెడికల్ షాప్‌లు, సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాల్లో హోటళ్లను ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి బీ-4 బ్లాక్ స్వాన్ గ్రూప్ పేరుతో రూ.లక్ష మొదలుకొని రూ.కోటి వరకు పెట్టుబడులు సేకరించారు. రెండేళ్లలో పలువురి పెట్టుబడులకు వడ్డీ రూపంలో రూ.లక్షకు నెలకు రూ.3 నుంచి 4 వేలు ఇచ్చారు. తాజాగా సంస్థ ప్రతినిధులు బోర్డు తిప్పేశారు. దీంతో పెట్టుబడులు పెట్టిన బాధితులు లబోదిబోమంటున్నారు. దాదాపుగా రూ.15 కోట్ల పైచిలుకు వసూలు చేసినట్టు తెలిసింది. దీంతో పలువురు బాధితులు హైదరాబాద్‌లోని ఆర్థిక నేరాల విభాగంలో సోమవారం ఫిర్యాదు చేశారు. సిరిసిల్ల, పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే కేసు నమోదైనట్లు సమాచారం. గజ్వేల్ పట్టణంలో ప్రజలు దాదాపుగా రూ.5 కోట్లు.. సిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి, హైదరాబాద్‌లో దాదాపు మరో రూ.10 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టుబడి పెట్టినట్టు తెలుస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన లక్ష్మీకాంత్ బీఫార్మసీ పూర్తి చేశాక గజ్వేల్ పట్టణంలో నివాసం ఉన్నారు. కొద్ది రోజులకు ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చారు. రెండేళ్ల క్రితం బీ-4 బ్లాక్‌స్వాన్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. తనకు పరిచయం ఉన్న వ్యక్తులకు బిజినెస్ ఐడియాలను వివరించారు. లక్ష్మీకాంత్ మాటలు నమ్మిన వారు పెట్టుబడి పెట్టడంతో పాటు పలువురితో పెట్టుబడులు పెట్టించారు. అయితే వారం రోజులుగా బీ-4 బ్లాక్ స్వాన్ గ్రూప్ హోటళ్లు, మెడికల్ షాపులు మూసి ఉండటంతో అనుమానం వచ్చి ఆయనకు ఫోన్ చేయడంతో స్విచ్ఛాఫ్ వస్తోందని బాధితులు చెబుతున్నారు. దీంతో వారు ఆందోళన చెంది పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు.

మహిళా గ్రూపు సభ్యులకు టోకరా!

» రూ.కోటితో కమ్యూనిటీ యాక్టివిస్ట్ ఉడాయింపు

» మహిళలకు బ్యాంకు నోటీసులు

» మెదక్ జిల్లా నందిగామలో ఘటన

రామాయంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకుల్లో రుణాలు పొందిన మహిళా గ్రూపు సభ్యులకు సీఏ(కమ్యూనిటీ యాక్టివిస్ట్) టోకరా ఇచ్చింది. వాయిదాల రూపేణా చెల్లించిన డబ్బు తన సొంతానికి వాడుకోగా.. సభ్యురాళ్లకు బ్యాంకు నోటీసులొచ్చాయి. ఎనిమిది గ్రూపుల సభ్యులకు చెందిన సుమారు రూ.కోటితో ఆమె ఉడాయించగా.. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండలం నందిగామలో సోమవారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన మహిళలు కోఆపరేటివ్ బ్యాంకులో గ్రూపుల పేర రుణాలు పొందారు. ఇందుకు సంబంధించి నెలవారీ కిస్తీలను నేరుగా బ్యాంకులో కాక అదే గ్రామ సీఏ ప్రవీణకు ఇచ్చి ప్రైవేట్ రసీదు తీసుకున్నారు. మహిళలు తమ వద్ద తీసుకున్న రుణం గడువు పూర్తవడంతో ప్రస్తుతం బ్యాంకు వారు వారి ఆస్తులు జప్తు చేస్తామని నోటీసులు జారీ చేశారు. దీంతో ఏం చేయాలో తెలియని సుమారు వందమంది మహిళా సభ్యులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్‌కు ఫిర్యాదు చేశారు. రెండేళ్ల క్రితం కూడా సదరు సీఏపై పోలీసు కేసు నమోదైనట్లు సీఐ తెలిపారు.

11, 12 తేదీల్లో ఐఐటీహెచ్‌లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

» వర్చువల్‌గా ప్రారంభించనున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి

కంది, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ సాంకేతిక సమస్యలను పరిష్కరించడం కోసం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో వ్యవసాయం థీమ్‌పై స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024 గ్రాండ్ ఫినాలే నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా 51 కేంద్రాల్లో జరగనున్న ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌కు ఐఐటీహెచ్ హోస్ట్ చేస్తోంది. ఇందులో రైతులకు ప్రత్యక్ష మార్కెట్ యాక్సెస్ కోసం మొబైల్ యాప్, ఏఐ డ్రివెన్ క్రాప్ డిసీజ్ ప్రిడిక్షన్, అధిక దిగుబడి రావడానికి స్థిరమైన ఎరువుల వినియోగం, స్థిరమైన మార్కెట్ యాక్సెస్ కోసం కాంట్రాక్ట్ ఫార్మింగ్ తదితర అంశాలపై విద్యార్థులు ఆవిష్కరణలను రూపొందించనున్నారు. విద్య, పరిశ్రమల భవిష్యత్తు, వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించేందుకు విద్యార్థులను ప్రోత్సహించడమే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ లక్ష్యంగా పెట్టుకున్నదని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు.

జీవో 510తో అన్యాయం.. జీవితం ముగిస్తున్నా

» నిర్మల్‌లో ఆరోగ్య ఒప్పంద ఉద్యోగి భరత్‌కుమార్ ఆత్మహత్య

» తన చావుతోనైనా అందరికీ న్యాయం జరగాలంటూ సూసైడ్‌నోట్


భరత్ (ఫైల్)

నిర్మల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవో 510తో తనలాంటి ఒప్పంద ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ వకుళాభరణం భరత్‌కుమార్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగిందీ విషాదం. వైద్య, ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగి అయిన భరత్.. ఆరేళ్లుగా తాను ఎంత మనోవేదనకు గురైందీ సూసైడ్ నోట్‌లో రాశాడు. "2018 డీఎస్సీ ద్వారా.. ఆరోగ్యశాఖ ఆర్ఎన్‌టీసీపీ విభాగంలో సీనియర్ ట్రీట్మెంట్ ల్యాబ్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగం పొందాను. జీవితంలో స్థిరపడతానని ఆశించాను. కానీ ఇదే శాఖలో నాకన్నా హోదా తక్కువ ఉన్నవారికి జీతం ఎక్కువగా రావడం.. నా జీతం మాత్రం పెరగకుండా కాంట్రాక్ట్ పద్ధతిలోనే ఉండిపోవడంతో తీవ్రంగా నిరాశ చెందాను. నాలాంటి వాళ్లను రెగ్యులరైజ్ చేసే విషయంలో జీవో 510 అన్యాయం చేసింది" అని భరత్ ఆ లేఖలో పేర్కొన్నాడు. ఆ జీవో వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని.. జీవో 16ను కూడా అమలు చేయొద్దంటూ ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పుతో తీరని అన్యాయానికి గురయ్యామని వాపోయాడు. "ఉద్యోగం రెగ్యులర్ అవుతుందని ఎంతో ఆశతో ఎదురు చూశాను కానీ అది జరగకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాను. నా భార్య పల్లవికి అన్యాయం చేస్తున్నాను. కొడుకు దేవా(2)ను వదిలి వెళ్లిపోతున్నాను. మీ ఇద్దరినీ బాగా చూసుకోవాలని కలలు కన్నాను. కానీ ఉద్యోగం రెగ్యులర్ కాకపోవడంతో మీకు చెప్పినట్లుగా ముందుకు వెళ్లలేకపోయాను" అని ఆవేదన వెలిబుచ్చాడు. ఇంత కాలం పని చేసినందుకుగాను రావాల్సిన పీఎఫ్‌ఎల్ బకాయిలను తన భార్యకు, తల్లికి ఇప్పించాలని సహచర ఉద్యోగులు, ఉద్యోగ సంఘ నాయకులను ఆ లేఖలో కోరాడు. "నా ఆత్మహత్యతో అయినా మిగతా వారికి న్యాయం జరగాలి. ఈ విషయం రాష్ట్రస్థాయిలో తెలిసేలా చూడండి" అంటూ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. చనిపోతున్నందుకు తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పిన భరత్.. తన సహచర ఉద్యోగులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అందరికీ రుణపడి ఉంటానని సూసైడ్‌నోట్‌లో పేర్కొన్నాడు. భరత్ మృతి ఆరోగ్యశాఖ ఉద్యోగుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. అతడి మరణవార్త తెలియగానే.. జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్, ప్రజా ఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్ గౌడ్ తదితరులు అతడి కుటుంబాన్ని పరామర్శించారు. భరత్ కుటుంబానికి న్యాయం చేయాలని.. రూ.10 లక్షలు పరిహారం, అతడి భార్యకు ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు 60 శాతం ఉద్యోగాలివ్వాలి

» రైల్వే మంత్రికి బీఆర్ఎస్ వినతి

న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు 60 శాతం ఉద్యోగాలివ్వాలని కోరుతూ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నేతృత్వంలో వినతిపత్రం అందజేశారు. సోమవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రిని పలు సమస్యలను విన్నవించారు. అంతకుముందు ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ విభజన హామీలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. సుదీర్ఘ పోరాటం తర్వాత ఎట్టకేలకు కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేశారని, కానీ నేటికీ నిధులు కేటాయించలేదని, పనులు ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో చెప్పలేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలపై ప్రజలకు నమ్మకం లేదని, అందుకే తాము ఢిల్లీ వరకు రావాల్సి వచ్చిందని చెప్పారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై ఈ పార్లమెంట్ సమావేశాల్లో సమగ్ర ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, కాజీపేట జంక్షన్‌ను డివిజన్ చేయాలన్నారు. కాజీపేట-బోడగుట్ట ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, కాజీపేట రైల్వే స్టేషన్ పక్కన వీధి వ్యాపారులకు స్టాల్స్ కేటాయించాలని కోరారు.

ఇథనాల్ పరిశ్రమ ఘటన.. 122 మందిపై కేసు

దిలావర్‌పూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక పోరాటంలో పాల్గొన్న నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్థులపై పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. సోమవారం సుమారు 122 మందిపై కేసులు నమోదు చేశారు. అందులో 19 మంది మహిళలు ఉన్నట్లు తెలిసింది. దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసిన సంగతి తెలిసిందే. నవంబరు 26న ఆర్డీవో రత్న కల్యాణిని రోడ్డుపైనే 7 గంటల పాటు నిర్బంధించి, ఆమె కారును ధ్వంసం చేశారు. ఈ ఘటనను పోలీసులు చాలా తీవ్రంగా పరిగణించారు. ఆ మరునాడే ఇథనాల్ పరిశ్రమను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన విరమించారు. ఇంత వరకు బాగానే ఉన్నా తాజాగా పోలీసులు.. నిరసనల్లో పాల్గొన్న వారిపై కేసుల నమోదుకు ఉపక్రమించారు. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఇథనాల్ పరిశ్రమ రద్దు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలపడంతో పాటు కేసులను ఎత్తి వేయాలని గ్రామస్థులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరనున్నట్లు సమాచారం.



కోఠి డీఎంఈ ఆఫీసు వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ఆశాలు, పోలీసులు ఈడ్చిపడేయడంతో తీవ్ర గాయాలతో స్పృహకోల్పోయిన ఆశా వర్కర్

ఆశా వర్కర్లపై పోలీసుల దాష్టీకం

ఈడ్చుకుంటూ వ్యాన్‌లో పడేసిన వైనం.. ఆవేశంతో సీఐపై చేయి చేసుకున్న 'ఆశా'

» పోలీసుల దురుసు ప్రవర్తన

» కాలు విరగడంతో స్పృహ తప్పిన ఓ ఆశా వర్కర్

» ఐదుగురికి స్వల్ప గాయాలు

» డీఎంఈ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం

మంగళ్‌హాట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ ఆందోళన చేపట్టిన ఆశా వర్కర్లపై పోలీసులు జులుం ప్రదర్శించారు. ఏకంగా ఉన్నత స్థాయి అధికారులే రంగంలోకి దిగి.. పలువురు మహిళలను ఈడ్చి వ్యాన్‌లో పడేశారు. మహిళా పోలీసులు ఉన్నా అదుపు చేయలేకపోవడం, పురుష పోలీసులు రంగంలోకి దిగడంతో ఆశా వర్కర్ల ఆందోళన ఒక్కసారిగా అదుపు తప్పింది. ఈ క్రమంలోనే ఓ సీఐపై ఆశా వర్కర్ చేయి చేసుకోవడం.. మరింత ఉద్రిక్తతకు దారి తీసింది. ఆశా వర్కర్లపై పురుష పోలీసులు చేయి చేసుకోవడమే కాకుండా వస్త్రాలను లాగుతూ ఆక్రోశం ప్రదర్శించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు వేతనాన్ని రూ.18వేలకు పెంచాలని కోరుతూ సోమవారం బీఆర్‌పీయూ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 2 వేల మంది ఆశా వర్కర్లు కోఠిలోని డీఎంఈ కార్యాలయం వద్దకు వచ్చారు. తొలుత కార్యాలయం సమీపంలో ఆశా వర్కర్లు శాంతియుతంగా నిరసన తెలుపుతుండగా... భారీగా పోలీసులు మోహరించారు. ఉన్నతాధికారులకు వినతి పత్రం ఇచ్చేందుకు మధ్యాహ్నం వరకు వేచి ఉన్న మహిళలు.. కోఠి ప్రధాన రహదారిపై నిరసన తెలిపేందుకు బారికేడ్లను నెట్టుకుంటూ రోడ్డుపైకి రావడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసేందుకు ఉపక్రమించారు. ఈ క్రమంలో మహిళా పోలీసులు వారిని అదుపు చేయలేకపోవడంతో పురుష పోలీసులు రంగంలోకి దిగి.. దొరికిన వారిని దొరికినట్టు ఈడ్చిపడేసి వ్యాన్‌లోకి ఎక్కించారు. ఈ క్రమంలో రహిమాబీ(39) అనే ఆశా వర్కర్ కాలు విరిగి, తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోయింది. మరో మహిళకు సైతం గాయాలయ్యాయి. డీసీఎంలో ఉన్న ఆశా వర్కర్ ఒకరు ఆవేశంతో సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి చెంప చెళ్లుమనిపించింది. దీంతో అక్కడ ఉన్న మహిళ పోలీసులతోపాటు ఏసీపీ, ఇతర పురుష కానిస్టేబుళ్లు ఆమెను కొడుతూ లాగిపడేశారు. దీంతో అక్కడ ఒక్క సారిగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఆశాలను అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ ఘటనలో రహిమాబీతోపాటు మొత్తం ఐదుగురికి గాయాలు కాగా.. ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఏడాదిగా ప్రతిఅధికారి, మంత్రిని కలిసి హామీని నెరవేర్చాలని కోరగా కనీసం స్పందించలేదని ఆశా వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రావుల సంతోషా ఆరోపించారు.

పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు

ఆశావర్కర్లపై పోలీసుల వ్యవహారశైలికి సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో బీఆర్ఎస్ నేతలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్‌లు ఉస్మానియా ఆస్పత్రిలో రహిమాబీని పరామర్శించారు.

బిగ్‌బాస్ ప్రసారంపై జోక్యం చేసుకోం

» పిటిషనర్‌కు హైకోర్టు స్పష్టీకరణ.. పిల్స్ కొట్టివేత

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బిగ్ బాస్ షో ప్రసారం విషయంలో జోక్యం చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిరాకరించింది. షోలోని కొన్ని సన్నివేశాల ఫొటోలు తమ ముందు ఉంచి ఆషోను నిలిపివేయాలంటే సాధ్యం కాదంది. కేబుల్ టీవీ నియంత్రణ చట్ట నిబంధనలు అనుసరించి ప్రస్తుత పిల్‌లోని అంశాలన్నింటినీ సంబంధిత యంత్రాంగం ముందు లేవనెత్తాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. బిగ్‌బాస్ షోను నిలుపుదల చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. యువతను పెడదారి పట్టించడంతో పాటు అశ్లీలత, హింసాత్మక చర్యలను ప్రోత్సహించేలా ఉన్న బిగ్‌బాస్ షోను రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్య మాత్రమే ప్రసారం చేయాలని, లేదా నిలుపుదల చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త, నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి 2019, 2022లో హైకోర్టులో పిల్స్ దాఖలు చేశారు. వీటిపై వాదనలు ముగిశాక తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం ఇటీవల నిర్ణయం వెల్లడించింది.

నేడు రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో మంగళవారం అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇక సోమవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లా నందిగాం, ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట, రంగారెడ్డి జిల్లా ఫారుఖ్‌నగర్, మంచిర్యాలజిల్లా కన్నెపల్లిలో వర్షాలు కురిసాయని వెల్లడించింది. కొన్నిజిల్లాల్లో ఉదయం వేళల్లో పొగ మంచు ఏర్పడే అవకాశముందని, వచ్చేవారం రోజు ల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పుఉండదని పేర్కొంది.

వైద్య విద్య కళాశాలల్లో ర్యాగింగ్‌పై ఎన్ఎంసీ సీరియస్

» పలు కాలేజీల్లో భారీగా ఫిర్యాదులు.. కట్టడికి చర్యలు తీసుకోవాలి

» రాష్ట్రాల వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాళ్లు, డీన్‌లకు ఎన్ఎంసీ లేఖ

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య కళాశాలల్లో ర్యాగింగ్ రోగం వికృతరూపం దాల్చుతోంది. తెలంగాణలోనూ ఇటీవల నాలుగైదు కాలేజీల్లో ర్యాగింగ్ భూతం జడలు విప్పింది. దేశవ్యాప్తంగా పలు కాలేజీల్లో దీనిపై పెద్దఎత్తున ఫిర్యాదులందినట్లు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) పేర్కొంది. గుజరాత్ రాష్ట్రం ధర్పూర్‌లోని గుజరాత్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సొసైటీ (జీఎంఈఆర్ఎస్) వైద్య కళాశాలకు చెందిన ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థి ఒకరు ఇటీవల ర్యాగింగ్ కారణంగా మరణించాడు. ఒక రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే కళాశాలలో ర్యాగింగ్ వల్ల విద్యార్థి చనిపోవడాన్ని ఎన్ఎంసీ సీరియస్‌గా తీసుకుంది. ఇటీవలికాలంలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల నుంచి ర్యాగింగ్‌పై ఎన్ఎంసీ యాంటీ ర్యాగింగ్ సెల్‌కు వరుసగా ఫిర్యాదులు అందుతున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ ముప్పును అరికట్టడంపై తీసుకోవాల్సిన చర్యలపై తాజాగా అన్ని రాష్ట్రాల వైద్యవిద్య సంచాలకులు, కాలేజీల ప్రిన్సిపాళ్లు, డీన్‌లకు లేఖ రాసింది. కళాశాలల్లో సురక్షిత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఎన్ఎంసీ హెచ్చరించింది.

ఐఐటీ, ఐఐఎంలలో రిజర్వేషన్లను అమలుచేయాలి

» అఖిల భారత ఓబీసీ విద్యార్థి సంఘం డిమాండ్

న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఐఐఎంలు, కేంద్రప్రభుత్వ సంస్థల్లో రిజర్వేషన్లను అమలుచేయాలని కేంద్రప్రభుత్వాన్ని అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం డిమాండ్ చేసింది. 2 ఐఐటీలు, 3 ఐఐఎంలలో రిజర్వేషన్లను అమలుచేయక 90శాతానికి పైగా అధ్యాపక ఖాళీల్లో జనరల్ కేటగిరీ అభ్యర్థులను నియమించినట్లు ఆర్టీఐ ద్వారా తేలిందని ఆరోపించింది. సోమవారంనాడిక్కడ ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాజ్యసభ ఎంపీ పి.విల్సన్, అఖిల భారత ఓబీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు గౌడ్ కిరణ్‌కుమార్, జాతీయ సలహాదారు ఆళ్ల రామకృష్ణ, మాజీ ఎంపీ రాపోలు ఆనంద్‌భాస్కర్ మాట్లాడారు. 13 ఐఐఎంలలోని అధ్యాపకుల్లో జనరల్ కేటగిరీ వారు 82శాతం, ఎస్సీలు 5శాతం, ఎస్టీలు ఒకశాతం, ఓబీసీలు 9.6శాతం ఉన్నారని కిరణ్ కుమార్ తెలిపారు. 21 ఐఐటీల్లో 80శాతం జనరల్ కేటగిరీ, ఆరు శాతం ఎస్సీలు, 1.6 శాతం ఎస్టీలు, 11.2శాతం ఓబీసీలు ఉన్నారన్నారు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అధ్యాపక స్థానాల్లో ఉన్న వేలాది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు.

సైబర్‌క్రైమ్ కింగ్‌పిన్ కోసం.. ఢిల్లీ పోలీసుల వేట.. హైదరాబాద్‌లో అరెస్టు

» విదేశీ ఉద్యోగాల పేరిట మోసాలు

» థాయ్‌లాండ్, లావోస్‌కు తరలింపు

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చైనా చీటర్లతో చేతులు కలిపి.. మన వాళ్లను ఇండోనేషియా, లావోస్ వంటి దేశాల్లో బందీలుగా చేసుకుని.. కట్టుబానిసలుగా సైబర్ నేరాలు చేయిస్తున్న ముఠాకు చెందిన కింగ్‌పిన్ ఆటను ఢిల్లీ పోలీసులు, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు కట్టించారు. చిక్కు-దొరకడు అన్నట్లుగా ఢిల్లీ నుంచి రాష్ట్రాలు.. నగరాలు.. మారుతూ.. సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డులను మారుస్తూ తప్పించుకు తిరుగుతున్న సైబర్ కేటుగాడు కమ్రాన్ హైదర్ హైదరాబాద్‌లో పట్టుబడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. న్యూఢిల్లీలోని ఫ్రెండ్స్ కాలనీకి చెందిన ప్రకాశ్ అనే వ్యక్తి విదేశాల్లో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న క్రమంలో.. ఢిల్లీలో కమ్రాన్ హైదర్ నడిపే అలీ ఇంటర్నేషనల్ జాబ్ సర్వీసెస్‌ను సంప్రదించాడు. అక్కడి సిబ్బంది థాయ్‌లాండ్ లేదా లావోస్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. కొన్నాళ్లకు థాయ్‌లాండ్‌లో ఉద్యోగం వచ్చినట్లు చెప్పారు. దీంతో థాయ్‌లాండ్ వెళ్లిన ప్రకాశ్‌ను అక్కడ కలిసిన కమ్రాన్ మనుషులు వెంట తీసుకెళ్లారు. ఆ తర్వాత ప్రకాశ్ పాస్‌పోర్టును లాక్కొని, చైనాకు చెందిన చీటర్లకు అప్పగించారు. వారు ప్రకాశ్‌తో బలవంతంగా ఆన్‌లైన్‌లో సైబర్ నేరాలు చేయించారు. టార్గెట్లు పూర్తిచేయకుంటే.. తిండిపెట్టకుండా మాడ్చడం, గదుల్లో రోజుల తరబడి నిర్బంధించడం, అప్పటికీ మొండికేస్తే కరెంటు షాకులు ఇవ్వడం చేస్తుంటారు. చైనీయుల చెర నుంచి అతి కష్టమ్మీద బయటపడి, భారత్‌కు చేరుకున్న ప్రకాశ్.. మే 27న న్యూఢిల్లీలోని ఫ్రెండ్స్ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐరోపా దేశాలు, అమెరికాకు చెందిన పౌరులను లక్ష్యంగా చేసుకుని, సైబర్ నేరాలకు పాల్పడడమే ఈ ముఠా విధించే టార్గెట్ అని పేర్కొన్నారు. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. మనుషుల అక్రమ రవాణా కోణంలో ఎన్ఐఏ కూడా దర్యాప్తు ప్రారంభించింది. ఈ క్రమంలో.. చైనా చీటర్లతో ముంబైకి చెందిన సుదర్శన్ దరాడేకు సంబంధాలున్నాయని, ఆయన తన లాంగ్‌షెంగ్ అనే కంపెనీ ద్వారా లావోస్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అయితే.. అప్పటికే సుదర్శన్‌ను ముంబై పోలీసులు అరెస్టు చేశారు. కమ్రాన్ హైదర్‌తోపాటు.. అతని ముఠాకు చెందిన మంజూర్ ఆలం, సాహిల్, ఆశిష్, పవన్ యాదవ్ కోసం ఢిల్లీ సైబర్‌క్రైమ్ పోలీసులు, ఎన్ఐఏ బృందాలు వేట ప్రారంభించాయి. కమ్రాన్ మహారాష్ట్రలో ఉన్నట్లు సమాచారం అందడంతో అతణ్ని అరెస్టు చేసేందుకు బయలుదేరాయి. అయితే.. కమ్రాన్ ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్లను, సిమ్‌కార్డులను మారుస్తూ తప్పించుకునేవాడు. ఈ క్రమంలో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లిన కమ్రాన్ కోసం గాలింపు చేపట్టారు. చివరకు హైదరాబాద్ మీదుగా థాయ్‌లాండ్ పారిపోయేందుకు యత్నిస్తున్నట్లు తెలుసుకుని, ఆదివారం రాత్రి నాంపల్లిలో అరెస్టు చేశారు.

బ్యాటరీ పేలి ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం


దగ్ధమైన ఎలక్ట్రిక్ స్కూటీ

భీమదేవరపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చార్జింగ్ అవుతుండగానే బ్యాటరీ పేలి ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధమైన ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముత్తారంలో జరిగింది. గ్రామానికి చెందిన కాశిరెడ్డి ఆదిరెడ్డి ఏడాది క్రితం ఓ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ స్కూటీని కొనుగోలు చేశాడు. సోమవారం తెల్లవారు జామున ఆయన దానికి చార్జింగ్ పెట్టగా.. చార్జింగ్ అవుతుండగానే బ్యాటరీ పేలి స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. దీంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. తాను కొనుగోలు చేసిన సమయంలో నిర్వాహకులు సదరు స్కూటీ బ్యాటరీ లిథియంతో చేసిందని, ఆటో కట్ కావడంతో పేలదని చెప్పారని, కానీ పేలడంతో తాను తీవ్రంగా నష్టపోయానని ఆదిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సిరియా...కొత్త భయాలు

నిరంకుశుడైన పాలకుడు గద్దెదిగితే సంతోషించాల్సిందే. అధికారం కోసం లక్షలాదిమందిని జైళ్ళలోకి నెట్టి, చిత్రహింసలుపెట్టి, ఊచకోతలు కోసినవాడైతే మరీనూ. నిర్దాక్షిణ్యంగా శత్రుసంహారం చేస్తూ దశాబ్దాలుగా అధికారాన్ని నిలబెట్టుకుంటూ వచ్చిన సిరియా అధ్యక్షుడు బషర్–అల్ అసద్ కోట ఇంత సునాయసంగా కూలుతుందని, పెళ్ళాం పిల్లలతో సహా పుతిన్ పంచన చేరుతాడని ఎవరూ అనుకొని వుండరు. అధికారంలో ఉన్నంతకాలం నియంతలను మించి నిరంకుశంగా కనిపించిన అసద్ ఇలా కూలిపోవడం, పిరికివాడిలాగా పారిపోవడం చాలామందికి నచ్చింది. అసద్ కుటుంబం ఉక్కుపిడికిలినుంచి ఐదు దశాబ్దాల తరువాత సిరియా బయటపడింది, నవశకం ఆరంభమవుతోంది. నిరంకుశపాలన అంతమైనందుకు సంతోషించాల్సిందే కానీ, రేపటిదాని ప్రయాణం ఏ దిశగా ఉంటుందన్నది భయపెడుతున్న ప్రశ్న.

నియంతృత్వం పోయినంతమాత్రాన ప్రజాస్వామ్యం నెలకొంటుందని హామీ ఏమీ లేదు. సిరియా మరో కొత్తసంక్షోభం వైపు ప్రయాణిస్తున్నదని, అది ప్రపంచానికి ప్రమాదం తేవచ్చునని కొందరు విశ్లేషకుల అభిప్రాయం. అసద్‌ను కూల్చడానికి అవసరార్థం ఒక్కటైన శక్తులన్నీ తమ దీర్ఘకాలిక ఎజెండాలు, ప్రయోజనాలను తాత్కాలికంగా పక్కనబెట్టి ఒక్కటిగా సాగే ప్రయత్నాలైతే చేస్తున్నాయి. ఎవరిపాత్ర ఎంతో నిర్దిష్టంగా నిర్వచించుకొని ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని, ఘర్షణలకు తావులేని పాలన అందిస్తామని, ప్రజాస్వామికంగా నడుస్తామని, పొరుగుదేశాల్లో కాళ్ళూవేళ్ళూ పెట్టబోమని తిరుగుబాటుదారులు ప్రపంచానికి హామీ ఇస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. అంతర్జాతీయ సమాజం ఆమోదంకోసం, అగ్రరాజ్యాల సాయం కోసం ఆ మాత్రం చేయవలసిందే. అసద్ నిష్క్రమణ పశ్చిమాసియాకు మాత్రమే కాక, యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేసే పరిణామం. ఇరాన్, హిజ్బొల్లా, రష్యా సాయంతో శత్రువులను దశాబ్దాలుగా తట్టుకొని నిలిచిన అసద్, ప్రధానంగా పుతిన్ వైఖరిలో మార్పుతో ఒక్కసారిగా ఒంటరి అయిపోయాడు. ఇరాన్ బలహీనపడటం, ఇజ్రాయెల్ బలపడటం, ఉక్రెయిన్ యుద్ధం ముగింపు, టర్కీనుంచి లక్షలాదిమంది శరణార్థులు తిరిగి సిరియాకు వెనక్కు పోవడం ఇత్యాది భావి పరిణామాలను విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

భారత్–సిరియా మధ్య దౌత్యసంబంధాలు ఏర్పడి వచ్చే ఏడాదికి డెబ్బైఐదేళ్ళవుతాయి. 1957లో అమెరికా వెడుతూ మార్గమధ్యంలో నెహ్రూ సిరియాలో దిగితే, ఆ సందర్భంగా అక్కడ ఒక వీధికి ఆయన పేరుపెట్టిన గతాన్ని మీడియా ఇప్పుడు గుర్తుచేస్తోంది. లౌకికవాదానికి కట్టుబడిన అసద్ కుటుంబం అధికారంలో ఉన్నంతకాలం భారతదేశానికి తమనుంచి ఏ ఇబ్బందీ రానివ్వలేదు. కశ్మీర్‌సహా కీలకమైన విషయాల్లో అంతర్జాతీయ వేదికలమీద సైతం సిరియా మనపక్షాన నిలబడింది. కశ్మీర్‌కు ప్రత్యేకప్రతిపత్తిని తొలగించినప్పుడు కూడా అది భారత్ అంతర్గత విషయమని సిరియా తేల్చేసింది. అంతర్జాతీయ వేదికలమీద మనపై విరుచుకుపడే టర్కీ ఎర్డొగాన్ కంటే అసద్ ఉత్తమం. రష్యాతో మన సాన్నిహిత్యం వల్లనో, పుతిన్ కారణంగానో మన పక్షాన ఉంటూవచ్చిన సిరియా ఇప్పుడు ప్రధానంగా ఇస్లామిక్ స్టేట్ అనుబంధ సంస్థ (హెచ్‌టీఎస్) సహా వివిధ రకాలైన తిరుగుబాటుదారుల చేతుల్లోకి పోవడం ప్రమాదకరమే. అసద్‌కు వ్యతిరేకంగా పోరాడిన శక్తుల్లో పాకిస్థాన్‌నుంచి వెళ్ళిన కొన్ని ముఠాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి.

తనకు గ్లోబల్ ఎజెండాలు లేవని, సిరియాకు మాత్రమే పరిమితంగా కార్యకలాపాలు ఉంటాయని హెచ్‌టీఎస్ అంటున్నప్పటికీ, అది ఒక ఇస్లామిస్టు సంస్థ అన్నది నిజం. మానవ, మహిళా, మైనారిటీ హక్కులకు హామీ ఇస్తున్న ఆ సంస్థ అధికారంలో కుదురుకున్న తరువాత ఏ విధంగా వ్యవహరిస్తుందో చూడాలి. భిన్న మతాలు, తెగలు, విభజనలు ఉన్న సమాజాన్ని సయోధ్యతో కాక, అణచివేతతో ఏలాలని ప్రయత్నించిన అసద్ వంటివారు ఎప్పటికైనా కూలిపోక తప్పదు. అసద్ పతనం, అతడి విగ్రహాల కూల్చివేత తదితర దృశ్యాలు చూసినవారికి ఇరాక్ గత పాలకుడు సద్దాం హుస్సేన్ గుర్తుకొచ్చాడు. అణ్వాయుధాలున్నాయన్న ఆరోపణతో, ఇరాక్‌లో చొరబడి సద్దాంను అమెరికా దించివేసిన అనంతరం పలు ఉగ్రసంస్థలు పడగవిప్పి ప్రపంచాన్ని వణికించిన విషయం తెలిసిందే. సిరియాలో అధికారమార్పిడి అలాంటి ఒక కొత్తసమస్య తెచ్చిపెట్టకపోతే అదేచాలు.

టీకప్పులో తుఫాను!

ప్రాంతం, భాష, కులం తదితర ప్రాతిపదికల మీద ఏర్పడే సంఘాలు ఎక్కడైనా సరే–తమ అస్తిత్వ పరిరక్షణ కోసం పుడతాయి. ఐక్యంగా ఉంటూ ఒకరికొకరు తోడుగా నిలవడం ద్వారా బలపడతాయి. ఆ సంఘాలు ఎదిగిన తర్వాత వాటి కార్యక్షేత్రం విస్తరిస్తుంది. అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం, తమ సంఘానికి మూలమైన లక్షణాన్ని మరింత సుసంపన్నం చేసుకునే దిశగా అడుగులు వేయడం చేస్తాయి. అమెరికాలో తెలుగువారు స్థిరపడడం మొదలైన తర్వాత, తమను తాము ఐక్యంగా ఉంచుకుంటూ, బలంగా ఆత్మవిశ్వాసంతో కనిపించడానికి తొలి తెలుగు సంఘంగా తానా (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) ఆవిర్భవించింది. తర్వాతి కాలంలో ఇతర సంఘాలు అనేకం యావత్తు అమెరికా కార్యక్షేత్రంగానూ, అమెరికాలో వివిధ ప్రాంతాలవారీగానూ కూడా పుట్టుకొచ్చాయి. అనేక తెలుగు సంఘాలు తమదైన మార్గాల్లో కార్యశీలతను నిరూపించుకుంటున్నాయి. అయితే అందరి సమష్టి లక్ష్యం మాత్రం ఒక్కటే. అమెరికాలోని తెలుగువారికి అండగా ఉండడం, అలాగే తెలుగు ప్రాంతాల్లో సుస్థిర అభివృద్ధికి తమవంతు చేయూతను అందించడం.

అమెరికాలోని తెలుగువారికి ఏ ఆపద వచ్చినా మొదటగా గుర్తుకు వచ్చేది తానా. ఇది అమెరికాలో ఆవిర్భవించిన తొలి తెలుగు సంస్థ. తొలినాటి నుంచి ఇవాళ్టివరకు అటు అమెరికాలోనూ, ఇటు తెలుగు నేల మీదా నిరుపమానమైన సేవలు అందిస్తూనే ఉంది. అలాంటి తానాలో నిధుల వినియోగానికి సంబంధించి ఇప్పుడు టీకప్పులో తుఫాను లాంటి ఒక వివాదం రేగింది. అది సర్దుకునే క్రమంలో యావత్ అమెరికాలోని తెలుగు సంఘాల మీద బురద చల్లి వికృతానందం పొందే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగు సంఘాల పాత్రను, సేవా ప్రస్థాన క్రమాన్ని గుర్తుచేసుకోవడం అవసరం.



'పళ్ల చెట్టుకే రాళ్ల దెబ్బలు' అని సామెత. పని చేసే సంఘాలకే చిన్న చిన్న ఇబ్బందులు కూడా ఎదురవుతుంటాయి. ఇటీవల తానాలో పుట్టిన నిధుల దుర్వినియోగపు దుమారం కూడా అలాంటిదే.

ఇక్కడి తెలుగువారికి అనేక రీతులుగా అండగా ఉండడంతో పాటూ, సామాజిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటూ–ప్రమాదవశాత్తూ తెలుగువారు ఎవరైనా వివిధ కారణాలతో చనిపోయినప్పుడు వారిని స్వదేశానికి పంపించడంలో అనేక సంవత్సరాలుగా తానా టీమ్ స్క్వేర్ చేస్తున్న కృషి ఎనలేనిది. బాధితులు దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు అందించే అనుపమాన సాయం ఇది. అదేవిధంగా తానా రెండు తెలుగు రాష్ట్రాలకు అనేక సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తున్నది. రహదారుల నిర్మాణం, పాఠశాలలకు కంప్యూటర్లు, ఉచిత వైద్యశిబిరాలు, చైతన్య స్రవంతి పేరుతో రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇలా అనేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అదేవిధంగా నాట్స్, ఆటా, నాటా మొదలైన తెలుగు సంస్థలు అమెరికాలో తెలుగు సంస్కృతిని కాపాడడంలో ఎనలేని కృషి చేస్తున్నాయి.

అమెరికాలోని తెలుగు సంఘాలు సాహిత్య, భాషాసేవలో చేస్తున్న కృషి ప్రత్యేకమైనది. ఈ విషయంలో తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న కృషి కంటె విశిష్టమైన కృషి అమెరికాలోని ఈ తెలుగు సంఘాలు నిర్వహిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. తానా అమెరికాలోని విద్యార్థులకు తెలుగు నేర్పడానికి తానా పాఠశాలను నిర్వహిస్తోంది. కళాశాల పేరుతో కర్ణాటక సంగీతం, కూచిపూడి, భరతనాట్యం మొదలైన సాంప్రదాయ నృత్యాలను నేర్పిస్తున్నారు.

చిన్న పిల్లలకు తెలుగు భాషలో శిక్షణ ఇవ్వడంలో సిలికానాంధ్ర చేస్తున్న ప్రయత్నాల్ని, నిర్వహిస్తున్న పాఠశాలల్ని ప్రత్యేకంగా ప్రస్తావించాలి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎల్‌కేజీ నుంచి పూర్తిగా ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో చదువుతూ పిల్లలు తెలుగు భాషకు దూరమవుతున్న పరిస్థితిలో– అమెరికాలో సిలికానాంధ్ర నిర్వహిస్తున్న పాఠశాలలు ఆ పాత్రను నిర్వర్తిస్తున్నాయి. అమెరికాలోని భవిష్యత్తరాలకు చెందిన ఏ తెలుగు యువతరం పూర్తిగా తెలుగు భాషకు దూరం కాకూడదనే సంకల్పంతో సిలికానాంధ్ర ఇలాంటి తెలుగు భాషా పాఠశాలలను నిర్వహిస్తోంది.

సాహిత్య సేవలో కూడా అమెరికాలోని ప్రతి తెలుగు సంఘమూ ఏదో ఒక స్థాయిలో తమ పాత్రను నిర్వర్తిస్తూనే ఉన్నది. తానా, ఆటా సంస్థలు ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే తెలుగు నవలల పోటీలు ఇప్పటి దాకా ప్రపంచవ్యాప్తంగా అతి ప్రతిష్ఠాత్మకమైన నవలల పోటీలుగా గుర్తింపు తెచ్చుకున్నాయి. తెలుగు నవలకు అత్యధిక పారితోషికం ప్రకటించి పోటీలు నిర్వహిస్తున్న సంస్థలు కూడా ఇవే. వీరి ప్రయత్నాల ద్వారా ప్రతి ఏడాదీ తెలుగులో అత్యుత్తమ నవలా సాహిత్యం క్రమం తప్పకుండా వెలుగులోకి వస్తున్నదంటే అతిశయోక్తి కాదు. నాటా వంటి అనేక సంస్థలు తమ వార్షికోత్సవాల సందర్భంగా పోటీలు నిర్వహించి ఉత్తమ సాహిత్యానికి పురస్కారాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నాయి. తెల్సా వంటి సంస్థ లక్ష రూపాయల విలువైన బహుమతులతో పోటీలు ప్రకటించి తీరా పోటీలు పూర్తయిన సమయానికి మూడు లక్షల రూపాయల విలువైన బహుమతులు ఇవ్వడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. కొన్ని సంస్థలు కేవలం భారత్‌కు వెలుపల ఉన్న తెలుగు సాహిత్యకారుల నుంచి మాత్రమే రచనల్ని ఆహ్వానిస్తూ పోటీలు నిర్వహిస్తున్నాయి. తద్వారా విదేశాలలో స్థిరపడిన తెలుగు సాహిత్యాసక్తి గలవారిలో సృజన ఎప్పటికీ పలచబడిపోకుండా కాపాడుతున్నాయి.

తెలుగు సంఘాలు కళా సాంస్కృతిక రంగాల్లో అందిస్తున్న సేవలది ఒక ప్రత్యేక అధ్యాయం. గిన్నిస్ బుక్ రికార్డులు సాధించే స్థాయిలో కూచిపూడి నృత్య భారీ ప్రదర్శనలు ఏర్పాటు చేసిన ఘనత సిలికానాంధ్రదే. భరతనాట్యం, కూచిపూడి, శాస్త్రీయ సంగీతం నేర్చుకోదలచిన అమెరికాలోని వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. అలాగే నేర్చుకున్నవారు ప్రదర్శనలు ఇవ్వడానికి తెలుగు సంఘాలే ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాయి. అమెరికాలో ఏ తెలుగు సంఘం వార్షికోత్సవాలు, వేడుకలు జరిగినా సరే తెలుగు ప్రాంతాల నుంచి కళాకారులను పిలిపించడం, వారి ప్రదర్శనలను ఏర్పాటు చేయడం అనేది ఒక సాంప్రదాయంగా కొనసాగుతోంది. కేవలం శాస్త్రీయ కళలు మాత్రమే కాదు, జానపద కళారూపాలకు కూడా అమెరికాలోని తెలుగు సంఘాల నుంచి అందుతున్న ప్రోత్సాహం అనల్పమైనది.

'పళ్ల చెట్టుకే రాళ్ల దెబ్బలు' అని సామెత. పనిచేసే సంఘాలకే చిన్న చిన్న ఇబ్బందులు కూడా ఎదురవుతుంటాయి. ఇప్పుడు తానాలో పుట్టిన నిధుల దుర్వినియోగపు దుమారం కూడా అలాంటిదే. కొన్ని సంఘాలలో కొందరివల్ల చిన్న చిన్న ఆటంకాలు కొన్నిసార్లు కలుగుతాయి. వాటి గురించి ఎక్కువగా భయపడడం మంచిది కాదు. వ్యక్తుల వల్ల ఏర్పడే ఒడిదొడుకులు వల్ల తెలుగు సంఘల ప్రతిష్ఠకు, మనుగడకు ఎలాంటి ప్రమాదం లేదు.

○ కృష్ణమోహన్ దాసరి
జర్నలిస్టు, డల్లాస్

కాంగ్రెస్ ఏడాది పాలనలో తెలంగాణ

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఒక్క సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంలో విజయోత్సవాలు చేసుకోవడం సహజమే. విజయోత్సవాలు జరుపుకునే సందర్భంలో తాము ఏం సాధించాం అనేది చెప్పడం మన సంప్రదాయంలో పరిపాటి. అయితే, ఈ సంవత్సర కాలంలో ఏమైనా పొరపాట్లు చేశామా, తప్పుడు నిర్ణయాలు తీసుకున్నామా అని ఆత్మ పరిశీలన చేసుకునే సత్సంప్రదాయం లేకపోవడం పాలక పార్టీలు బలహీనపడడానికి కారణమవుతుందనడం సత్యదూరం కాదు. ఈ విషయంలో బీఆర్ఎస్ ఓటమే ఒక పెద్ద ఉదాహరణ. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర నిర్వహించిన ఆ పార్టీ అప్పుడప్పుడు ఆత్మపరిశీలన చేసుకొని ప్రజాభిప్రాయాన్ని అంచనా వేసే పద్ధతి అవలంభించి ఉంటే అంత సులభంగా ఓడిపోయేది కాదు. ఏ పార్టీకైనా ఒక్క విజయం కొంతకాలమే నిలుస్తుంది. పోయిన ఎన్నికలలో చాలా 'హంగులు' ఉన్న భారతీయ జనతా పార్టీ సైతం జాతీయ స్థాయిలో మెజారిటీ సాధించలేక పోయింది. ప్రజలు ఒక పార్టీని ఓడించి, మరో పార్టీని గెలిపించి తమకు మెరుగైన పాలన, తమ సమస్యలకు ఏదో పరిష్కారం రాకపోతుందా అని ఎదురుచూస్తుండే ఆశాజీవులుగా మిగిలిపోతున్నారు.

కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో కొన్ని వాగ్దానాలు చేసింది. గెలిచిన తర్వాత ఆ వాగ్దానాలను అమలు చేయడానికి తలక్రిందులు అవుతోంది! బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల మీద వడ్డీలు కట్టడం, అలాగే అప్పులో కొంతభాగం తీర్చడంలో ఆర్థిక వెసులుబాటు లేకుండా పోయింది. రైతాంగం అప్పులు మాఫీ చేయడానికి ఎంత ఇబ్బందిపడ్డారో చూసాం. ఈ రుణ మాఫీ సైతం రైతులు అందరికీ చేయలేకపోయారు. ఇక కౌలు రైతుల రుణాల సమస్య తీవ్ర సవాలుగానే ఉంది. కాంగ్రెస్ ఏడాది పాలనలో కౌలు రైతులు కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ మధ్యే ఇందిరా పార్కులో జరిగిన పబ్లిక్ హియరింగ్ (Public Hearing)లో అలా భర్తలను కోల్పోయిన మహిళలు కళ్ళనీళ్ళు పెట్టుకొని తమ దీనగాథను మనసు చలించేలా చెప్పారు. సీనియర్ నాయకులు కోదండరెడ్డి నాయకత్వంలో ఒక కమిషన్ నేర్పాటు చేశారు. ఈ కమిషన్, బాధిత కుటుంబాలవారు ఎదుర్కొంటున్న సమస్యలు విని విశ్లేషించి, సమస్యల పరిష్కారానికి చేపట్టవలసిన చర్యల విషయమై ప్రభుత్వానికి సముచిత సలహాలు ఇస్తుంది. మరి వాటిని ఎలా అమలు చేస్తారో వేచి చూడవలసిందే.

రైతుల సమస్యకు అంతిమ పరిష్కార మార్గం స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలుపరచడమే. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు కనీస ధరను, స్వామినాథన్ సిఫారసు మేరకు నిర్ణయించి, అమలు చేయడమే పరిష్కారం. పారిశ్రామికవేత్తలు తాము ఉత్పత్తి చేసిన వస్తువుకు ధర నిర్ణయించి మార్కెటులో అమ్ముతారు. రైతాంగానికి ఆ వెసులుబాటు లేకపోవడం వ్యవసాయరంగ దుస్థితికి మూలకారణం. రైతుల దురవస్థలను తొలగించాల్సింది ఎవరు? ప్రభుత్వమే కదా. అది దాని విధ్యుక్త ధర్మం. ఆ బాధ్యతను నిర్వహించమనే పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రైతులు రాజీలేని పోరాటం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో ఈ సమస్యకు సరైన పరిష్కారంతో ప్రజల ముందుకు



ఏడాది పాలన విజయోత్సవాలు ఆత్మ పరిశీలన సహితంగా జరగాలి. అభివృద్ధి నమూనాపై కొత్త ఆలోచనలు చేయాలి. ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణ భద్రతకు హాని చేయని పారిశ్రామికీకరణకు ప్రాధాన్యమివ్వాలి. విద్యాకమిషన్ సలహాల మేరకు విధాన నిర్ణయాలు తీసుకోవాలి. ప్రజాస్వామ్య పునరుద్ధరణపై చిత్తశుద్ధి చూపాలి. ప్రభుత్వపరంగా జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుని సుపరిపాలననందించడం తెలంగాణలోను, దేశ వ్యాప్తంగాను జాతీయ కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుకు అత్యవసరం.

వస్తుందా అన్నది ఆ పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఈ దేశంలో నయా ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీయే కదా? ఆ నమూనాని ఇప్పటి కేంద్ర ప్రభుత్వం అత్యంత వేగంగా అమలుచేస్తున్నది. ఈ అభివృద్ధి నమూనా సమస్యలు సృష్టిస్తుందే తప్ప పరిష్కారాలను కాదు. ఆ అభివృద్ధి నమూనా అమానవీయమైనదిగా (Ruthless) ఉద్యోగాలను సృష్టించలేనిదిగా (Jobless) జోసెఫ్ స్టిగ్లిట్జ్ (నోబెల్ ఆర్థిక పురస్కార గ్రహీత) పేర్కొన్నాడు. ఈ అంశం మీద గత రెండు దశాబ్దాలుగా చాలామంది వ్రాస్తూనే ఉన్నారు. తెలంగాణలో లోతైన చర్చ కూడా జరుగుతున్నది. రాజకీయ పార్టీలో ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమిలోని ఇతర పార్టీలు ప్రత్యామ్నాయ నమూనాని ప్రతిపాదించగలవా అన్నది ఇప్పుడు మన దేశం ముందు ఉన్న చావు బతుకుల సమస్య.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగానే అమలు చేస్తోంది. గ్యాస్ సబ్సిడీ ఇస్తున్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ సరఫరా చేస్తున్నారు, ఆరోగ్యశ్రీ పథకాన్ని విస్తరించి పరిమితిని పదిలక్షలు చేసారు. అందరికీ నాణ్యమైన వైద్యం ప్రభుత్వ రంగంలో అందేలా చర్యలు తీసుకోవాలి. ఈ చర్యలు తీసుకున్నా తెలంగాణ ప్రభుత్వం తనకు తాను కొన్ని సమస్యలను సృష్టించుకుంటున్నది. పారిశ్రామికీకరణలో భాగంగా అమెరికా వెళ్ళి పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపింది. చాలా ఉత్సాహంగా ముందుకు వచ్చాయి ఫార్మా కంపెనీలు. కాని ప్రపంచంలో చాలా దేశాలు ఈ పరిశ్రమను వదులుకుంటున్నాయి. మందుల ఉత్పత్తి చాలా ఖర్చుతో కూడుకున్నది. ఫార్మా పరిశ్రమలు విసర్జించే వ్యర్థ, విష పదార్థాలు పర్యావరణ భద్రతకు హాని చేకూర్చేవి. జల, వాయు కాలుష్యాలు సరేసరి. అందుకే సంపన్న దేశాలు ఆ పరిశ్రమలను అభివృద్ధి చెందుతున్న దేశాలకు తరలిస్తున్నాయి. కనుకనే భారత్ లాటి వర్ధమాన దేశాలు అడిగనదే తడవుగా చాలా పెద్ద ఎత్తున వస్తాయి. ఈ పరిశ్రమ అనుభవం దాని పర్యవసానం మన పటాన్‌చెరువు ప్రాంతాన్ని చూస్తే అర్థమవుతుంది. ఈ మొత్తం అనుభవాన్ని పాత్రికేయుడు చంద్రశేఖరశర్మ చాలా వివరంగా తన పుస్తకం 'ఒక విధ్వంసం'లో వ్రాసారు. ఆ పుస్తకాన్ని చదివినవారెవ్వరూ ఫార్మా పరిశ్రమను ఆహ్వానించరు. అలాగే ఇంధన సమృద్ధిని సమకూర్చుకోవడానికి ఇథనాల్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంట్లో భాగంగా తెలంగాణలో ఇలాంటి ముప్పై పరిశ్రమలు పెట్టాలనుకుంటున్నారు. రాష్ట్ర పాలకులు ఈ నిర్ణయాలు అమలు చేసే ముందు నారాయణపేట జిల్లా చిత్తనూరు వెళ్ళి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న బాధలు చూస్తే ఫార్మా పరిశ్రమను ప్రోత్సహించరు. మనం మన అనుభవాల నుండి ఎందుకు నేర్చుకోవడం లేదు? ఇది ఒక చిక్కు ప్రశ్న.

ఏ సమాజ అభివృద్ధికైనా విద్య వైద్యం చాలా కీలకమైనవి. బీఆర్ఎస్ సర్కార్‌ని ఏ తప్పుకు అయినా క్షమించవచ్చు కాని విద్యారంగ విధ్వంసం విషయంలో క్షమించడం చాలా కష్టం. తెలంగాణలోని ఏ విశ్వవిద్యాలయం గురించీ ఇప్పుడు గర్వంగా చెప్పుకోలేం. మేము ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులుగా ఉన్నప్పుడు దేశంలో అత్యంత ప్రతిష్ఠ గల ఐదారు విశ్వవిద్యాలయాలలో ఉస్మానియా ఒకటి. బీఆర్ఎస్ ఎందుకు విద్యను ఇంత నిర్లక్ష్యం చేసిందో అర్థం కాదు. ఆ పార్టీ ఓటమికి అదొక బలమైన కారణం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తూనే విద్యావేత్తలు కలిసి ఈ సమస్యను ప్రస్తుత ప్రభుత్వానికి చాలా విపులంగా చెప్పారు. విద్యకు తమ మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన మేరకు 15శాతం బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. మరి 2024–25 వార్షిక బడ్జెట్‌లో గత బడ్జెట్ కంటే కేవలం 0.7శాతం మాత్రమే పెంచారు. విద్యా కమిషన్ నొకదాన్ని ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం పదేపదే చెప్పింది. ఎట్టకేలకు నియమించింది. కమిషన్ ఒకవైపు తన కర్తవ్య నిర్వహణ చేస్తున్న క్రమంలోనే స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఫాషన్ యూనివర్సిటీ అని ప్రకటించారు. ఇలాంటి విశ్వవిద్యాలయాలు ప్రారంభించినపుడు వాటి సాధకబాధకాల గురించి కమిషన్‌కి నివేదిస్తే ఆ నిపుణల సంఘం వాటిని పరిశీలించి ఇచ్చే సలహాల మేరకు విధాన నిర్ణయం చేయడం మంచిది.

ఇక నిరుద్యోగ విషయం ఇదొక అంతు లేని సమస్య. నయా ఆర్థిక విధానాలు ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగుల సంఖ్యను పెంచుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో నియామకాలు ఒక నినాదంగా ముందుకు వచ్చాయి. రాష్ట్రంలో కొన్ని వేల ఉద్యోగాలకి లక్షల మంది పోటీపడుతున్నారు. ప్రభుత్వం అందరికీ ఉద్యోగాలు ఇవ్వలేకపోవచ్చు కాని ఒక సమగ్రమైన ఎంప్లాయ్‌మెంట్ పాలసీ ఉండాలి. ఏ ఏ పరిశ్రమలు ఎక్కువ ఉద్యోగాలను సృష్టించగలవో పరిగణనలోకి తీసుకోవాలి. ఎలాంటి పారిశ్రామిక విధానం కావాలో సమగ్ర సమాలోచనలతో నిర్ణయించుకోవాలి. మొన్నటి ఎన్నికల్లో నిరుద్యోగ యువత పార్టీ గెలుపుకి చాలా శ్రమపడింది. కాంగ్రెస్ నిపుణులతో ఒక కమిటీ వేసి ఈ మొత్తం సమస్యకు పరిష్కారమేమిటో సలహా ఇవ్వవలసిందిగా కాంగ్రెస్ కోరాలి.

కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలు అన్నిటిలో బడ్జెట్‌తో ప్రమేయం లేనిది ప్రజాస్వామ్య పునరుద్ధరణ. తెలంగాణ ప్రజలు ఆకలిదప్పులనైనా భరిస్తారు గాని తమ స్వేచ్ఛ మీద దాడి చేస్తే సహించరని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నప్పుడు ఆయన తెలంగాణ ప్రజల నాడిని తెలుసుకున్న నాయకుడనే భావన కలిగింది. అయితే ఆయన ఏడాది పాలన చూస్తే పోలీసు యంత్రాంగం మరింత దూకుడుగా ఉంది. అధికారంలోకి వస్తూనే ఒక ఎన్‌కౌంటర్ జరిగింది. విజయోత్సవాలు ఒకవైపు జరుగుతున్న సందర్భంలోనే మరో ఎన్‌కౌంటర్ సంభవించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణకు ఆదేశించాలి. తెలంగాణలో బూటకపు ఎన్‌కౌంటర్లు జరగకుండా విధాన నిర్ణయం తీసుకోవాలి. చిన్న చిన్న హాలు మీటింగ్‌లకు అనుమతి ఇవ్వడం లేదు. ఏ చిన్న సభ పెట్టుకోవాలన్నా పోలీసుల అనుమతి కావాలి. పార్టీ మారింది. కొత్త ప్రభుత్వం ప్రజాస్వామ్య పునరుద్ధరణకు హామీ పడింది. అయితే ఆ వాగ్దానం చేశామన్న పట్టింపు కాని, ప్రజాస్వామ్య స్ఫూర్తి కాని కాంగ్రెస్ పాలనలో కనిపించడం లేదు. మీటింగ్ పెట్టుకున్నప్పుడు పోలీసులకి సమాచారం ఇవ్వడం తప్ప వాళ్ల అనుమతులు తీసుకునే విధానానికి స్వస్తి చెప్పాలి.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఒక ఏడాది కాలాన్ని పూర్తిచేసుకున్న సందర్భంలో ప్రభుత్వ సాఫల్య వైఫల్యాలను ఇలా నిష్కర్షగా చెప్పడం సముచితమని భావిస్తున్నాను. పార్టీ హితవరులు చేసే హెచ్చరికల మేరకు ప్రభుత్వపరంగా జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుని సుపరిపాలననందించడం తెలంగాణలోను, దేశ వ్యాప్తంగాను జాతీయ కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుకు అత్యవసరం.

• ప్రొ. జి. హరగోపాల్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్ | editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

హక్కుల దన్నుతోనే ఆత్మగౌరవం

మానవ హక్కుల రక్షణకు 1948 డిసెంబరు 10న ఐక్యరాజ్యసమితి సర్వజన మానవ హక్కుల ప్రకటనను ఆమోదించింది. ఈ సందర్భంగా డిసెంబర్ 10న 'అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం' జరుపుకుంటున్నారు. ఈ ఏడాది "మన హక్కులు, మన భవిష్యత్తు" అనే నినాదంతో ఈ రోజును జరుపుకుంటున్నారు. మనిషి మనిషిగా జీవించడానికి హక్కులు అత్యవసరం. కానీ అనేక సందర్భాల్లో అవి ఉల్లంఘనలకు గురవుతున్నాయి. భారతదేశంలో అనాదిగా పాతుకుపోయిన కుల వ్యవస్థ, అస్పృశ్యత, అంటరానితనం వల్ల బడుగు బలహీన వర్గాలు వివక్షకు గురైనాయి. కులం ఆధారంగా మనుషులపై వివక్ష చూపడం భారతదేశంలో శతాబ్దాలుగా కొనసాగింది. ఇప్పటికీ జైల్లో కూడా కుల వివక్షత కొనసాగుతుంది. ఈ విషయాన్ని ఇటీవల సుప్రీం కోర్టు తప్పుపట్టింది. షెడ్యూల్డ్ కులాల ఖైదీల చేతనే మరుగుదొడ్లు కడిగించడం, ట్యాంకులు శుభ్రం చేయించడం వంటి పనులు చేయించడంపై ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అగ్ర కులాల ఖైదీలకు సులభమైన వంట పనులు అప్పగించడం ముమ్మాటికీ వివక్షే అవుతుందని పేర్కొన్నది. అలాగే అనేక సంఘటనల్లో అమాయకులైన దళిత, గిరిజనులనే నేరస్థులుగా చూపిస్తున్నారు. దీన్ని బట్టి భారతదేశంలో కులం పేరుతో మానవ హక్కుల ఉల్లంఘనలు ఏ మేరకు జరుగుతున్నాయో అర్థమవుతుంది. స్త్రీలు, బాలికలు, వృద్ధులపై హింస పెరుగుతున్నదని నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో పేర్కొనడం ఆందోళనకరం. భారత్‌లో మానవ హక్కుల కమిషన్ మరింత సమర్థవంతంగా పని చేయాలి. కాలం చెల్లిన చీకటి చట్టాలు, సెక్షన్ల వలన ప్రజల వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలుగుతుంది. కావున, వీటిని పునః సమీక్షించి రద్దు చేయాలి. విద్య, వైద్య అవకాశాలు అందరికీ సమానంగా లభించక, దేశ సంపద కొందరి చేతుల్లోనే ఉండడం కూడా మానవ హక్కుల ఉల్లంఘనే. కాబట్టి ప్రభుత్వాలు సంపదను ప్రజాస్వామీకరించి, అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. ప్రజాస్వామ్యిక వాతావరణాన్ని ప్రోత్సహించాలి. అప్పుడే హక్కులు కాపాడబడి, ప్రజలు ఆత్మగౌరవంతో జీవించగలరు.

– ఎస్. విశ్వతేజ, సామాజిక కార్యకర్త
(నేడు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం)

కాలం తాకిడిలో సోషలిజం స్ఫూర్తి

దేశ సర్వోన్నత న్యాయస్థానం – సుప్రీంకోర్టు రాజ్యాంగ వజ్రోత్సవం ముందురోజైన నవంబర్ 25న ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని చెప్పాలి. రాజ్యాంగం అవతారిక (ప్రియాంబుల్)లో 42వ సవరణ ద్వారా చేర్చిన సెక్యులర్, సోషలిస్ట్ పదాలను తొలగించాలంటూ దాఖలైన కేసును కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజయ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో.. ఆ రెండు పదాల స్ఫూర్తిపై గత కొంత కాలంగా కొందరు చేస్తున్న అసంబద్ధ వాదనలను, వారు వ్యాప్తి చేసిన అయోమయాన్ని పటాపంచలు చేసినట్లయింది.

దేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని అనుసరిస్తూ రాజ్యాంగ పీఠికలో 'సోషలిజం' అని, కొన్ని మతాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ 'సెక్యులర్' అని పేర్కొనడం హిపోక్రసీ (కపటత్వం) అని కొందరి వాదన. అందువల్ల ఆ రెండు పదాలను తొలగించాలంటూ 2020లో సుప్రీంకోర్టులో ఓ వ్యక్తి రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దానికి అనుబంధంగా మాజీ రాజ్యసభ సభ్యులు సుబ్రమణ్యస్వామి కూడా మరొక దావా వేశారు. ఈ రెండింటిని కలిపి విచారించిన సుప్రీం కోర్టు ధర్మాసనం సరైన సమయంలో సరైన తీర్పును ఇచ్చింది.

తెలుగులో స్వామ్యవాదంగా పేర్కొనే సోషలిజం పెట్టుబడిదారీ విధానానికి పూర్తి వ్యతిరేకమని చాలామంది భావన. పెట్టుబడిదారీ విధానంలో సామాన్యులు నష్టపోతారని, సంపన్నులకే లాభం అని, అదే సోషలిస్ట్ సమాజంలో అయితే వర్గ విభేదాలు లేకుండా ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవిస్తారని అనేక సంవత్సరాలపాటు ప్రచారం జరిగిన మాట నిజం. నిజానికి 'సోషలిజం'కు విస్తృతార్థం ఉంది. దానిని గ్రహించలేనివారు దానిని తప్పుగా అన్వయించుకొని ఆ పదాన్ని, అదేవిధంగా సెక్యులర్ అనే పదాన్ని రాజ్యాంగ పీఠిక నుంచి తొలగించాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై తీర్పు వెలువరించిన న్యాయమూర్తులు సోషలిజం లేదా సోషలిస్ట్ అనే పదాల విస్తృతార్థాన్ని చక్కగా విడమర్చి వివరిస్తూ.. 'సంక్షేమ రాజ్యానికి కట్టుబడి ఉండటం, సమాన అవకాశాలకు భరోసా ఇవ్వడం సోషలిజం విధానంగా చూడాలి. రాజ్యాంగ పీఠికలో 'సోషలిస్ట్' అనే పదం ఉన్నంత మాత్రాన ఏదో ఒక ప్రత్యేక ఆర్థిక విధానాన్ని అనుసరించాలని నిర్దేశించడం కాదు" అని చెప్పారు.

సోషలిజం అనే భావనను చాలామంది పొరపాటుగా అర్థం చేసుకోవడం వెనుక చారిత్రక నేపథ్యం ఉంది. ముఖ్యంగా, బ్రిటన్, అమెరికాలు అనుసరించిన ఆర్థిక విధానాన్ని పెట్టుబడిదారీ విధానంగా, సోవియట్ రష్యా అనుసరించిన విధానాన్ని సోషలిస్ట్ విధానంగా పిలుచుకోవడం జరిగింది. 20 శతాబ్ది ప్రథమార్థంలో, అంటే భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు, బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత్‌తోసహా ప్రపంచంలోని అనేక దేశాలు పలు పోరాటాలు చేశాయి. వర్ణవివక్ష, అణచివేత, హక్కుల ఉల్లంఘన, ఆర్థిక దోపిడీకి పాల్పడిన బ్రిటీష్ పాలకుల విధానాలను ఒక్క భారత్‌లోనే కాదు.. లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాలు అనేకం తీవ్రంగా వ్యతిరేకించాయి. అదే సమయంలో సోవియట్ రష్యాలో కార్మికవర్గం సంఘటితమై జరిగిన విప్లవం ఈ దేశాలకు స్ఫూర్తి నందించింది. పేదరికం, పీడన, బానిసత్వం వదిలించుకోవడానికి ఉద్యమాలే మార్గంగా భావించి ఆ బాటనే పట్టాయి. రెండవ ప్రపంచయుద్ధంలో 'ఫాసిజం' ఓటమి చెందడంతో సోవియట్ రష్యా అనుసరించే సోషలిస్ట్ నమూనాకు తృతీయ ప్రపంచ దేశాలలో సానుకూలత వ్యక్తం అయింది. అదొక ఆదర్శవాద విధానంగా చూడబడింది. ఆ సమయంలోనే దేశంలో ఉవ్వెత్తున ఎగసిన జాతీయోద్యమంలో పాల్గొన్న వ్యక్తులు, పార్టీల కారణంగా పలు రకాల విధానాలు, పద్ధతులు కలగలిసినప్పటికీ ప్రధానంగా స్వామ్యవాద భావనలు, స్వామ్యవాద విలువలే ప్రజల్ని ఎక్కువగా ఆకర్షించాయి. జాతీయతా భావన అందరిలో పెల్లుబుకింది. స్వాతంత్రోద్యమంలో ప్రధాన భూమిక వహించిన కాంగ్రెస్ పార్టీ 1931లో చేసిన కరాచీ తీర్మానంలో చాలా స్పష్టంగా తమ విధానాన్ని ప్రకటించింది. దేశానికి స్వాతంత్ర్యం సాధించిన తర్వాత దేశ ప్రజల సామాజిక, ఆర్థిక సమానత్వానికి కట్టుబడి పని చేస్తామని తీర్మానించింది.

న్యాయకోవిదుడు నానీ పాల్కీవాలా చెప్పినట్లు 'సోషలిజం' 4 ప్రధాన లక్ష్యాలను నిర్దేశిస్తుంది. అవి : దేశ స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల, ప్రతి ఒక్క పౌరుడికి పని కల్పించడం, ఆదాయాల పంపిణీలో తగిన న్యాయం జరగడం, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడం. ఇదే భారత రాజ్యాంగ స్ఫూర్తి. ఈ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పనిచేసినప్పుడు ప్రతి ఒక్కరికీ ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం సమకూరుతుంది.



స్వతహాగా సోషలిస్ట్ భావాలు గలిగిన డా బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించే బాధ్యత స్వీకరించిన సందర్భంలో "దేశ ప్రజలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యల పరిష్కారానికి సోషలిజం నిజమైన ఔషధాన్ని అందించగలదు" అని అన్నారు. రాజ్యాంగసభలో జరిగిన వాడివేడీ చర్చల సందర్భంగా డా బి.ఆర్. అంబేద్కర్ తన వాదన వినిపిస్తూ "ఆర్థిక విధానం ఎంచుకొనే స్వేచ్ఛను ఇవ్వకుండా భవిష్యత్ తరాల చేతులు కట్టేయడం సరి కాదు" అని అన్నారు. దేశ ప్రజలకు ఆర్థిక, సామాజిక న్యాయం చేయడం అనే లక్ష్యం సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయం ద్వారానే నెరవేరుతుంది కనుక ప్రత్యేకంగా 'సోషలిస్ట్' పదాన్ని రాజ్యాంగ పీఠికలో చేర్చలేదు. అయితే, ఎమర్జెన్సీ సమయంలో నాటి దేశ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ చొరవతో పార్లమెంట్ రాజ్యాంగానికి 42వ సవరణ చేసి రాజ్యాంగ పీఠికలో సెక్యులర్, సోషలిస్ట్ అనే పదాలు చేర్చారు. ఆ సవరణ జరిగిన 44 సంవత్సరాల తర్వాత రాజ్యాంగ పీఠికలో సెక్యులర్, సోషలిజం పదాలను చేర్చడాన్ని తప్పుపడుతూ 2020లో సుప్రీంకోర్టులో కేసు వేయడంతోనే మళ్లీ 'సోషలిజం' స్ఫూర్తిపై గత 4 ఏళ్లుగా చర్చలు, వాదోపవాదాలు చోటుచేసుకొన్నాయి.

ప్రముఖ న్యాయవాది నానీపాల్కీవాలా మన దేశంలో 'సోషలిజం' తప్పుగా బ్రాండ్ అయింది అని అన్నారు 1972లో. దేశంలోని పేదరికాన్ని సమానంగా పెంచడమే 'సోషలిజం'గా చెలామణి అవుతోందని వెటకారంగా అన్నారు. 'గరీబీ హటావో' (పేదరికాన్ని పారద్రోలాలి) అని ఇందిరాగాంధీ పిలుపునిస్తే.. కొందరు అమీరీ హటావో (సంపదను పారద్రోలాలి) అని అర్థం చేసుకొంటున్నారని నానీ పాల్కీవాలా చమత్కరించారు.

దేశ స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ దేశంలో 'మిశ్రమ ఆర్థిక వ్యవస్థ'కు బాటలు పర్చినప్పటికీ దశాబ్దాల పాటు దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి నామమాత్రంగానే పెరిగింది. నెహ్రూ అనుసరించిన విధానాన్ని కమ్యూనిస్టు పార్టీలు వ్యతిరేకించాయి. కమ్యూనిస్టు పార్టీ రెండుగా విడిపోయిన తర్వాత ఒకరు చైనా నమూనాను, మరొకరు సోవియట్ రష్యా నమూనాను సమర్థించారు. సోషలిజం విధానమే ఆదర్శప్రాయమైందన్న అభిప్రాయాన్ని కమ్యూనిస్టులు ప్రచారం చేశారు. 'సోషలిజం' పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకమని.. పెట్టుబడిదారీ వ్యవస్థలో పేదవాళ్ల శ్రమ దోపిడీకి గురవుతుందని బలమైన ప్రచారం జరిగింది. పరిశ్రమలన్నీ పెట్టుబడిదారీ యాజమాన్యం నుంచి కార్మికుల యాజమాన్యం క్రిందికి రావడమే సంపూర్ణ సోషలిజం లక్ష్యం అనే నినాదాలు దేశంలో చాలా కాలం వినిపించాయి. పరిశ్రమల్ని జాతీయం చేయాలని కొందరు కమ్యూనిస్టులు తరచుగా పిలుపునిచ్చేవారు. పెట్టుబడిదారీ వ్యవస్థను వ్యతిరేకించేవారందరూ అభ్యుదయ వాదులుగా పిలవబడ్డారు. సంపన్నులంతా దుర్మార్గులని, సామాన్యులు మంచివారనే నెరేటివ్‌లతో మెజార్టీ నవలలు, సినిమాలు కూడా వచ్చాయి. దీంతో సామాన్య ప్రజల్లో అనేక అపోహలు ఏర్పడ్డాయి.

అయితే, ఒక్క తూటా పేలకుండా, ఏ ఒక్క వ్యక్తి మరణించకుండా ఎప్పుడైతే సోషలిస్ట్ సోవియట్ యూనియన్ తనకు తానుగా కుప్పకూలిందో, అప్పట్నుంచీ సోవియట్ రష్యాలో అమలైన 'సోషలిజం' విధానాలకు నిజమైన అర్థమేమిటన్న అంతర్మథనం భారత్‌తో సహా చాలా దేశాలలో మొదలయింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో సోషలిస్టు దేశాల ఆర్థిక వ్యవస్థల్లోని లోపాలు అంతర్జాతీయ సమాజానికి వెల్లడయ్యాయి. దాంతో, ఏ దేశమూ తనకున్న పరిమిత ఆర్థిక వనరులతో అభివృద్ధి శిఖరాలు అధిరోహించలేదని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం కావడం అనివార్యం అని చాలా దేశాలు గ్రహించాయి.

భారత్‌కు సంబంధించినంతవరకు 1991లో మొదలైన మొదటి దశ ఆర్థిక సంస్కరణలు దేశ ఆర్థికాభివృద్ధికి కీలకంగా పని చేశాయి. అప్పటివరకు దేశంలో రాజ్యమేలిన లైసెన్స్‌రాజ్‌కు మంగళం పాడి.. ప్రజలందరికీ సమాన అవకాశాలను పొందే విధంగా అనేక రంగాల ద్వారాలను తెరవడం జరిగింది. దాంతో ప్రజలకు నిత్యావసరాలుగా మారిన వంటగ్యాస్, టెలిఫోన్ సౌకర్యం వంటివి సామాన్యులకు సైతం దక్కాయి. అదే సమయంలో అందుబాటులోకి వచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం తోడు కావడంతో ఆర్థిక వ్యవస్థ గాడిలో పడి పరుగుపెట్టింది. దేశంలోకి పెట్టుబడులు రావాలని, పరిశ్రమల స్థాపన జరగాలని, దేశ సంపద పెరగాలని, పెరిగిన సంపద అన్ని వర్గాలకు చేరాలని.. అదే భారత రాజ్యాంగం ప్రవచించిన ఆర్థిక, సామాజిక న్యాయం అని పాలకులకు అర్థం అయింది. కనుకనే, దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలు తమకు అధికారం ఇస్తే ఆ పంథానే అనుసరిస్తామని ఎన్నికలలో హామీలిస్తున్నాయి. అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలు హామీ ఇచ్చిన విధంగానే సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ.. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు ఇవ్వడంలో ఇంకా తాత్సారం చేస్తున్నాయి.

నానీ పాల్కీవాలా చెప్పినట్లు 'సోషలిజం' 4 ప్రధాన లక్ష్యాలను అందిస్తుంది. అవి – దేశ స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల, ప్రతి ఒక్క పౌరుడికి పని లభించడం, ఆదాయాల పంపిణీలో తగిన న్యాయం జరగడం, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడం. భారత రాజ్యాంగ స్ఫూర్తి ఇదే. ఈ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పనిచేసినప్పుడు దేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం జరిగి సంపూర్ణ సోషలిజం అమలవుతుంది.

▪ సి. రామచంద్రయ్య
ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడు


పంబారట్టు వేడుకకు తరలొచ్చిన మాలధారులు, భక్తులు

టీచర్ల ఓ వాట్సాప్ గ్రూపులో ఓ ఉపాధ్యాయుడు పెట్టిన పోస్టు



బేరాల బదిలీలు!

■ పరస్పర బదిలీల్లో కొందరు ఉపాధ్యాయుల బేరసారాలు

"నేను.. ఫలానా జిల్లాలోని పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. నేను ఈ జిల్లాకు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. అక్కడ పనిచేసే వారు ఎవరైనా ఉంటే నన్ను సంప్రదించండి..' అంటూ కొందరు ఉపాధ్యాయులు పెడుతున్న వాట్సాప్ పోస్టులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. జీవో 317 తో నష్టపోయిన ఉపాధ్యాయుల పరస్పర బదిలీలకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అనుమతినివ్వడంతో ఆశావహుల్లో ఆనందం నెలకొంది. టీచర్లలో బేరసారాలు జోరుగా సాగుతున్నాయి. తమకు నచ్చిన ప్రదేశం నుంచి ఎవరైనా మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌కు అంగీకారం తెలిపితే తగిన 'నజరానా' అందిస్తామని కొందరు ఉపాధ్యాయులు రాయబారాలు సాగిస్తుండడం ఆసక్తి కలిగిస్తోంది. ఇందుకు డీఈవో కార్యాలయాలనే అడ్డాగా ఏర్పరచుకుని మరీ.. మాటామంతీ సాగిస్తున్నారు. పనిలో పనిగా.. కొందరు ఉపాధ్యాయ సంఘాల నేతలు దళారుల అవతారం ఎత్తుతున్నారు. ఇద్దరి మధ్య సయోధ్య కుదుర్చి కమీషన్ ఎంచక్కా జేబులో వేసుకుంటున్నారు. మొత్తంగా ఈ పరస్పర బదిలీల 'వేలం పాట' రూ.కోట్లలో చేరుకోవడం ఉపాధ్యాయవర్గాల్లో కోడై కూస్తోంది.

- జీవో 317 బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా
- పరస్పర బదిలీలకు ఉపాధ్యాయుల కుతూహలం
- నచ్చిన చోటకు పోస్టు కోసం లక్షల్లో బేరసారాలు
- ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో వివరాలతో పోస్టులు
- డీఈవో కార్యాలయాలే అడ్డాగా చర్చలు
- కొందరు ఉపాధ్యాయులే ఏజెంట్ల అవతారం
- కమీషన్ మాటున పెట్టుబడి పెట్టి మరీ సయోధ్య
- రూ.కోట్లలో పలుకుతున్న మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లు
- హనుమకొండ, వరంగల్ జిల్లాలకే ఎక్కువ ఆసక్తి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబరు 317తో నష్టపోయిన ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో పరస్పర బదిలీల కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల మధ్య బేరాలు కుదురుతున్నాయి. జీవో 317లో స్థానికతను కాకుండా సీనియారిటీ పరిగణనలోకి తీసుకొని జిల్లాలు కేటాయించడంతో అప్పుడు సీనియర్లు తాము కోరుకున్న, సొంత జిల్లాల్లో కొనసాగుతుండగా, జూనియర్ ఉపాధ్యాయులు మాత్రం ఇతర జిల్లాలు, మారుమూల ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీచేసిన జీవోలు 243 (స్పౌజ్), 244 (మెడికల్), 245 (పరస్పర) బదిలీలకు ఈనెల 30 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశాన్ని కల్పించింది. దీంతో మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు బేరాలు కుదుర్చుకుంటున్నట్లు వివిధ ఉపాధ్యాయ సంఘాల వాట్సాప్ గ్రూపుల్లో వస్తున్న మెసేజ్‌లను బట్టి తెలుస్తోంది. 2022లో నిర్వహించిన పరస్పర బదిలీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వందల కోట్ల రూపాయలు చేతులు మారిన సంగతి విదితమే. ప్రస్తుతం అదే స్థాయిలో వందల కోట్ల రూపాయలు చేతులు మారనున్నట్లు తెలుస్తోంది. కాగా, వరంగల్, హనుమకొండ డీఈవో కార్యాలయాలు

మిగతా 8వ పేజీలో...

వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ ఉపాధ్యాయ సంఘాల గ్రూపుల్లో పరస్పర బదిలీల కోసం ప్రయత్నిస్తున్న ఆశావహులు, వారి వివరాలను పోస్టు చేస్తున్నారు. వారు ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్లాలో, అందుకు అనుగుణంగా ఉన్న వారి వివరాలను తెలుసుంటూ వారికి నేరుగా ఫోన్లు చేస్తూ బేరాలు కుదుర్చుకుంటున్నారు. మరికొందరైతే తాము ఏ జిల్లాలకైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని, తమకే నేరుగా ఫోన్ చేసి లేదా కలిసి మాట్లాడుకోవాలని వాట్సాప్ గ్రూపుల్లోనే పోస్టులు పెడుతున్నట్లు తెలుస్తోంది.

రిటైర్మెంట్‌కు దగ్గర ఉన్నవారిలో ఆసక్తి

ప్రభుత్వం 317లో నష్టపోయిన వారి కోసం బదిలీలకు రంగం సిద్ధం చేయడంతో ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నవారు ఆసక్తిగా పరస్పర బదిలీలకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోం ది. మరో యేడాది, రెండేళ్లలో ఉద్యోగ విరమణ పొందనున్న కొంతమంది ఉపాధ్యాయులు వాట్సాప్ గ్రూపుల్లో వస్తున్న పోస్టులను చూస్తూ మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు ఇష్టపడుతు న్న ఉపాధ్యాయులకు నేరుగా ఫోన్లు చేస్తూ ఒక మాట అనుకుంటే దరఖాస్తులు చేసుకుందామంటూ మాట్లాడుతు న్నట్లు సమాచారం.

వందశాతం పన్నులు సేకరించాలి

- మేయర్ గుండు సుధారాణి
- బల్దియాలో అధికారులతో సమావేశం


అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పన్నుల సేకరణలో వేగం పెంచి వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. సోమవారం బల్దియా కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడారు. 2024- 2025 సంవత్సరాలకు గాను రూ.113 కోట్ల పన్నుల వసూలు లక్ష్యంగా అధికారులు విధులు నిర్వర్తించాలని అన్నారు. ఇప్పటి వరకు రూ.40 కోట్లు మాత్రమే పన్నుల వసూలు చేయడం జరిగిందని మిగతా డబ్బు వసూళ్లలో వేగం పెంచాలన్నారు. వార్డ్ ఆఫీసర్లు, ఆర్‌ఐలు పన్నుల వసూళ్లలో పురోగతి సాధించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పన్నులు సేకరించేలా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షించాలన్నారు.

కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. రెవెన్యూ, ఆరోగ్య, పట్టణ ప్రణాళికా, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంలో పని చేసి రెసిడెన్స్‌కు అనుమతి పొంది కమర్షియల్‌గా వినియోగించే హోటల్స్ ఫంక్షన్ హాల్స్ రెస్టారెంట్స్ పరిశీలించి ఆస్తిపన్నుతో పాటు నల్లా పన్ను, గార్బేజ్ పన్నులను కమర్షియల్ కింద వసూలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో బొమ్మన డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్‌తో పాటు ఐటీ విభాగం అధికారి రమేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై చొరవ చూపండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరణ

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బల్దియాలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. పజల సమస్యలపై స్పందించని అధికారులు, సిబ్బందిని ఇకపై సహించేది లేదని విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 84 మంది పలు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్ తోపాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు..

ఇంజనీరింగ్ విభాగం-21, హెల్త్, శానిటేషన్-8, ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ-2, టౌన్‌ప్లానింగ్-42, తాగునీటి సరఫరా-5, హార్టీకల్చర్-1 ఇలా మొత్తం 84 ఫిర్యాదులు అందినట్టు అధికారులు తెలిపారు.

- గ్రేటర్ వరంగల్ 26వ డివిజన్ పాత లక్ష్మిటాకీస్ వెనుక సందులో 2023లో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించేందుకు పనులు ప్రారంభించి

మిగతా 6వ పేజీలో...

నిట్‌లో కొత్త కోర్సు

- 5జి-వైర్‌లెస్ కమ్యూనికేషన్ టెక్నాలజీ కోర్సుకు శ్రీకారం
- అధ్యయనానికి 36 మంది పేర్లు, వివరాల నమోదు


నిట్‌లో కొత్త కోర్సును ప్రారంభిస్తున్న ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ థర్మ్ రత్నరాజా

ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి

- జ్వాల స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్
- అంబులెన్స్‌లో ఐసీయూ పేషంట్‌తో వినూత్న ప్రదర్శన

6

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

హనుమకొండ సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలు సోమవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా స్వర్ణ మాట్లాడుతూ సోనియాగాంధీ వల్లే తెలంగాణ సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, టీపీసీసీ నాయకులు బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న తదితరులతో పాటు కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, తదితరులు

- పోచమ్మమైదాన్, (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తాలో సోమవారం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 25వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు శిరీష్‌శ్రీమాన్, కాంగ్రెస్ నాయకులు తత్తరి లక్ష్మణ్, అహరోన్ పాల్గొన్నారు.

రామన్నపేటలో..

వరంగల్ చౌరస్తా, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా రామన్నపేట 29వ డివిజన్‌లోని గాంధీ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బుద్ధ జగన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓరుగంటి పూర్ణచందర్, నటేష్, శ్రీరాముల నరేష్, మహిళా అధ్యక్షురాలు కొలిపాక పద్మ, వీరమ్మ, రాధమ్మ, కటకం సుశీల, సుమ, సరస్వతి, కృష్ణవేణి, స్వరాజ్యం పాల్గొన్నారు.

ఓం.. ఓం.. అయ్యప్ప


అయ్యప్పకు జలాభిషేకం చేస్తున్న అయ్యప్ప ఆలయ అర్చకుడు

శరణుఘోషతో మార్మోగిన నర్సంపేట

మాదన్నపేట చెరువు వద్ద కనులపండుగ్గా పంబారట్

వేలాదిగా తరలొచ్చిన మాలధారులు, భక్తులు

8

అయ్యప్ప నామస్మరణతో నర్సంపేట మారుమోగింది. వేలాది మంది మాలధారులు.. భక్తుల శరణుఘోషతో సందడిగా మారింది. సోమవారం మాధన్నపేట చెరువులో ఆ హరిహర సుతుడు అయ్యప్పకు నిర్వహించిన పంబారట్టు (జలక్రీడ) కన్నుల పండువగా జరిగింది. అయ్యప్పస్వామికి పాలు, పెరుగు, నెయ్యి, తేనె, బస్వం, పంచదార, గంధం, పసుపుతో అభిషేక పూజలు చేశారు. తొలుత అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని నర్సంపేట పట్టణం నుంచి మాధన్నపేట చెరువు వరకు ఊరేగించారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఈ వేడుకకు భారీ సంఖ్యలో భక్తులు తరలొచ్చారు.

- నర్సంపేట

వరంగల్ నిట్‌లో కొత్త కోర్సు

హనుమకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో సోమవారం కొత్త కోర్సును ప్రారంభించారు. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో 5జి-వైర్‌లెస్ కమ్యూ నికేషన్ టెక్నాలజీపై ఈ జియాన్ కోర్సును యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ఎడిన్‌బర్గ్ విశ్వవి ద్యాల యానికి చెందిన ప్రొఫెసర్ థర్మ్ రత్నరాజా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కోర్సుకు వరంగల్ నిట్ ఈసీఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కల్పనా నాయుడు సమన్వ యకర్తగా వ్యవహరిస్తారు. దేశ వ్యాప్తంగా 36 మంది ఈ కోర్సును అధ్యయనం చేసేం దుకు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వరంగల్ నిట్ ఇంచార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఏ వేణు ప్రసాద్, జియాన్ లోకల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్ శ్రీనివాసరావు, ఈసీఈ విభాగా ధిపతి ప్రొఫెసర్ ఎల్ ఆంజనేయులు, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ కల్పనా నాయుడు విదేశీ నిపు ణుడు ప్రొఫెసర్ థర్మ్ రత్నరాజా ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రొఫె సర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఈసీఈ కార్యకలాపాలు, 5జీ కమ్యూనికేషన్ టెక్నా లజీ రం గంలో ఈ విభాగం చేస్తున్న పరిశోధనలను వివరించారు. 5జి కమ్యూనికేషన్ టెక్నా లజీ అభి వృద్ధి, పరిశోధనల్లో వరంగల్ నిట్ ఈసీఈ కీలక భూమిక పోషిస్తున్నదన్నారు. ప్రొఫె సర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వరంగల్ నిట్‌కు పలు జీయాన్ కోర్సులు, స్పార్క్ ప్రాజెక్టులు మం జూరయ్యాయని తెలిపారు. జీయాన్ కోర్సుల 5వ దశ ఉపన్యాస సేషన్ల ప్రత్యక్ష ప్రసా రాన్ని ప్రారంభించిందని, జియాన్ కోర్సులకు ప్రత్యక్షంగా హాజరుకాలేకపోయిన వారికి ఇది ఎం తో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. 5జి కమ్యూనికేషన్ టెక్నాలజీలో పని చేస్తున్నవారు తమ వృత్తిలో మరింతగా రాణించడానికి ఈ రంగంపై మరింతగా దృష్టి పెట్టాలని అన్నారు. ప్రొఫెసర్ వేణు ప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్తులో 5జీ కమ్యూనికేషన్ టెక్నాలజీ నూతన పరిశోధనలకు విదేశీ నిపుణులతో కలిసి పని చేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారంపై చొరవ చూపండి

(5వ పేజీ తరువాయి)

ఇప్పటి వరకు పూర్తి చేయలేదని స్థానికులు ఫిర్యాదు చేశారు.

- కాలనీల్లో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు రోడ్డుపై ప్రవహించడంతో దుర్వాసన వెదజల్లుతోందని వరంగల్ పుప్పాలగుట్ట ప్రాంతానికి చెందిన విఘ్నేశ్వరకాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- న్యూశాయంపేట 31వ డివిజన్ డాక్టర్స్ కాలనీలో 60 మీటర్ల వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం వల్ల స్థానిక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సింగారపు బాబురావు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ బాలాజీనగర్‌లో చాలా కాలంగా వీధి దీపాలు వెలగడం లేదు. ఈ సమస్యపై అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల సంఘం నాయకులు కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందించారు.
- హనమకొండ 54వ డివిజన్ హనుమాన్‌నగర్ మెయిన్ లైన్ - 4లో వీధి కుక్కల సమస్య అధికంగా ఉందని, అటుగా వచ్చిపోయే వారిపై దాడి చేసి కరుస్తున్నాయని హనుమాన్‌నగర్ అభివృద్ధి కమిటీ నాయకులు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో మందపెల్లి జయమ్మ ఔట్‌సోర్సింగ్ కార్మికురాలిగా పని చేసి అనారోగ్యంతో మృతి చెందింది. 2021 నుంచి తమ తల్లి ఉద్యోగం తనకు ఇవ్వాలని అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదని జయమ్మ కూతురు అన్నపూర్ణ కమిషనర్‌ను కలిసి మొరపెట్టుకుంది.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్ చౌరస్తా, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె ప్రాతినిథ్యం వహిస్తున్న రామన్నపేటలో పర్యటించి వివిధ పనులను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మేయర్ వెంట డివిజన్ అధ్యక్షుడు ఓరుగంటి పూర్ణచందర్‌రావు ఉన్నారు. రూ. 50 లక్షల నిధులను విడుదల చేయాలని మేయర్‌ను కోరారు.

రైల్వే మంత్రిని కలిసిన ఎంపీ రవిచంద్ర

హనుమకొండ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటలో రైల్వే కోచ్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోమవారం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి కోరారు. బీఆర్ఎస్ అధినేత ఉద్యమకాలంలో కాజీపేట కోచ్ గురించి పోరాటాన్ని చేయడం ఈ సందర్భంగా మంత్రికి గుర్తు చేశారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో కోచ్ ఫ్యాక్టరీని కాజీపేటలో కాకుండా పంజాబ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలో ఏర్పాటు చేసి తెలంగాణకు అన్యాయం చేయడాన్ని గుర్తు చేశారు. కోచ్ ఫ్యాక్టరీలో 60 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని, కాజీపేటను డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని కోరారు. ఆటో స్టాండ్‌ను ప్రయాణికులకు అందుబాటులో ఉండేవిధంగా చొరవ చూపాలన్నారు. ఎంపీ రవిచంద్ర వెంట మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి

జ్వాల స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రశాంత్



వినూత్న ప్రదర్శన చేస్తున్న జ్వాల స్వచ్ఛంద సంస్థ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దేశంలో అవినీతి నిరోధక శాఖ ద్వారా పట్టుబడిన ప్రభుత్వ అధికారుల కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని జ్వాల స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ అన్నారు. సోమవారం జ్వాల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయం నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు 'అంబులెన్స్‌లో ఐసీయూలో పేషంట్‌గా నీతి.. బాడీబిల్డర్‌గా అవినీతి..' అని పేర్కొంటూ వినూత్న ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాటాడుతూ నీతి నిజాయితీ బక్కచిక్కి పోయి కొన ప్రాణంతో ఐసీయూలో కొట్టుమిట్టాడుతోందని, అవినీతి బాడీబిల్డర్ల లాగా ఖండలు తిరిగి పెరిగి పోతుందని సందేశాన్ని అందించేందుకు వినూత్న ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. మరణ దశలో ఉన్న నీతి నిజాయితీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందన్నారు. నానాటికి పెరిగిపోతున్న అవినీతిని నిర్మూలించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతి ఆరోపణలు లేని ప్రభుత్వ అధికారులకు మాత్రమే పదోన్నతులు కల్పించాలని కోరారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు వారి ఆస్తులను ప్రతీ సంవత్సరం ప్రకటించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండాలన్నారు. లోక్‌సత్తా సంస్థ రాష్ట్ర సలహాదారులు ప్రొఫెసర్ కోదండరామారావు మాట్లాడుతూ చెరువులు, కుంటలను కాపాడేందుకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసిన విధంగానే ఏసీబీని మరింత పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ ఏడి అశోక్‌కుమార్, సభ్యులు ప్రకాష్, బుర్రి కృష్ణ, అచ్చె అమర్‌నాథ్, బుద్దె సురేష్, సుంకరి రాజు తదితరులు పాల్గొన్నారు.

వెలమలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రావు



కలెక్టరేట్ ఎదుట ఎమ్మెల్యే శంకర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వెలమ సంఘం నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వెలమ కులస్థులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంటనే వెలమ కులస్థులకు క్షమాపణ చెప్పాలని వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పేరాల మధుసూదన్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వెలమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేసి ఎమ్మెల్యే శంకర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ముందుగా బాలసముద్రంలోని ఏకశిలాపార్కు నుంచి పెద్ద సంఖ్యలో వెలమ కులస్థులు కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావు మాట్లాడుతూ మీరు రాజకీయంగా ఏమైనా విమర్శించుకోండి కానీ ఒక కులాన్ని టార్గెట్ చేసి విమర్శించడం సరికాదన్నారు. వెలమ కులస్థుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యానించిన ఎమ్మెల్యే శంకర్‌పై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి శంకర్‌ను ఎమ్మెల్యే పదవి నుండి బర్తరఫ్ చేయాలన్నారు. మరోసారి ఏ ఎమ్మెల్యే కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా చూడాలన్నారు. లేదంటే రానున్న రోజుల్లో వెలమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్ర మంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సతీమణి ఉషా దయాకర్‌రావు, వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి కాకులమర్రి ప్రవీణ్‌కుమార్, గుజ్జ ప్రభాకర్‌రావు, గోపాల్‌రావుతోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన వెలమ కులస్థులు పాల్గొన్నారు.

ప్రజావాణికి వెల్లువెత్తిన వినతులు

104 దరఖాస్తులు అందించిన ప్రజలు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి వాటిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 104 వినతులు అందినట్లు తెలిపారు. శాఖల వారీగా పరిశీలిస్తే రెవెన్యూ శాఖకు 53, డీఆర్‌డీవో 2, జీడబ్ల్యూఎంసీ 1, జిల్లా పౌరసరఫరాల శాఖ 7, పోలీసు శాఖ 1, డీఎంహెచ్‌వో 3, జిల్లా సంక్షేమశాఖ 1, రీజినల్ కో ఆర్డినేటర్ టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ 2, జిల్లా వ్యవసాయశాఖ 7, పంచాయతీరాజ్ 3, విద్యాశాఖ 4, ఉపాధి కల్పన శాఖ 3, పశుసంవర్ధకశాఖ 1, ఇరిగేషన్ 3, జడ్పీ సీఈవో 5, ఎల్‌డీఎం 2, డీటీడబ్ల్యూఓ 1, ఆర్‌టీఏ 3 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో విజయలక్ష్మి, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేశ్, వ్యవసాయశాఖ అధికారి అనురాధ, డీసీవో నీరజ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తమకు ఇప్పటివరకు రుణమాఫీ కాలేదని నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామానికి చెందిన రైతులు వాపోయారు. ఈ మేరకు వారు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఐఓబీలో పంటల సాగు కోసం రుణాలు తీసుకున్నామని, రుణమాఫీకి అర్హత ఉన్నా కాలేదని అన్నారు. అలంకానిపేట బ్రాంచ్‌లో సుమారు 850 మందికి రుణమాఫీ కాలేదని, ప్రభుత్వ ఉద్యోగులు, రేషన్‌కార్డు లేని వారికి రుణమాఫీ అయిందని, తమకు మాత్రం కాలేదని వాపోయారు. ఈ విషయంపై విచారణ చేసి బ్యాంకు అధికారులు, వ్యవసాయశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హనుమకొండ ప్రజావాణికి 88 దరఖాస్తులు

హనుమకొండ కలెక్టరేట్, (ఆంధ్ర జ్యోతి) : హనుమకొండ కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 88 దరఖాస్తులు వచ్చాయి. బాధితుల నుంచి జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఫిర్యాదులు స్వీకరించారు. జీడబ్ల్యూఎంసీకి 15 ఫిర్యాదులు రాగా మిగతావి ఇతర డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు స్పందించి తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, డీఆర్‌డీవో మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ శిశువు మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

గిర్మాజీపేట, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. వారి కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా కొమ్మాల గ్రామానికి చెందిన బాధావత్ నవ్య ప్రసవం కోసం ఈనెల 5న సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో చేరింది. శనివారం రాత్రి వైద్యులు సిజేరియన్ చేయగా మగశిశువుకు జన్మనిచ్చింది. అయితే శిశువు పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో వైద్యులు ఆక్సిజన్ పెట్టారు. అయినప్పటికీ మార్పు రాకపోవడంతో అంబులెన్స్‌లో అదేరాత్రి శిశువును ఎంజీఎం పిల్లల వార్డుకు తరలించారు. అక్కడ రెండు రోజులు చికిత్స పొందిన అనంతరం సోమవారం ఉదయం 4 గంటలకు శిశువు మృతిచెందింది. దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతశిశువును తీసుకొని బంధువులు సీకేఎం ఆస్పత్రికి చేరుకుని ఆందోళన చేశారు. ఆర్ఎంవో డాక్టర్ వై.వేణుగోపాల్‌రెడ్డి, ఇతర వైద్యులతో వాగ్వివాదానికి దిగారు. సమాచారం అందుకున్న ఇంతేజార్‌గంజ్ సీఐ శుక్రూ ఆస్పత్రికి చేరుకుని బంధువులతోపాటు ఆర్ఎంవోతో మట్లాడారు. తల్లిగర్భంలోనే శిశువుకు విరేచనం అయిందని, అది శిశువు మింగడంతో సమస్య ఏర్పడిందని, మెరుగైన చికిత్స కోసం ఎంజీఎంకు తరలించగా మృతిచెందిందని, ఇందులో సీకేఎం వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని ఆర్ఎంవో వివరించారు. దీంతో శిశువు బంధువులు మృతదేహాన్ని తీసుకుని వెళ్లిపోవడంతో సమస్య సద్దుమనిగింది.

ద్రవిడ భాషలకు తెలుగు అక్షరమాలే మూలం

ప్రముఖ పొద్దుటూరు ఎపిగ్రాఫిస్టు ఉమాశ్వేర శర్మ

ముగిసిన హిస్టరీ, టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి) : ద్రవిడ బాషలన్నింటికీ తెలుగు అక్షరమాలే ప్రధాన ఆధారమని పొద్దుటూరుకు చెందిన ప్రముఖ ఎపిగ్రాఫిస్టు ఉమాశ్వేర శర్మ అన్నారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో చరిత్ర, టూరిజం విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ అధ్యక్షతన మూడు రోజుల పాటు ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా 49వ వార్షిక కాంగ్రెస్, 43వ ప్లేస్ నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక కాంగ్రెస్ ముగింపు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ ఎపిగ్రాపిస్టు (పురాతన శాసనాల పరిశోధకులు) ఉమాశ్వేర శర్మ, కేయూ సోషల్ సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్‌లు మాట్లాడుతూ.. పురాతన శాసనాలను పరిశీలిస్తే తెలుగు భాషలోని అక్షరాలే ప్రధానంగా కన్పిస్తాయని స్పష్టం చేశారు. శాసనాలు జాతి ఆస్తి అని చెప్పారు. యువ చరిత్ర పరిశోధకులు ఎపిగ్రాఫీపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కలకత్తా యూనివర్సిటీ ఆఫ్ కలకత్తా, యన్షియంట్ ఇండియన్ హిస్టరీ అండ్ కల్చర్, విభాగాధిపతి, ప్లేస్ నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సుస్మిత బసు మజుందార్ మాట్లాడుతూ..మూడు జాతీయ సదస్సు నిర్వహణతో చరిత్ర శాసనాలపై స్పష్టమైన అవగాహన ఏర్పడిందన్నారు. చరిత్ర, టూరిజం విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్‌లు కేయూ చరిత్ర విభాగం నేతృత్వంలో జాతీయ స్థాయిలో మంచి సదస్సు నిర్వహించి చరిత్ర ప్రాశస్త్యాన్ని అభివృద్ధిని యువ పరిశోధకులకు, విద్యార్థులకు అందచేసినట్లు చెప్పారు. కాగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పలు టెక్నికల్ సెషన్స్‌లో గుంటూరు నాగార్జున వర్సిటీకి చెందిన యువ పరిశోధకురాలు వేదాంతం సంస్కృతితో పాటు పలువురు విలువైన పరిశోధన పత్రాలను ప్రొజెక్టర్ ద్వారా సదస్సులో సమర్పించారు. సదస్సులో చరిత్రకారులు టీఎస్ రవిశంకర్, డాక్టర్ ఎస్.కృష్ణమూర్తి, పాండిచ్చేరి యూనివర్సిటీ ప్రొఫెసర్ బి.రామచంద్రారెడ్డి, గుంటూరు చిలుకలూరి పేటకు చెందిన రిటైర్డు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దానయ్య చౌదరి, అధ్యాపకులు దేశ, విదేశాల నుంచి ప్రొఫెసర్లు, పరిశోధకులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

పురుషుల టెబుల్ టెన్నిస్ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 7 నుంచి 9 వరకు తమిళనాడులోని వెల్లూరు యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ పురుషుల టెబుల్ టెన్నిస్ జట్టును 2024-25 ఏడాదికి గాను సోమవారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో హసన్‌పర్తి కిట్స్ కళాశాల పి.భరత్‌కుమార్‌రెడ్డి, బి.చింటేశ్వర్‌రెడ్డి, పి. దీపక్ బాబు, జి నిఖిల్‌రెడ్డి, ఎస్.ప్రేమ్ దినాకర్‌లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీధర్‌కుమార్ వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 22 మంది డీబార్

కేయూ క్యాంపస్, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెగ్యూలర్ 1,3, 5 సెమిస్టర్ పరీక్షలలో సోమవారం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్‌లోని పలు పరీక్షల కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 22 మంది విద్యార్థులను తనిఖీ బృందాలు డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం. తిరుమలదేవిలు తెలిపారు. డీబారైన వారిలో ఆదిలాబాద్ పరీక్షల కేంద్రాల్లో ఐదుగురు, ఖమ్మంలో ఐదుగురు, వరంగల్‌లో 12 మంది ఉన్నట్లు తెలిపారు. వీరందరిపై నిబంధనల మేరకు చర్యలుంటాయని వెల్లడించారు.

ఖిలావరంగల్‌లో సినిమా షూటింగ్

ఖిలావరంగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మధ్యకోటలో సోమవారం సినిమా షూటింగ్ చేశారు. ఈ చిత్రానికి దిల్‌రాజు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'ఓ భామా-అయ్యోరామా' అనే ప్రేమ కథా చిత్రానికి సంబంధించి హీరో సుహాస్, హీరోయిన్ మాలవిక మధ్య పలు సన్నివేశాలు చిత్రీకరించారు. రెండు రోజులపాటు ఇక్కడ షూటింగ్ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. చాలా రోజుల తర్వాత మధ్యకోటలో షూటింగ్ చేస్తుండడంతో తిలకించడానికి యువతీయువకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య సోమవారం పెద్దమ్మగడ్డలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూపీహెచ్‌సీ ఓపీ, ఫార్మసీ, ల్యాబ్‌లను ఈ సందర్భంగా పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిత్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మోసపూరిత ఫోన్ కాల్స్‌ను నమ్మొద్దు

నేషనల్ హెల్త్ మిషన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరికి ఫోన్‌కాల్స్ వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి మోసపూరిత ఫోన్‌కాల్స్‌ను నమ్మరాదని డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య సూచించారు. ఖాళీలు ఏర్పడితే సంబంధిత రాష్ట్ర అధికారులు, జిల్లా కలెక్టర్ అనుమతితో నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

బ్యాటరీ పేలి ఎలక్ట్రిక్ చార్జింగ్ స్కూటీ దగ్ధం



దగ్ధమైన ఎలక్ట్రిక్ స్కూటీ

భీమదేవరపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చార్జింగ్ అవుతుండగానే బ్యాటరీ పేలి ఎలక్ట్రిక్ చార్జింగ్ స్కూటీ దగ్ధమైన ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముత్తారంలో జరిగింది. గ్రామానికి చెందిన కాశిరెడ్డి ఆదిరెడ్డి ఏడాది క్రితం ఓ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ చార్జింగ్ స్కూటీని కొనుగోలు చేశాడు. సోమవారం తెల్లవారు జామున ఆయన తన ఎలక్ట్రిక్ స్కూటీకి చార్జింగ్ పెట్టగా చార్జింగ్ అవుతుండగానే బ్యాటరీ పేలి స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. దీంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. అయితే తాను స్కూటీని కొనుగోలు చేసిన సమయంలో నిర్వాహకులు సదరు స్కూటీ బ్యాటరీ లిథియంతో చేసిందని, ఆటో కట్ బ్యాటరీ కావడంవతో అది పేలదని చెప్పారని, కానీ అది పేలిందని, తాను తీవ్రంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

సీపీని కలిసిన పరకాల ఏసీపీ

వరంగల్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నిజాయితీతో ప్రజలకు సేవలందించి పోలీస్‌శాఖపై ఉన్న నమ్మకాన్ని రెట్టింపు చేయాలని పరకాల ఏసీపీ సతీష్‌బాబుకు సీపీ అంబర్‌కిషోర్ ఝా సూచించారు. పరకాల ఏసీపీగా శనివారం బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ సోమవారం సీపీని కమిషనరేట్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కాంగ్రెస్‌లో.. 'తూర్పు' దుమారం!

మరోమారు బయటపడిన వర్గపోరు

వేర్వేరుగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



పోచమ్మమైదాన్‌లో గోపాల నవీన్‌రాజ్ ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న దృశ్యం



పోచమ్మమైదాన్‌లో ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

వరంగల్‌సిటీ, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో వ్యక్తిగత స్వాతంత్ర్యం ఎక్కువన్న నానుడిని నిజం చేసేలా వరంగల్ తూర్పు నియోజకవర్గ నాయకులు వ్యవహరిస్తున్నారు. ఎవరిదారి వారిదే అన్నట్టుగా సోమవారం పోచమ్మమైదాన్ జంక్షన్‌లో ఆ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలను వేర్వేరుగా నిర్వహించడం తీవ్ర దుమారాన్నే రేపుతోంది. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదవగా.. ప్రస్తుత ఈ నియోజకవర్గంలోని గ్రూపు రాజకీయాలతో కార్యకర్తలు ఇబ్బందిపడుతున్నారు.

కొండా వర్సెస్ స్వర్ణ వర్గం

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావు దంపతుల వర్గంగా చెప్పుకొనే నేతలు ఒకవైపు.. డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య వర్గీయులుగా ఉన్న వారు మరోవైపు పార్టీ కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహిస్తుండటం గమనార్హం. గతంలో ఆయా వర్గాల నేతలు పార్టీ కార్యక్రమాలను వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించేవారు. కానీ సోమవారం మాత్రం సోనియాగాంధీ జన్మదిన వేడుకలను పోచమ్మమైదాన్‌లోనే పక్కపక్కనే నిర్వహించడం చర్చనీయాంశమైంది. తూర్పు నియోజకవర్గంలో కొండా వర్సెస్ స్వర్ణ వర్గాలుగా రాజకీయాలు కొనసాగితే రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో గడ్డు పరిస్థితిని ఎదుర్కోక తప్పదని ఆ పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఇతర పార్టీలను ఎన్నికల్లో ఎదుర్కోవడం కష్టమనుకుంటున్న సమయంలో పార్టీలోని గ్రూపులు తలనొప్పిగా మారాయంటున్నారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో వరంగల్ తూర్పు పరిధిలోని 24 డివిజన్లలో 20 డివిజన్లను బీఆర్ఎస్ అభ్యర్థులే గెలుచుకున్నారు. అదే తరహాలో ఈ సారి కాంగ్రెస్ కార్పొరేటర్ల అభ్య ర్థులను గెలిపించుకునే పరిస్థితి ఉంటుందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక వర్గం అభ్యర్థిని బరిలోకి దింపితే మరో వర్గం వాళ్లు వెన్నుపోటు పొడిచే అవకాశాలు లేకపోలేదని, గత పార్లమెంట్ ఎన్ని కల్లో వచ్చిన ఓట్ల శాతంతో ఈ విషయం రుజువైందని పలువురు పేర్కొం టున్నారు.

గెలిచి ఏడాదైనా.. నామినేటెడ్ పోస్టులేవీ?

తూర్పులో కొండా సురేఖను గెలిపించడానికి శక్తికి మించి పనిచేసిన తమకు పార్టీ ఏం భరోసా ఇచ్చిందని నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా తమ కష్టాన్ని పార్టీ గుర్తించలేదని, విజయోత్సవాలు చేస్తున్నారే తప్ప తమ గురించి ఆలోచించడంలేదని వాపోతున్నారు.

నేడు నాయీబ్రాహ్మణుల సేవా సంఘం ఎన్నికలు

వడ్డెపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఎన్నికలు మంగళవారం కాశిబుగ్గ ఎల్బీనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు వరంగల్ నాయీబ్రాహ్మణ సేవా సమితి సంఘం అడహక్ కమిటీ కన్వీనర్లు మేడిపెల్లి దశరథం, కోడెపాక రాజేందర్‌లు తెలిపారు. సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వరంగల్ నగరంలోని సెలూన్‌షాపులు, బ్యూటీ పార్లర్లు, పరపతి సంఘాలు స్వచ్ఛందంగా తమ సంస్థలను బంద్ చేసి ఓటింగ్‌లో పాల్గొనాలని వారు కోరారు. అదేరోజు సాయంత్రం ఫలితాలను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

హనుమకొండ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

రాంనగర్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కాలంలో హనుమకొండలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి బీజేపీ జిల్లా అధ్యక్షు రాలు రావు పద్మ సవాల్ విసిరారు. కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై కాజీపేట చౌరస్తా నుంచి హనుమకొండ చౌరస్తా వరకు మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్‌తో కలిసి వాహన ర్యాలీ చేశారు. హనుమకొండ చౌరస్తాలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కేంద్ర ప్రభుత్వం ఇస్తే అత్తసొమ్ము అల్లుడు దానం చేసినట్లుగా కాంగ్రెస్ నాయకులు తాము ఏదో చేసినట్లుగా మాట్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రావుల కిషన్, విజయ చందర్‌రెడ్డి, కొలను సంతోష్‌రెడ్డి, సంద్ర మధు, నర్సింగ్, శ్రీనువాస్, అమర్నాధ్‌రెడ్డి, శ్రావణ్, భరత్, రత్న లక్ష్మీ, తిరుపతి, చాంద్‌పాషా పాల్గొన్నారు.

● మానవత్వం చాటుకున్న ఏసీపీ నందిరాం

మట్టెవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తూ చలిలో వణుకుతున్న వారిని చూసిన ఏసీపీ నందిరాం నాయక్ చలించిపోయారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో వరంగల్ స్టేషన్‌రోడ్, బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో వారి అవస్థలను గమనించారు. వెంటనే సొంత ఖర్చుతో దుప్పట్లు కొని 50 మందికి సోమవారం పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

● కార్పొరేటర్‌కు మాతృ వియోగం



సరోజన (ఫైల్)

పోచమ్మమైదాన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోచమ్మమైదాన్ ప్రాంతానికి చెందిన 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామికి మాతృ వియోగం కల్గింది. ఆయన మాతృమూర్తి బస్వరాజు సరోజన (67) అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి కొండా సురేఖ హైదరాబాద్ నుంచి ఫోన్‌లో కుమారస్వామిని పరామర్శించారు. మంగళవారం కొత్తవాడలోని హిందు శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

● డ్రంకెన్ డ్రైవ్‌లో 53 మందికి జరిమానా

మట్టెవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 53 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ సోమవారం రూ. 71,000 జరిమానా విధించారు. మరొకరికి ఒక రోజు సామాజిక సేవ శిక్ష విధించారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఆరుగురికి రూ.8500 జరిమానా విధించారని వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

● రోడ్డు ప్రమాద ఘటనలో ఒకరిపై కేసు

వరంగల్ చౌరస్తా, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెండు వాహనాలు ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన ఘటనలో ఇంతెజార్‌గంజ్ పోలీసులు ఒకరిపై కేసు నమోదు చేశారు. దేశాయిపేటకు చెందిన జన్ను ఉమేష్ గత నెల 24న రాత్రి తన ద్విచక్ర వాహనంపై వస్తూ ఒయాసిస్ స్కూల్ వద్ద యూటర్న్ తీసుకొని దేశాయిపేట వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా బైక్‌పై వచ్చిన తౌటు గోపాల్ అనే వ్యక్తి ఢీకొనడంతో ఉమేష్‌కు తీవ్రగాయాలై ఎంజీఎంలో చేరాడు. ఈ ఘటనపై ఉమేష్ తండ్రి జన్ను బాబు సోమవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

● హసన్‌పర్తిలో దారికాచి దాడి

హసన్‌పర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి పెద్ద చెరువు కట్ట వద్ద కాపు కాచి దాడి చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు తెలిపారు. ఎల్కతుర్తి మండలం పెంచికలపేటకు చెందిన బొనగాని పవన్, అంబులెన్స్ డ్రైవర్ చిర్ర సాయికుమార్‌లు ఈనెల 7న కారు రిజిస్ట్రేషన్ చేయించుకొని వెళ్తుండగా హసన్‌పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు వద్ద వెల్గటి హరీష్‌తో పాటు మరికొంత మంది కారును ఆపి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ లాక్కొని చితకబాదారు. అనంతరం వారు అనుకున్న వ్యక్తులు వీరు కాదని నిర్ధారణకు వచ్చిన బాధితులకు సెల్‌ఫోన్‌లు తిరిగి ఇచ్చి పారిపోయారు. బాధితుడు పవన్ ఫిర్యాదు మేరకు దాడి చేసిన పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు తెలిపారు.

● రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

హసన్‌పర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హసన్‌పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. వీరిలో ఆటో డ్రైవర్ కొమురవెల్లి మహేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానికులు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ వాహనంలో ఎంజీఎంకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు రోడ్డు ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ కొమురవెల్లి మహేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు తెలిపారు.

● గుర్తు తెలియని వ్యక్తి మృతి

వరంగల్ క్రైం, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి నాలుగు రోజులుగా ఎంజీఎంలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. ఆయన వయసు 55 నుంచి 60 సంవత్సరాల లోపు ఉంటుందని, ఒంటిపై గోధుమ రంగు చొక్కా, లుంగీ ఉన్నాయని, ఆచూకీ తెలిసిన వారు హనుమకొండ సీఐ 87126 85113, 87126 85002 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

● కలెక్టరేట్ ఎదుట గొర్రెలు, మేకల పెంపకందారుల ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం నాయకులు ధర్నా చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లింగయ్య, రమేష్, రాజ్‌కుమార్, కుమార్, శ్రీకాంత్, చేరాలు, రవీందర్, పరశురాములు పాల్గొన్నారు.

● హమాలీల కూలి రేట్లు పెంచాలి

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరలకు అనుగుణంగా హమాలీల కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ (న్యూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బహుళజాతి కంపెనీలతో కుమ్మక్కై కార్మిక చట్టాలను రద్దు చేసిందని, ప్రజలపై పన్నుల భారం మోపుతోందని అన్నారు. గతంలో హమాలి కార్మికులు చేసుకున్న రేట్ల ఒప్పందం ఈ నెల 21తో ముగుస్తున్నందున నూతన రేట్ల ఒప్పందం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం నాయకులు ఈర్ల పైడి, బొర్ర ఆనంద్, రాంచందర్, రాము, శంకర్, శ్రీనివాస్, చందర్, మల్లన్న, శ్రీనివాస్, జనార్దన్, పోశాలు, రవి, రాజు, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



వరంగల్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అనిల్ కుమార్



శంభునిపేట జంక్షన్‌లో కేక్‌కట్ చేస్తున్న కార్పొరేటర్ పోశాల పద్మ



ఏనుమాములలో పండ్లు పంచుతున్న కార్పొరేటర్ సులోచన

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

వడ్డెపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ సర్దార్ సర్వాయిపాపన్న జంక్షన్‌లో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం కాంగ్రెస్ జిల్లా నేత, డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, కుడా మాజీ డైరెక్టర్ భూక్య శంకర్ ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, టపాసులు పేల్చి, పండ్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, కాంగ్రెస్ నేతలు కందుకూరి పూర్ణచందర్, కందుకూరి రజినీకాంత్ కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ గోకుల్ జంక్షన్‌లో సోనియాగాంధీ చిత్రపటానికి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ క్షీరాభిషేకం చేశారు.

● కాజీపేట: కాజీపేట చౌరస్తాలో, బాపూజీనగర్ చౌరస్తాలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీరజాలీ, మాజీ కార్పొరేటర్ గుంటి కుమారస్వామి తదితరులు కేక్‌కట్ చేసి, సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 47 డివిజన్ కడిపికొండ ఆర్వోబీ వద్ద సందెల విజయ్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు.

● మడికొండ: కడిపికొండలో పార్టీ అధ్యక్షుడు కట్కూరి రమేష్, నాయకులు గంగుల శ్రీనివాస్‌రెడ్డి, నర్మెట వెంకటరమణాగౌడ్, శ్రీలేఖ కృష్ణ, మడికొండలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

● గిర్మాజీపేట: వరంగల్ బస్‌స్టేషన్‌లో కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ పండ్లు పంపిణీ చేశారు. వెంకట్రామ జంక్షన్‌తో పాటు 27వ డివిజన్ కొండా పటేల్ కాలనీలో టీపీసీసీ నేత మీసాల ప్రకాష్ సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులోని బాపూజీ మున్సిపల్ కమ్యూనిటి హాల్‌లో యువజన కాంగ్రెస్ తూర్పు అధ్యక్షుడు ఎం.డి.సలీమ్ అహ్మద్ కేక్ కట్ చేశారు.

● వరంగల్ టౌన్: కొత్తవాడలో 23వ డివిజన్ అధ్యక్షురాలు గొండ రజిత-శ్రీనివాస్ కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. 21వ డివిజన్ తిలక్‌రోడ్డులో కార్పొరేటర్ మహమ్మద్ ఫుర్ఖాన్ కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు.

● శంభునిపేట: శంభునిపేట జంక్షన్‌లో 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కలకోట్ల రమేష్, ఈదుల భిక్షపతి, సానమాల సత్యనారాయణ ఈదుల రమేష్, రుక్మచారి, అనిల్, బషీర్, మంద మోహన్, గాదె నవీన్, కుమార్ పాల్గొన్నారు.

● వరంగల్ సిటీ: నగరంలోని 14వ డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య ఆధ్వర్యంలో ఏనుమాముల బాలాజీనగర్ జంక్షన్‌లో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంతియాజ్, అడుప మహేష్, పులిశేరు రాధాక్రిష్ణ, సౌరం చిన్ని, కడెం కుమార్, కోవెల శ్రీను, రాజేందర్ పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: తూర్పుకోటలో కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్ ఆధ్వర్యంలో సోనియాగాంధీ జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోయిని దూడయ్య, బెడిద వీరన్న, సంగరబోయిన చందర్, బొలుగొడ్డు శ్రీనివాస్, రాణి, అర్షం రాంబాబు, కర్ణాకర్, గడ్డం రాజు పాల్గొన్నారు.

● మట్టెవాడ: కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్‌రాజ్ ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్‌లో కేక్ కట్ చేసి మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో మీసాల ప్రకాశ్, తోట వేణుమాధవ్, మహ్మద్ వసీం, నారగోని స్వప్న, మబ్బు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ లీగల్: కోర్టు ఎదుట కాంగ్రెస్ లీగల్‌సెల్ న్యాయవాదులు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల లీగల్ సెల్ చైర్మన్లు తోట రాజ్‌కుమార్, శామంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర మాజీ సెక్రటరీ తొగరు జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర వైస్ చైర్మన్ నల్ల మహాత్మా, రాష్ట్ర లీగల్ సెల్ అధికార ప్రతినిధి వేముల రమేష్, రాష్ట్ర కన్వీనర్ కందుకూరి రజినీకాంత్ పాల్గొన్నారు.



కొత్తవాడలో కేక్ తినిపిస్తున్న కార్పొరేటర్ ఫుర్ఖాన్



గోకుల్ జంక్షన్‌లో సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బంక సరళయాదవ్



కడిపికొండలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా మార్చాలి

● కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి
● మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ధర్నా నిర్వహించారు. సోమవారం దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ విధి విధానాలు ప్రకటించడం లేదని విమర్శించారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా మార్చాలని రైల్వే స్టేడియంలో బస్టాండ్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించి బోడగుట్ట ప్రజలకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించి కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు 60 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించినట్లు వినయ్ భాస్కర్ తెలిపారు. పార్లమెంట్ సమావేశంలో సమస్యలపై కేంద్ర ప్రభుత్వం అనుకూలంగా నిర్ణయం తీసుకోకుంటే గల్లీ నుంచి ఢిల్లీదాక పోరాటం ఉధృతం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్లగిరి రమేష్, 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు, అర్బన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్, సిరుమల్ల దశరథం, 47వ డివిజన్ అధ్యక్షుడు దువ్వ కనరాజు, ఎండి అఫ్జల్ పాల్గొన్నారు.



ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో పాల్గొన్న దాస్యం వినయ్ భాస్కర్

పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద శ్రీకాంత్



పరిపాలన భవనం ఎదుట నిరసన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలను వెంటనే వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం కేయూ పరిపాలన భవనం ఎదుట ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో పీజీ విద్యార్థులు పెద్దఎత్తున నిరసనకు దిగారు. పరిపాలన అధికారులకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. పరిపాలన భవనంలో బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఈనెల 18 నుంచి జరుగాల్సిన మూడో సెమిస్టర్ పరీక్షల సెలబస్ పూర్తికాలేదని అన్నారు. సెలబస్ పూర్తికాకుండా పరీక్షల షెడ్యూల్ ఏలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. వర్సిటీ విద్యార్థులకు టెట్ పరీక్షలు ఉన్నాయని విన్నవించినప్పటికీ అధికారులు విన్పించుకోవడం లేదన్నారు. జనవరి 20 తర్వాత మూడో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పరీక్షలు వాయిదా వేయకపోతే వర్సిటీ బంద్‌కు దిగుతామని హెచ్చరించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం. తిరుమలదేవి, డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య, డాక్టర్ బి. నాగరాజులు వచ్చి ఆందోళన చేస్తున్న విద్యార్థులను సముదాయించారు. పరీక్షల వాయిదా అంశాన్ని వర్సిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు నరేందర్, సాయి, కిరణ్, చరణ్, కార్తీక్, టింకు, అఖిల్, నరేశ్,శ్రీనాథ్, ప్రదీప్, శ్రీకాంత్, రాజ్‌కుమార్, జస్వంత్, విష్ణు, మధు, గౌతమ్, రాకేశ్, చంటి, కార్తీక్, కావ్యమౌనిక, అనూష, శిరీష, శ్రావణి, వైష్ణవి, సువర్ణ పాల్గొన్నారు.

ఇంటర్ విద్య కీలకం

● తల్లిదండ్రులు పిల్లల్ని తప్పుదోవ పట్టకుండా చూడాలి
● హనుమకొండ ఇంటర్ విద్యాశాఖాధికారి గోపాల్

కేయూ క్యాంపస్, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ఇంటర్ విద్య కీలకమని.. పిల్లలను నిత్యం గమనిస్తూ వారు తప్పుదోవ పట్టకుండా చూడాల్సిన బాధ్యతలు అధ్యాపకులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులపై ఉందని హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి ఎ. గోపాల్ ఉద్బోధించారు. సోమవారం హనుమకొండ వృత్తి విద్యా ఇంటర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గోపాల్ హాజరై మాట్లాడారు. స్టూడెంట్ ప్రతి రోజు కళాశాలకు హాజరయ్యే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని కోరారు. ఇంటర్ విద్యలో అత్యున్నత ఫలితాల కోసం ఇంటర్ ఉన్నతాధికారులు 90 రోజుల ప్రణాళికను ప్రవేశపెట్టారని చెప్పారు. ప్రణాళికలో విద్యార్థులను భాగస్వామ్యం చేసి మంచిఫలితాలను సాధించేలా తోడ్పడాలని కోరారు. గత ఏడాది కళాశాలలో ఇంటర్ వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ఓయూ మెకానికల్ ఇంజనీరింగ్‌లో సీటు సాధించిన బానోత్ వెంకటేశ్‌కు భారత వికాస్ పరిషత్ వారిచ్చిన ల్యాప్‌టప్‌ను ఉచితంగా అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ బాధ్యులు కె. సత్యనారాయణ, సీహెచ్. జైపాల్‌రెడ్డి, కళాశాల ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ ఆర్. ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సవ్వాసి శ్రీనివాస్, ఇతర అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ల్యాప్‌టప్‌లు ఇస్తున్న ఇంటర్ విద్యాధికారి గోపాల్

ఇంజనీర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హనుమకొండ టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా శాఖ ఎన్నికలు చింతగట్టులోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో సోమవారం జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా మహ్మద్ గులాం యజ్దాని, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పటూరి రఘుపతి, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ హమీద్, కోశాధికారిగా దేవుళ్లపల్లి సాయిరాజ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బత్తిని గోపికృష్ణ, బండవరం రాకేష్, పిట్టల నాగరాజు, దామెరశెట్టి కిశోర్, రాగి నిశాంత్‌బాబు, అతియాఫాతిమా, సహాయ కార్యదర్శులుగా పెరుమాండ్ల అన్వేష్, శేషం కిరణ్‌కుమార్, మేడిపల్లి సాత్విక్, పైడి స్రవంతి, లోరీనాతో పాటు ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ప్రచార కార్యదర్శులను ఎన్నియ్యారు.

● బాలికలు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

వడ్డెపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాలికలు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి విద్యపై ఏకాగ్రత సారించాలని పింగిళి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి. కవిత అన్నారు. సోమవారం వడ్డెపల్లిలోని బాలికల పింగిళి కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలికలు విద్యతో పాటు క్రీడా రంగంలో సైతం రాణించాలని కోరారు. సమావేశంలో ఇంటర్మీడియేట్ విద్యాధికారి గోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ సర్వే ప్రారంభం

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలనే ఆదేశాల మేరకు పనులు చకచకా జరుగుతున్నాయి. సోమవారం జైపూర్‌కు చెందిన ఎన్‌కే బిల్డ్ కన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు సర్వేకు ఉపయోగించే పరికరాలకు బల్దియా ప్రధాన కార్యాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉన్నతస్థాయి అధికారుల నుంచి ఫీల్డ్ వర్కర్ల వరకు ఇందులో పాల్గొన్నారు. మూడు నెలల పాటు నగరంలో భూగర్భ డ్రెయినేజీ సర్వే చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఫస్ట్ పార్ట్ పనుల కింద బేసిక్ సర్వే నిర్వహిస్తామని, మాస్టర్ ప్లాన్ పూర్తయిన తర్వాత డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) ఇస్తామని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌కు గాను ప్రభుత్వం నుంచి రూ. 4,170 కోట్లు కేటాయించారని తెలిపారు. డీపీఆర్‌లో వాటర్ సప్లై, ఆక్వాఫైర్ మేనేజ్‌మెంట్, డిజైన్ ఆఫ్, బ్లూ, గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లు డిజైన్ చేస్తామని వెల్లడించారు. సర్వే పనులు ముగిన తర్వాత డీపీఆర్ ఆధారంగా ఎక్కడి నుంచి ఎక్కడికి లైన్ వేయాలి అనేది స్పష్టం చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్‌కాలనీ, బ్యాంకు కాలనీ, చైతన్యపురి కాలనీ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలో విష్ణుపురి వాటర్ ట్యాంక్ ఏరియా, కాజీపేట పోలీస్‌స్టేషన్ ఏరియా, డాక్టర్ వెంకట్‌రెడ్డి ఆసుపత్రి, సాయిపూజ కాంప్లెక్స్, సోమిడి రోడ్డు విష్ణుపురిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదన్నారు.

ఎల్ఐసీ కార్మికుల ధర్నా

హనుమకొండ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఎల్ఐసీ కార్మికులు సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎల్ఐసీ జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అరవై సంవత్సరాలుగా ఎల్ఐసీలో ఏజెంట్లుగా కొనసాగుతున్నా తమ సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించడం లేదని అన్నారు. డిసెంబర్ 12, 13 తేదీల్లో 26, 27తేదీలలో నిర్వహించనున్న రెస్ట్ డే కార్యక్రమంలో ఎల్ఐసీ కార్మికులు, ఏజెంట్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాసంగుల రామారావు, జోనల్ వైస్ ప్రెసిడెంట్ పుసులూరి రమేష్‌బాబు, డివిజన్ కార్యదర్శి రావుల నారాయణ, గట్టు వెంకటాచార్య, ఆకుల గాంధీ, రాచకొండ వెంకటేశ్వర్లు, జోనల్ ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం



తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

హనుమకొండ టౌన్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. గతంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో చేతిలో బతుకమ్మ తలపై కిరీటం ఏర్పాటు చేసి ఉద్యమ కాలంలో అన్ని వర్గాలను కలుపుకొని రాష్ట్రాన్ని సాధించినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజనికాంత్, కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, సాల్వాజీ రవీందర్, నాయకులు ఎండీ. నయీంమొద్దిన్ జనార్ధన్‌గౌడ్, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలను పరిశీలించిన అధికారులు

ఖిలావరంగల్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): శివనగర్ ప్రాంతంలో అండర్ డ్రైయినేజీ తవ్వకాలలో బయల్పడిన కాకతీయుల కాలంనాటి విగ్రహాన్ని ఖిలావరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, రాష్ట్ర పురావస్తు శాఖ అధికారి మల్లూనాయక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇక్కడ దేవాలయం ఉన్నట్లయితే ఇలాంటివి ఇంకా అనేకం ఉండాలని, కాని ఇక్కడ ఆ అవకాశం లేదని అన్నారు. ఇక్కడ బయల్పడిన రాతి శిల్పంపై శివలింగం, సూర్య, చంద్ర ప్రతిబింబాలు, ఆవు లేగ దూడ ప్రతిబింబాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలతో పాటు చరిత్ర పరిశోధకుడు అరవింద్ ఆర్యా తదితరులు పాల్గొన్నారు.

'సమగ్రశిక్ష' ఉద్యోగుల హామీలు నెరవేర్చాలి

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్



ఏకశిల పార్కు ఎదుట నిరాహార దీక్షలో మాట్లాడుతున్న అశోక్

హనుమకొండ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగుల హామీలు నెరవేర్చాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు ఎదుట సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దీక్ష శిబిరాన్ని టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అశోక్ సందర్శించి సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర కార్యదర్శి కడారి బోగేశ్వర్, జిల్లా కార్యదర్శులు బొల్లంకొండ పూర్ణచందర్, పూజారి మనోజ్, పాల్గొన్నారు.

చిప్ప వెంకటేశ్వర్లుకు అంబేద్కర్ అవార్డు



న్యూఢిల్లీలో అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వర్లు

వరంగల్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడకు చెందిన టీపీసీసీ రాష్ట్ర చేనేత విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ ఫెల్లోషిప్ అవార్డును అందుకున్నారు. దళిత సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం న్యూఢిల్లీలో నిర్వహించిన దళిత సాహిత్య అకాడమీ వార్షికోత్సవంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డును ఆభరణంగా కాకుండా బాధ్యతగా స్వీకరించి దళిత బహుజనుల పక్షాన పోరాటం చేస్తానని అన్నారు.

పత్తి కొనుగోళ్లలో..

అక్రమాల కట్టడికి వాట్సాప్

- పారదర్శకతే లక్ష్యంగా చర్యలు
- రైతులకు సాంకేతికతతో ప్రయోజనం
- వరంగల్ రీజియన్ మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్



వాట్సాప్ నెంబరు : 88972 81111

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు 9 : (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులకు ప్రయోజనకరంగా.. మార్కెట్లో పంటను అమ్ముకునే క్రమంలో వారికి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెటింగ్ శాఖ, సీసీఐ సాంకేతికతను వినియోగిస్తున్నాయి. వాట్సాప్ ద్వారా సమాచారమిస్తూ వారికి దన్నుగా నిలుస్తున్నాయి. ఈ క్రమంలో కొత్తగా తీసుకువచ్చిన మొబైల్ వాట్సాప్ నం.88972 81111 రైతులకు ప్రయోజనకరంగా మారింది. ఈ క్రమంలో పత్తి రైతులు సీసీఐ నిబంధనలకు అనుగుణంగా పత్తి విక్రయించి మద్దతు ధర పొందేందుకు సాంకేతికత ఏ మేరకు ఉపయోగపడుతోందో వరంగల్ రీజియన్ మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్ సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ఆంధ్రజ్యోతి : వరంగల్ రీజియన్ పరిధిలో సీసీఐ పత్తి కొనుగోళ్లు ఎలా జరు గుతున్నాయి? దళారుల దందా మరింతగా ఉందన్న ప్రచారంపై మీ స్పందన?

జేడీ శ్రీనివాస్ : ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతుకు మేలు చేయాలనే సంకల్పంతో రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ పలు కఠిన చర్యలు తీసుకుంది. దళారులను దరి చేరనియవద్దనే లక్ష్యంతో సాంకేతికతను ఉపయోగించుకుంటోంది. కొత్తగా సాఫ్ట్‌వేర్‌ను తయారుచేయించి రాష్ట్రంలో పత్తి సాగు చేసిన రైతుల సమచారాన్ని మొత్తం వ్యవసాయశాఖ ద్వారా సేకరించింది. ఏ జిల్లాలో, ఏ మండలంలో, ఏ గ్రామంలో, ఏ రైతు ఎంత విస్తీర్ణంలో పత్తి సాగు చేశాడో.. ఆ మొత్తం వివరాలు ఈ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేశారు. పత్తి పండించిన రైతు మద్దతు ధర పొందేందుకు వీలుగా పూర్తి సమచారం వాట్సాప్ ద్వారా తెలుసుకునేలా చర్యలు తీసుకుంది. దీని వల్ల రైతులు తప్ప దళారులు సీసీఐకి అమ్ముకునేలా వీలులేకుండా చేసింది.

ఆంధ్రజ్యోతి : సీసీఐ పత్తి కొనుగోళ్లు ఎలా సాగుతున్నాయి?

జేడీ: ఆధునిక సాంకేతికతను వినియోగించడం వల్ల ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ పత్తి కొనుగోళ్లు సాఫీగా సాగుతున్నాయి. ఏదైనా చిన్న సమస్య తలెత్తిన వెంటనే మా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుంటున్నారు. పత్తి కొనుగోళ్లలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : వరంగల్ రీజియన్‌లో ఎన్ని సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేశారు?

జేడీ: రీజియన్ పరిధిలో 19జిల్లాలో మొత్తం గత సీజన్‌లో 149 ఏర్పాటు చేస్తే ఈ సీజన్‌లో 186 కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులకు అనుకూలంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుని ఏర్పాటు చేశారు.

ఆంధ్రజ్యోతి : సీసీఐ, వ్యాపారులు ఎంత కొనుగోలు చేశారు ? గతేడాదికి ఇప్పటికీ ఏమైనా రైతుల్లో మార్పు కనిపించిందా..?

జేడీ: గతేడాది రీజియన్ పరిధిలో పత్తి సీజన్‌లో వ్యాపారస్థులు 14.71.359 క్వింటాళ్లు, సీసీఐ 9.60.985 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. ఈ సీజన్‌లో డిసెంబరు 3 వరకు ఉన్న రిపోర్టు ప్రకారం ప్రైవేటు 15.58.805 క్వింటాళ్లు, సీసీఐ 46.80.291 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది.

ఆంధ్రజ్యోతి : ఈ సీజన్‌లో రైతులు సీసీఐకే పత్తిని అమ్ముకున్నారంటే కారణం ఏమై ఉంటుంది?

జేడీ: చాలా వరకు పత్తి రైతుల్లో అవగాహన పెరిగింది. ప్రతీ రైతు లేదా వారి పిల్లలు మొబైల్ ఫోన్లు వినియోగిస్తున్నారు. కొత్తగా తయారు చేసిన సాఫ్ట్‌వేర్‌తో పాటు మొబైల్ వాట్సాప్ ద్వారా రైతులు లేదంటే వారి పిల్లలు పూర్తి సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. పారదర్శకత కనిపిస్తోంది. దళారులు మిల్లులకు పోయినా కొనుగోలు చేసేందుకు సాఫ్ట్‌వేర్ సహకరించదు. ఇక రెండో కారణం సీసీఐతో పోలిస్తే వ్యాపారులు తక్కువ దరకు కొనుగోలు చేయడం వల్ల రైతులు సీసీఐకి అమ్మేందుకే ఆసక్తి చూపుతున్నారు. డబ్బులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమవుతుండడంతో ఎలాంటి ఇబ్బందులు లేకపోవడం వల్ల రైతులు సీసీఐకి అమ్ముకుంటున్నారు.

15న జిల్లా స్థాయి ఖో-ఖో ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్ డిసెంబరు 9 : (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న హనుమకొండ జేఎన్ఎస్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సీనియర్స్ బాలబాలికల ఖో-ఖో ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి శ్యాం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జనవరి 9 నుంచి 11 వరకు వరంగల్ జిల్లా గీసుగొండలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఖో-ఖో చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకై సెల్ 99633 36559 నెంబర్‌లో సంప్రదించాలని శ్యాం సూచించారు.

బేరాలు బదిలీలు!

(5వ పేజీ తరువాయి)

పరస్పర బేరాలకు అడ్డాగా మారుతున్నట్లు ఉపాధ్యాయులే చర్చించుకుంటున్నారు.

చేతులు మారనున్న వందల కోట్ల రూపాయలు

2022లో పరస్పర బదిలీలకు పచ్చ జెండా ఊపినప్పుడు రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్ల రూపాయలు చేతులు మారినట్లు అప్పట్లో చాలా పెద్ద చర్చ నే జరిగింది. ఇప్పుడు అదే తరహాలో వందల కోట్ల రూపాయలు చేతులు మారనున్నట్లు విద్యాశాఖలో చర్చ జరుగుతోంది. 2022లో గరిష్ఠంగా కరీంనగర్ జిల్లాలో ఓ బదిలీకి రూ.36 లక్షలు పలుకగా, ఇప్పుడది రూ.50 లక్షల వరకు చేరుకుంటుందనే అభి ప్రాయాన్ని ఉపాధ్యాయ వర్గా లు వెల్లడిస్తున్నాయి. 2017 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులే వారి సొంత జిల్లాలకు తిరిగి వచ్చేం దుకు ఆసక్తి చూపుతుండటం, స్పౌజ్ కేటగిరీల్లో అవకాశం దొరకని పరిస్థితి ఉన్నవారు పరస్పర బదిలీలకు ప్రయత్నాలు ప్రారంభించడంతోనే ఈసారి ఎక్కువ పెరిగే అవకాశాలున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు అభిప్రా యాలను వ్యక్తం చేస్తున్నారు.

డీఈవో కార్యాలయాలే అడ్డాలు

పరస్పర బదిలీలకు బేరాలు కుదుర్చుకునేందుకు డీఈవో కార్యాలయాలే అడ్డాలుగా చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయ గ్రూపుల్లో వస్తున్న పోస్టులను చూస్తున్న ఆశావహులు డీఈవో కార్యాలయాల వద్దకు వస్తే ఓ మాట మాట్లాడుకుందామని ఫోన్లు చేస్తున్నట్లు సమాచారం. అయి తే కార్యాలయాల్లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది సైతం పరస్పర బదిలీలకు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలు స్తోంది. ఇక కొంతమంది ఉపాధ్యాయులు గ్రూపుల్లోని పోస్టులతో పరస్పర బదిలీల ఏజెంట్లుగా మారినట్లు సమాచారం.

ఆశావహుల మధ్య మధ్యవర్తిత్వం జరుపుతూ కమీషన్లను సైతం మాట్లాడుకుంటున్నట్లు తెలుస్తోంది. మరికొంత మంది ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న ఉపాధ్యాయులు.. సందులో సడేమియాగా మారి ఆశావహులకు పెట్టుబడుతో వారి వడ్డీ వ్యాపారాన్ని విస్తరిస్తున్నట్లు వినికిడి.

యాప్‌లు, గూగుల్‌లో..

మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు ఆసక్తి ఉన్నవారి వివరాల కోసం ప్రత్యేక యాప్‌లు, వెబ్ పేజీలు పుట్టుకొస్తున్నాయి. గూగుల్ ఫాముల్లో ఆశావహులు వివరాలు పంపించాలంటూ వాట్సాపుల్లో పోస్టులు వస్తున్నట్లు తెలిసింది.

హనుమకొండ, వరంగల్ జిల్లాలకే ఎక్కువ ఆసక్తి

హనుమకొండ, వరంగల్ జిల్లాలకే పరస్పర బదిలీల ఆశావహులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. హనుమకొండ జిల్లాకు స్పౌజ్, మెడి కల్, పరస్పర బదిలీలకు సుమారు 350కిపైగా ఉపాధ్యా యులు దరఖాస్తులు చేసుకోను న్నట్లు సమాచారం. వరంగల్ జిల్లాకు సుమారు 250 మందికి పైగా జనగామ జిల్లాకు 200కు పైగా, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు తక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసుకోనున్నట్లు తెలిసింది. స్పౌజ్, మెడికల్ కేటగిరీల్లో తగినన్నీ పోస్టులు లేకపోవడంతో పరస్పర బదిలీలకే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.



మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ టీచర్ల వివరాలు పొందుపరుస్తామంటూ ఓ వెబ్ పేజ్

వాట్సాప్ గ్రూపుల్లో

వివరాలు

- మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు పోస్టు పెట్టారు.
- ఖిలావరంగల్ మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు మహబూబాబాద్ జిల్లాకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు పెట్టారు.
- మరో యేడాదిలో రిటైర్డ్ కానున్న ఓ స్కూల్ అసిస్టెంట్ తాను హనుమకొండ మండలం నుంచి ఎక్కడికైన వెళ్లాతానంటు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు పెట్టారు.
- జనగామ జిల్లాలో పనిచేస్తున్న తాను ఏ జిల్లాకైనా రెడీ అంటూ రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్న ఓ ఎస్జీటీ ఉపాధ్యాయుడు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు పెట్టారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు వచ్చేందుకు ఎవరైనా ఉంటే తనను సంప్రదించాలని ఓ స్కూల్ అసిస్టెంట్ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు పెట్టారు.
- మహబూబాబాద్ జిల్లాకు ఎవరైనా వస్తే తనను సంప్రదించాలని ఓఎల్ఎఫ్‌ల్ హెడ్మాస్టర్ పోస్టుపెట్టారు.
- నర్సంపేట మండలం పరిధిలో పనిచేస్తున్న ఓ ఎస్జీటీ ఉపాధ్యాయుడు సిద్ధిపేట వాళ్లు తనను సంప్రదించాలంటూ పోస్టు పెట్టారు.
- ములుగు జిల్లా ఏటూరునాగారం మండల పరిధిలో పనిచేస్తున్న ఓ జూనియర్ ఉపాధ్యాయుడు.. తనకు వరంగల్, హనుమకొండ జిల్లాల్లో రోడ్ సైడ్ పాఠశాలలకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు పోస్టు పెట్టారు.

ఓం.. ఓం.. అయ్యప్ప



ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు రథం వద్దకు తీసుకొస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, స్వప్న దంపతులు

- శరణుఘోషతో మార్మోగిన నర్సంపేట
- మాదన్నపేట చెరువు వద్ద కనుల పండువగా పంబారట్
- వేలాదిగా తరలొచ్చిన మాలధారులు, భక్తులు

నర్సంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప శరణు ఘోషతో నర్సంపేట మారుమోగింది. శబరిమలై సన్నిదానం తరహాలో సోమవారం మాదన్నపేట చెరువు వద్ద పంబారట్టు ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. నర్సంపేట శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి దేవాలయంలో 24వ మండల పూజా మహోత్సవాల్లో భాగంగా బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, స్వప్న దంపతుల ఆధ్వర్యంలో గురుస్వామి సీహెచ్ వెంకటేశ్‌శర్మ ఈ వేడుకలను నిర్వహించారు. ఆలయ సేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పైసా సురేశ్ కమిటీ సభ్యుల నేతృత్వంలో తాంత్రిక వేత్త, గురుస్వామి వెంకటేశ్ శర్మ వేద మంత్రోచ్చరణల నడుమ జల, పుష్ప తాంత్రిక పూజలను నిర్వహించారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11గంటల వరకు అయ్యప్ప దేవాలయంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేయగా.. మాలాదారులు, భక్తులతో కలిసి అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా మాదన్నపేట చెరువు వద్దకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో కళాకారుల డప్పుచప్పుళ్లు, మహిళల కోలాట నృత్యాలు, డోలు కళాకారుల విన్యాసాలు, మాలాదారుల నృత్యాలతో నర్సంపేట పట్టణంలో ఆధ్యాత్మికతతో ఓలలాడింది. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు అమరవీరుల స్థూపం, అంగడి సెంటర్, అంబేడ్కర్ సెంటర్, వల్లభ్‌నగర్ నుంచి కమలాపురం సమీపంలోని మాదన్నపేట చెరువు వరకు సాగింది. అనంతరం అయ్యప్పకు పంబారట్టు(జలక్రీడ) ఉత్సవాన్ని కనులవిందుగా నిర్వహించారు. అనంతరం చెరువు మెట్ల వద్ద వేదికపై విగ్రహాన్ని ప్రతిష్ఠించి పాలు, పెరుగు, నెయ్యి, విభూది, పంచదార, చందనం, పసుపు, పండ్లు, తేనె, జలంతో అభిషేకం చేశారు. అభిషేక సమయంలో ఆ ప్రాంతంలో గరుడ పక్షులు సంచరించడంతో అయ్యప్పస్వామి గరుడ రూపంలో వచ్చారంటూ భక్తులు శరణం అయ్యప్ప అంటూ వేడుకున్నారు. అభిషేకపూజల అనంతరం నూతనవ స్త్రాలతో అలంకరించి స్వామికి ధూపదీప నైవేద్యం సమర్పించడంతో పంబారట్టు వేడుక ముగిసింది. ఈ వేడుక సందర్భంగా చెరువు కట్ట జాతరను తలపించింది. అనంతరం వేలాది మంది మాలధారులు, భక్తులకు మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో పంబాసద్ది (భోజనం) ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు, ప్రజలు పాడిపంటలతో సుఖసంతోషాలతో విరాజిల్లాలని, కొన్నేళ్లుగా అయ్యప్ప పంబారట్టుకు దాతగా కొనసాగుతుండటం, మాలధారులకు మహాన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీరాంఈశ్వరయ్య, భూపతి లక్ష్మీనారాయణ, అర్చకులు వినేశ్‌శర్మ, గురుస్వామి అనిల్‌కుమార్, ఓడీఎస్ చైర్మన్ రామస్వామినాయక్, బీఆర్ఎస్ నాయకులు, మునిసిపల్ వైస్ చైర్మెన్ మునుగాల వెంకట్‌రెడ్డి, నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నాగిశెట్టి ప్రసాద్, అప్పాల సుదర్శన్, రావుల సతీష్, బండి రమేశ్, ఎంవి.రామారావు, యాదగిరి, చంద్రమౌళి, బత్తిని శ్రీనివాస్, కొమాండ్ల జయమ్మ, గోపాల్‌రెడ్డి, వాసం కరుణ, నాయిని సునీత, శానబోయిన రాజ్‌కుమార్, మోదె పద్మనాభరెడ్డి, రామారావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పకు జల క్రీడ నిర్వహిస్తున్న మాలధారులు



స్వామికి నమస్కరిస్తున్న మాలధారులు, భక్తులు



శిక్షణలో కానిస్టేబుళ్లకు సూచనలిస్తున్న ఎస్పీ పూజ

పీటీసీలో పీసీ టు హెచ్‌సీ శిక్షణ షురూ

813 మంది కానిస్టేబుళ్లకు ఆరు వారాల పాటు ట్రైనింగ్

మామునూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ మామునూరు క్యాంపు కార్యాలయంలోని పోలీసు శిక్షణ కళాశాలలో 813మంది పోలీస్ కానిస్టేబుళ్లకు ప్రమోషనల్ కోర్సు (పీసీ టూ హెచ్‌సీ) శిక్షణ ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్, ఎస్పీ ఇంజారపు పూజ సోమవారం ఈ శిక్షణను ప్రారంభించగా 6 వారాల పాటు కొనసాగనుంది. వివిధ జిల్లాల నుంచి హాజరైన 813 మంది కానిస్టేబుళ్ల శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి పొందనున్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు రమేష్, వెంకటేశ్వర్‌రావు, రవీందర్, పాండు నాయక్, భిక్షపతి, ఆర్ఐలు చంద్రశేఖర్, మహేష్, నవీన్, కాశీరాం, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన వివిధ జిల్లాల కానిస్టేబుళ్లు

లౌకిక జీవన విధానాన్ని పెంపొందించాలి


ఆచార్య కాత్యాయిని విద్మహే



ఎస్ఆర్ఎఫ్ మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక రాజ్యాంగం రాసుకొని ఏడున్నర దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ దేశంలో మత ప్రసక్తి లేని రాజ్యపాలనను మనమింకా నెలకొల్పలేకపోయామని లౌకిక ప్రజాస్వామిక జీవన సంస్కృతికి పెంపొందించాల్సిన ఆవశ్యకత ఉందని కేయూ సీనియర్ ఆచార్యులు కాత్యాయిని విద్మహే అన్నారు. సోమవారం హనుమకొండ కాళోజీ విగ్రహం వద్ద ఈ నెల 14న మహబూబ్‌నగర్‌లో జరిగే సమూహ సెక్యులర్ రైటర్స్‌ఫోరం మహాసభ పోస్టర్‌ను ఫోరం బాధ్యుడు డాక్టర్ మెట్టు రవీందర్, ఇతర కవులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల నుంచి మొదలు స్వాంతంత్ర్య అనంతరం ఏలిన భారత పాలకులు కూడా ప్రజలను ఇంకా కులమతపరంగా చీలుస్తూ అధికార పీఠాలను ఎక్కుతున్నారని అన్నారు. ఫలితంగా మతతత్వ ఉన్మాదమే రాజ్యపాలనగా సామాజిక సాంస్కృతిక విధానంగా మారి విషమ పరిస్థితులు నెలకొన్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నవలాకారుడు అంపశయ్య నవీన్, పొట్లపల్లి శ్రీనివా సరావు, గంగాధర్, అనిశెట్టి రజిత, ఎం.శ్యామల, కర్రె సదాశివ్, డాక్టర్ వెంకట్‌రావు, బిల్ల మహేందర్, వెంగల్‌రెడ్డి, పాణి, బ్రహ్మాచారి తదితర అనేక మంది కవులు, రచయితలు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15, 16 తేదీల్లో గ్రూప్-2 సర్వీస్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రూప్-2 పరీక్ష నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ గ్రూప్-2 పరీక్షకు 10,310 మంది హాజరవుతుండగా 28 సెంటర్లు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం 5 రూట్ ఆఫీసర్లు, 28 డిపార్ట్‌మెంటల్ అధికారులను, ప్రతీ సెంటరుకు 5 నుంచి 10 మంది జూనియర్ అసిస్టెంట్లను నియమించామన్నారు. పరీక్ష సమయానికి ముందుగానే అభ్యర్థులు చేరుకునేలా ఆయా రూట్లలో బస్సులు నడుపాలని ఆర్టీసీ డీఎంను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ ఎస్.రవి, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలపై

కామెడీ చురకలు

- చుట్టూ జరిగే సంఘటనలే ఇతివృత్తాలు
- 'వరంగల్ డైరీస్'తో వీక్షకులను షేక్ చేస్తున్న లోకల్ టాలెంట్
- 17లక్షల మంది సబ్‌స్క్రైబర్లు.. 31కోట్ల వ్యూయర్స్
- ఈ వేదిక నుంచే ప్రముఖ రియాలిటీ షోలోకి నబీల్ ఎంట్రీ

యువ

హనుమకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'నదిలా కదిలే కడలే నీవే.. కలలే నిజమై నడిచే నావే..' అంటూ సుమధురంగా సాగే ఓ వీడియో సాంగ్.. అందులో వినికిడి లోపం ఉన్నవాళ్లను చిన్నచూపు చూడవద్దన్న ఓ సందేశంతో కూడిన షార్ట్ ఫిల్మ్. వృద్ధులను పనికిరాని వస్తువులా తీసిపారేసే వారికి కామెడీగానే చురకలంటించే ఓ షార్ట్‌బిట్, కేస్ క్లోస్డ్ థ్రిల్లర్‌తో కూడిన సస్పెన్స్ సీక్వెన్స్ షార్ట్‌ఫిల్మ్, ఏడు, ఎనిమిది భాగాలుగా కొనసాగే హెచ్-2 వెబ్ సిరీస్.. ఇలా యూట్యూబ్‌లో 'వరంగల్ డైరీస్' పేరుతో ఎన్నో వీడియోలు ఉన్నాయి. అచ్చంగా మన వరంగల్ యువకులవి. ప్రస్తుతం బిగ్‌బాస్-8 రియాలిటీ షోలో సత్తా చాటుతున్న నబీల్ అఫ్రిది, ఆయన సోదరుడు మహ్మద్ షర్జీల అలీల సారథ్యంలో వచ్చిన యూట్యూబ్ చానల్‌లో వచ్చే పలు వీడియోలు వీక్షకులను ఆలోపింపజేస్తున్నాయి.

వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిల్మ్స్

అఫ్రిది, అలీ తీసినవాటిల్లో షార్ట్ ఫిల్మ్స్, వెబ్‌సిరీస్, మ్యూజిక్ సాంగ్స్, పలు ఇతర వీడియోలు కూడా ఉన్నాయి. 'కదిలే కడలే నీవే..' మ్యూజిక్ వీడియోను నాలుగు మిలియన్ల మంది వీక్షించారు. పూర్తిగా హాస్యంతో కూడిన గ్యాంగ్ ఆఫ్ లల్లూబాయ్, దామాద్ ఫ్రం దుబాయ్, మామా ఫ్రం మాడిపల్లి, వైవా, ఎగ్జామ్ తయారీ, హెచ్2 లాంటి వెబ్ సిరీస్, కేస్ క్లోస్డ్ లాంటి సస్పెన్స్ థ్రిల్లర్ షార్ట్ ఫిల్మ్ వంటివాటిని లక్షలమంది తిలకించారు. యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్న వీరి వీడియోల స్క్రిప్ట్, డైరెక్టర్, ప్రొడక్షన్ అంతా ఈ ఇద్దరే. నబీల్ అఫ్రిది లీడ్ క్యారెక్టర్. చాలా వీడియోల్లో ఆయనే నటిస్తున్నారు. ఈ ఇద్దరి తో పాటు ఆఫ్ స్క్రీన్, ఆన్‌స్క్రీన్‌పై మరో 15మంది స్థానిక యువత వీడియోస్ రూపొందించడంలో పాలుపంచుకుంటున్నారు. ప్రతీ ఆదివారం ఒక వీడియోను అప్‌లోడ్ చేస్తారు. ఒక వీడియో చేయడానికి మూడు రోజులు పడుతుందంటున్నాడు షర్జీజ్ అలీ. ఇప్పటి వరకు 450కిపైగా వీడియోలను తీశామని, వీడియో మేకింగ్‌కు తాము లోకల్ గల్లీలు, ప్రధాన కూడళ్లు, పార్కులనే లోకేషన్స్‌గా చేసుకుంటున్నామని ఆయన వివరించారు.

అందరూ గల్లీ పోరగాండ్లే..

వరంగల్ డైరీస్ యూట్యూబ్ చానల్‌లో వారంతా గల్లీ పోరగాండ్లే.. ఓ పదిహేను మందితో కూడిన ఈ యువ బృందానికి నబీల్ అఫ్రిది, ఆయన అన్న మహ్మద్ షర్జీల్ అలీ నాయకత్వం వహిస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసిన అఫ్రిది, బీటెక్ చదివిన అలీకి ఎనిమిదేళ్ల కిందట యూట్యూబ్‌లోని వివిధ రకాల వీడియోలు చూస్తున్నప్పుడు వచ్చిన ఐడియాకు ప్రతిరూపమే వరంగల్ డైరీస్. డైరెక్టర్, యాక్టర్, కంటెంట్ రైటర్ అన్నీ వాళ్లే అయి ఓ వీడియో తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. మొదట్లో అంత రెస్పాన్స్ రాలేదు. అయినా నిరాశపడక ఒకదాని తర్వాత ఒకటిగా వీడియోలు రూపొందించారు. ఈ క్రమంలో సమకాలీన సమస్యలే ఇతివృత్తంగా చేసిన వీడియోలకు క్రమంగా ఆదరణ పెరిగింది. సామాజిక రుగ్మతలకు కామెడీ చురలకను అంటిస్తూ వివిధ అంశాలపై అఫ్రిదీ, అలీలు హిందీ, తెలుగులో వీడియోలను చేశారు. వరంగల్ వీడియోస్‌కు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 17లక్షల మంది సబ్‌స్క్రైబర్లు, 31కోట్ల మందికి పైగా వీక్షకులున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లోనూ వీరి రీల్స్‌కు 8లక్షల ఫాలోవర్స్ ఉన్నారు. వీడియోల్లో ఎక్కువ భాగంగా హిందీలో తీయడం వల్ల ఉత్తర భారత దేశ ప్రజలు కూడా ఆకర్షితులవుతున్నారు.

దాంతో ఫాలోవర్స్ కూడా అక్కడి వారే ఎక్కువగా ఉంటున్నారు. 90శాతం వీడియోలు హిందీలోనే తీయగా పది శాతం తెలుగులో తీస్తున్నారు. ఇంట్లోనే స్టూడియోను ఏర్పాటు చేసుకున్నారు.

మొదట్లో వద్దన్నా..

నబీల్, ఆలీల స్వస్థలం హనుమకొండ ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డులోని రాఘవేంద్రనగర్ కాలనీ. తండ్రి షౌకత్ అలీ ఫారెస్ట్ డిపార్టుమెంట్‌లో పని చేస్తూ 2021లో కొవిడ్ సమయంలో కన్నుమూశారు. వీరి పెద్దన్న తన్‌జీల్ ప్రస్తుతం సౌదీలో ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తున్నారు. మొదట్లో వీడియోలు తీస్తున్నప్పుడు కుటుంబసభ్యులు కొంత వ్యతిరేకించినా ఆ తర్వాత వీడియోలకు లభిస్తున్న ఆదరణ చూసి వారు కూడా ప్రోత్సహించడం మొదలు పెట్టారు. వరంగల్ డైరీస్ వీడియోలకు సబ్‌స్క్రైబర్స్ అనూహ్యంగా పెరగడంతో మంచి పేరు వచ్చింది. ప్రజల్లో వీరంటే అభిమానం కూడా పెరిగింది. ఇప్పుడు వీరు ఎక్కడికి వెళ్లినా ఎంతో ఆదరణ చూపుతున్నారు. 'మా లోకల్ పోళ్లగాళ్లు వీడియోలు భలే తీస్తున్నరు' అంటూ పొగు డుతున్నారు. అయితే నబీల్ అఫ్రిది పోషించిన పిచ్చి యా (తింగరి మనిషి), లల్లూభాయ్ మంచి క్రేజ్ ఉంది. 30ఏళ్ల కిందట ప్రజల జీవన విధానం ఎలా ఉండేదో చెప్పే ఓల్డ్‌డేస్ వీడియోస్ ఆదరణ పొందింది. వేసవి కాలంలో ఉక్కపోతతో ప్రజలు పడే పాట్లు, ఏ మాత్రం సిద్ధం కాకుండా వైవాకు వచ్చే విద్యార్థులు చిత్రవిచిత్రాలు, పరీక్షలకు హాజరయ్యే స్టూడెంట్లు పడే పాట్లను వాస్తవికతకు దగ్గరగా హాస్యరసాత్మకంగా చూపారు.



నబీల్ అఫ్రిదీ



షర్జీల్ అలీ

వరంగల్ డైరీస్ నుంచి రియాలిటీ షోలోకి..

నబీల్ అఫ్రిది వరంగల్ డైరీస్ యూట్యూబ్ చానల్ ద్వారా ప్రజలకు పరిచయమై అనతి కాలంలోనే ప్రజాదరణ పొందారు. ఈ క్రమంలో ఆయన గతంలో మూడునాలుగు సార్లు బిగ్‌బాస్‌కు వెళ్లేందుకు ప్రయత్నించినా వీలుకాలేదు. ఈ క్రమంలో బిగ్‌బాస్ నిర్వాహకులు వరంగల్ డైరీస్ వీడియోలను చూసి నచ్చి ఆడిషన్‌కు పిలిచి బిగ్‌బాస్-8లోకి అవకాశం ఇచ్చారు. ప్రస్తుతం నబీల్ వరంగల్ కుర్రాడిగా తోటి కంటెస్టెంట్లతో ఢీ అంటే ఢీ అంటూ ఫైనల్‌లో ప్రవేశించేందుకు తీవ్రంగా పోటీ పడుతున్నాడు. అయితే తన సోదరుడు నబీల్‌కు అనుకూల ఓటింగ్ బాగానే ఉంటోందని, ప్రజలు మరింత ఆదరిస్తే విజేతగా నిలిచినా ఆశ్చర్యపోనవసరం లేదని షర్జీల్ అలీ అంటున్నారు.



యూ ట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్న వరంగల్ డైరీస్ వీడియోల్లో కొన్ని



మీకు తెలుసా?

మెగ్నీషియం తగ్గితే?

తరచూ కండరాలు పట్టేస్తున్నాయా? మందులు వాడుతున్నప్పటికీ రక్తపోటు అదుపు తప్పుతోందా? అయితే మీకు మెగ్నీషియం లోపం ఉండివచ్చు. ఈ పోషకం లోపిస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయంటే...

తీవ్రమైన ప్యానిక్ అటాక్స్, చిత్తభ్రమలు, కండరాలు పట్టేయడం, అధిక రక్తపోటు... వీటికి మెగ్నీషియం లోపం కారణం కావచ్చు. ఇలాంటి సందర్భాల్లో వృక్షాధారిత లేదా మాంసాహార మెగ్నీషియం పోషకాన్ని లేదా సప్లిమెంట్లను తీసుకోక తప్పదు. శరీరంలో మెగ్నీషియం మోతాదు తగ్గడం వల్ల, నాడీవ్యవస్థ పనితీరు అదుపు తప్పి, ఆందోళన, చికాకులు పెరుగుతాయి. ఇవి ప్యానిక్ అటాక్స్ రూపంలో బయల్పడుతూ ఉంటాయి. 'హైపోమెగ్నీసీమియా' అనే మెగ్నీషియం లోపం వల్ల కండరాల నొప్పులు, అధిక రక్తపోటు, మానసిక సమస్యలు తలెత్తే అవకాశాలు పెరుగుతాయి. మధుమేహం, తీవ్రమైన డయేరియా, సిలియాక్ వ్యాధితో బాధపడే వారిలో మెగ్నీషియం శోషణ తగ్గిపోతుంది. అలాగే మద్యపానం అలవాటున్న వారిలో కూడా మెగ్నీషియం ప్రమాదకర స్థాయికి పడిపోతుంది. అయితే ఈ పోషకం మోతాదు పూర్తిగా తగ్గిపోయేవరకూ లక్షణాలు బయల్పడవు కాబట్టి ఈ సమస్యను కనిపెట్టడం



కష్టంగా మారుతూ ఉంటుంది. కాబట్టి తరచూ కండరాలు పట్టేస్తూ ఉండడం, నొప్పులు పెరగడం, కండరాలు అదురుతూ ఉండడం, అర్థం లేని ఆందోళన, భయం, భావోద్వేగాలు అదుపు తప్పుతూ ఉండడం, మానసిక కుంగుబాటు లక్షణాలు కనిపించినప్పుడు వైద్యులను కలిసి మెగ్నీషియం లోపాన్ని పరీక్షించుకోవాలి. అవసరానికి మించిన విటమిన్ డి3, మెగ్నీషియం లోపం.. ఈ రెండూ ఎముకలు గుల్లబారే ముప్పును పెంచుతాయి. అలాగే మెగ్నీషియం లోపం రక్తపోటును పెంచి, సరైన సమయంలో సరిదిద్దుకోలేకపోతే అంతిమంగా గుండెపోటుకు దారి తీస్తుంది. మెగ్నీషియం పోషకం శ్వాసనాళాల పనితీరు మీద ప్రభావం కనబరుస్తుంది. ఈ పోషకం తగ్గడం వల్ల, ప్రత్యేకించి చలికాలంలో ఆస్తమా రోగుల బాధలు రెట్టింపవుతాయి.

ఇలా పెంచుకోవచ్చు

మెగ్నీషియం పుష్కలంగా పదార్థాలను సరిపడా తీసుకోవడం ద్వారా ఈ లోపాన్ని అరికట్టవచ్చు. అవేంటంటే...

- పొట్టు తీయని ధాన్యాలు
- బీన్స్
- ఆకుకూరలు, కూరగాయలు.

అవగాహన

చెవిలో చప్పుడు ఎందుకు?

గుండెచప్పుడును పోలిన శబ్దం చెవిలో కూడా వినిపిస్తూ ఉంటుంది. ఈ లయబద్ధమైన శబ్దం వెనకేదైనా ఆరోగ్య సమస్య దాగి ఉందా? తెలుసుకుందాం!

నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నప్పుడు లేదా పడుకుని ఉన్నప్పుడు చెవిలో గుండె చప్పుడుతో సమానమైన శబ్దం వినిపిస్తూ ఉంటుంది. దీన్ని 'పల్సటైల్ టిన్నిటస్' అంటారు. ఇలా నాడి కొట్టుకుంటున్నట్టు తోచే ఈ ఒంటి లయబద్ధమైన చప్పుడు కొందర్లో ఒక చెవిలో వినిపించవచ్చు, ఇంకొందర్లో రెండు చెవుల్లో వినిపించవచ్చు. మెడ, తలలోని రక్తనాళాల్లో రక్త ప్రవాహ ఫలితమే ఈ చప్పుడు. ఇలాంటి చప్పుడు వెనకున్న కారణాలు ఏవంటే...

- **వినికిడి లోపం:** మధ్య చెవిలో ఇన్‌ఫెక్షన్ లేదా ఇన్‌ఫ్లమేషన్ లేదా ద్రవం పేరుకుపోవడం వల్ల వినికిడి లోపం తలెత్తవచ్చు. కొన్ని సందర్భాల్లో వినికిడికి తోడ్పడే చెవిలోని చిన్న ఎముకల్లో సమస్యలు తలెత్తడం వల్ల కూడా వినికిడి తగ్గవచ్చు. ఈ రకమైన వినికిడి లోపం అంతర్గతంగా తలలో శబ్దాలను కూడా తీవ్రతరం చేస్తుంది. అంటే ఊపిరి తీసుకోవడం, నమలడం, చెవిలోకి రక్తప్రసార శబ్దాల తీవ్రత పెరుగుతుంది.
- **కరోటిడ్ ధమని వ్యాధి:** కరోటిడ్ ధమనుల్లో పేరుకుపోయే కొవ్వుల మూలంగా రక్తప్రవాహంలో హెచ్చుతగ్గులు చోటు చేసుకుని పల్సేటివ్ టిన్నిటస్ తలెత్తుతుంది.
- **అధిక రక్తపోటు:** రక్తపోటు ఎక్కువగా ఉన్నప్పుడు, కరోటిడ్ ధమనిలో రక్త ఉధృతి ఫలితంగా కూడా చెవిలో చప్పుడు మొదలు కావచ్చు.



- **రక్తనాళ సమస్యలు:** రక్తనాళంలో అవకారాలు (అన్యూరిజం), ధమనికీ, శిరకూ మధ్య అసాధారణ సంబంధం ఏర్పడి ఉండడం (ఆర్టీరియోవీనస్ మాల్‌ఫార్మేషన్), ధమనులు మెలితిరిగి ఉండడం లేదా, కర్ణభేరి వెనక ఉండే రక్తనాళాల మీద కణుతులు పెరగడం వల్ల కూడా చెవిలో చప్పుళ్లు వినిపించవచ్చు.

ఎక్కువ సందర్భాల్లో పల్సేటివ్ టిన్నిటస్ గురించి కంగారు పడవలసిన అవసరం ఉండదు. కానీ దానంతట అది తగ్గిపోకుండా, వారాల తరబడి వేధించే స్థాయికి చేరుకుంటే, తప్పనిసరిగా వైద్యులను కలవాలి.



చలికాలం చెక్కుచెదరని ఆరోగ్యం

ఏడాదిని ఉత్తరాయనం, దక్షిణాయనం అనే రెండు భాగాలుగా విభజించుకుంటే ఉత్తరాయనంలో వేడి ఎక్కువగా ఉంటుంది కాబట్టి శరీరం బలహీనపడుతుంది. శరీరంలోని సత్తువ బయటకు వెళ్లిపోతుంది కాబట్టి ఆ కాలాన్ని ఆదాన కాలం అంటారు. దక్షిణాయనంలో చల్లని వాతావరణం వల్ల శరీరం శక్తిని స్వీకరించి, బలపడుతుంది కాబట్టి ఈ కాలాన్ని విసర్గ కాలం అంటారు. కాబట్టి ఏడాదిలోని మొదటి ఆరునెలల్లో కోల్పోయిన సత్తువను తిరిగి పొందే వీలున్న కాలంగా దక్షిణాయనాన్ని, మరీ ముఖ్యంగా చలికాలాన్నీ పరిగణించాలి. ఇది సత్తువను పెంచే కాలమే అయినప్పటికీ, చల్లదనం మూలంగా విజృంభించే వ్యాధులకు దూరంగా ఉండాలంటే ఈ కాలానికి తగిన, తగని ఆహార పదార్థాల పట్ల అవగాహన ఏర్పరుచుకోవాలి. అలాగే శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడం కోసం ఈ కాలాన్ని పరిపూర్ణంగా సద్వినియోగం ? చేసుకోవాలి.



అభ్యంగనం అవసరం

చల్లగాలితో చర్మపు తేమ తగ్గిపోకుండా ఉండడం కోసం ప్రతి రోజూ అభ్యంగనం ఆచరించాలి. అందుకోసం నువ్వుల నూనె లేదా ఆవ నూనె వాడుకోవచ్చు. అభ్యంగనం కోసం ఎండలో కూర్చుని ఒళ్లంతా నూనె పట్టించి, సున్నితంగా మర్దించి, కొంద్దిసేపు ఎండ తగిలేలా చూసుకుని, తర్వాత గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయాలి. ఈ పని తీరుబడిగా చేయగలిగితే, చర్మంలోకి నూనె ఇంకి, నునుపుగా మారి, పగుళ్లు ఏర్పడకుండా ఉంటాయి. క్షీరబలా తైలాన్ని కూడా అభ్యంగనం కోసం వాడుకోవచ్చు. ఈ నూనెను గోరువెచ్చగా కాచుకుని తల నుంచి పాదాల వరకూ మర్దించినా చర్మం మృదువుగా మారుతుంది.

శక్తిని పుంజుకునే కాలం

ఈ కాలంలో జఠరంలో అగ్ని ప్రబలంగా ఉండడం మూలంగా తిన్న ఆహారం తేలికగా అరుగుతుంది. కాబట్టి మిగతా కాలాలకు సరిపడా శక్తి నిల్వలను పెంచుకోవడం కోసం చలికాలాన్నీ, ఈ కాలంలో దొరికే పదార్థాలను మెరుగ్గా ఉపయోగించుకోవాలి. ఈ కాలంలో పండే పంటలన్నీ శరీరానికి శక్తినిచ్చేవే! కాలం కాని కాలంలో కృత్రిమంగా పండించే హైబ్రిడ్ పండ్లు కూడా నేడు మార్కెట్లో అందుబాటులో ఉన్నప్పటికీ వాటి జోలికి వెళ్లకపోవడమే మంచిది. మాంసకృత్తులు, కొవ్వులు ఎక్కువగా ఉండే పదార్థాలను నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. అలాగే పెరుగు వినహా మిగతా పాల ఉత్పత్తులన్నీ తినొచ్చు. ఈ కాలంలో దొరికే ఉసిరి, యాపిల్, పైనాపిల్, నారింజ, ద్రాక్ష మొదలైన సిట్రస్ పండ్లతో పాటు గాజర్ తింటూ ఉండాలి. ఈ కాలంలో గోధుమలు, బియ్యం తినొచ్చు. తృణధాన్యాల్లో రాగులు, ఉలవలు, సజ్జలు, బార్లీలు శరీరం పొడిబారుతుంది. కాబట్టి వీటి పరిమాణం తగ్గించాలి. కూరగాయల్లో చిక్కుడు తగ్గించాలి. ఈ కాలంలో పాలకూర, క్యాబేజీ, వినుములు, అలసందలు, పెసల పరిమాణం పెంచాలి. ఈ కాలంలో సముద్రాహారం, చికెన్, మటన్ నిరభ్యంతరంగా తినొచ్చు. ఈ కాలంలో ర్యాడిష్ మినహా మిగతా దుంపలన్నీ తినొచ్చు. డ్రైఫ్రూట్స్‌లోని మంచి కొవ్వులను శరీరం శోషించుకోవడం కోసం వాటిని బాగా నమిలి తినాలి. అలాగే చల్ల నీళ్లకు బదులుగా గోరువెచ్చని నీళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ కాలంలో దాహం తగ్గుతుంది కాబట్టి నీళ్ల పరిమాణం తగ్గించకూడదు. ఇలా చేస్తే మొలల సమస్య పెరుగుతుంది. కాబట్టి వీలైనన్ని ఎక్కువ నీళ్లు తాగాలి.

చిన్నపాటి జాగ్రత్తలతో...

ఈ కాలంలో సూక్ష్మక్రిములు విస్తృతంగా వృద్ధి చెందుతాయి కాబట్టి ఆ వీలు లేకుండా వ్యాధినిరోధకశక్తిని పెంచుకోవడం ద్వారా శ్వాసకోస సమస్యలకు దూరంగా ఉండొచ్చు. అందుకోసం ఉసిరి ఎంతో మేలు చేస్తుంది. రోజుకు ఒక ఉసిరి తిన్నా, ఉసిరితో తయారయ్యే చ్యవన్ ప్రాష్ రోజుకొక స్పూను తీసుకున్నా మేలు కలుగుతుంది.

అలాగే అభ్యంగనం కూడా క్రమం తప్పకుండా ఆచరించాలి. అంత సమయం లేనివాళ్లు వారంలో కనీసం మూడు సార్లైనా కనీసం తల, ముఖం, మెడలకు నువ్వుల నూనె పట్టించి, మర్దన చేసుకుంటే ప్రయోజనం ఉంటుంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఈ కాలంలో అడపా దడపా శ్వాసకోస సమస్యల బారిన పడక తప్పదు. అలాంటప్పుడు ఏం చేయాలంటే...

- **కషాయం:** తులసి, వేపాకు (చెరొక అరగుప్పెడు), వాము, మిరియాల పొడి (అర చెంచా), వెల్లుల్లి (నాలుగు రెబ్బలు) తీసుకుని, వీటిని 400 మిల్లీలీటర్ల నీళ్లలో వేసి 100 మిల్లీలీటర్లకు చేరుకునే వరకూ మరిగించి, రెండు పూటలా 50 మిల్లీమీటర్ల చొప్పున తీసుకోవాలి. ఈ కషాయంతో ఒకట్రెండు రోజుల్లో జలుబు పూర్తిగా తగ్గిపోతుంది.
- **పసుపు:** గ్లాసు వేడి పాలల్లో అర చెంచా పసుపు కలుపుకుని రాత్రి నిద్రకు ముందు తాగాలి. పసుపు, యాలకులతో తయారైన హరిద్రఖండం ఔషధాన్ని కూడా తీసుకోవచ్చు. ప్రతి రాత్రీ వేడి పాలలో, అరచెంచా హరిద్రఖండం కలుపుకుని తాగినా ఫలితం ఉంటుంది.
- **తాలిసాది చూర్ణం:** కఫం ఉనప్పుడు చెంచా చూర్ణాన్ని గోరువెచ్చని నీళ్ల లేదా తేనెతో కలిపి రోజుకు రెండు పూటలా తీసుకోవాలి. పిల్లలకు అర చెంచా సరిపోతుంది. ఈ చూర్ణం తేలికపాటి జలుబు, దగ్గు, జ్వరాలకు పని చేస్తుంది.
- **త్రికటు చూర్ణం:** సొంఠి, మిరియాలు,పిప్పలుతో తయారైన త్రికటు చూర్ణాన్ని జలుబు చేసిన వెంటనే తీసుకుంటే, సమస్య తీవ్రమవకుండా ఉంటుంది. అర చెంచా త్రికటు చూర్ణాన్ని వేడి నీళ్లలో లేదా తేనెతో కలిపి తీసుకుంటే ఫలితం ఉంటుంది.

చలికాలం వ్యాయామాలు

శీతాకాలం బద్ధకం వదలాలంటే శరీరాన్ని చలాకీగా ఉంచే వ్యాయామాలు చేయాలి. జీర్ణశక్తి మెరుగై, శక్తి సమంగా శరీరమంతటా ప్రసరించాలన్నా వ్యాయామం చేయక తప్పదు. గుండె వేగాన్ని పెంచే వ్యాయామాలు, కీళ్లు, కండరాలను బలపరిచే వ్యాయామాలు చేయాలి. యోగాభ్యాసాలు కూడా చేయవచ్చు. సైకిల్ తొక్కడం, ఈత, స్కిప్పింగ్ లాంటివీ చేయవచ్చు. వ్యాయామం చేయాలనే ఆసక్తి లేనివారు బ్యాడ్మింటన్ లాంటి క్రీడలతో కూడా శరీరానికి వ్యాయామం అందించవచ్చు. అయితే వ్యాయామం చేస్తున్నంత సేపు తప్పనిసరిగా నీళ్లు తాగుతూ ఉండాలి. చమట ద్వారా బయటకు వెళ్లిపోయే ఖనిజ లవణాలను భర్తీ చేస్తూ ఉండాలి.

ఆరోగ్య కొవ్వులు

ఈ కాలం బలాన్ని పెంచుకోవడం కోసం నాణ్యమైన కొవ్వులను ఆహారంలో చేర్చుకోవాలి. ఇందుకోసం...

- **అవిసె నూనె:** ఈ నూనెను కూరగాయల సూప్‌లో పరిమితంగా కలుపుకుని తీసుకోవచ్చు. అయితే ఈ నూనెను నేరుగా వంటకు ఉపయోగించకూడదు.
- **సబ్జా:** వీటిని 10 నుంచి 20 నిమిషాలపాటు నీళ్లలో నానబెట్టి తాగాలి. లేదంటే రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తాగవచ్చు. వీటిలోని ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు జీర్ణవ్యవస్థతో పాటు నాడీవ్యవస్థనూ ఆరోగ్యంగా ఉంచుతాయి.
- **అవకాడొ:** మాంసకృత్తులు కలిగిన ఈ పండును ఏ సమయంలోనైనా తినవచ్చు.
- **నాణ్యమైన నూనెలు:** ఆలివ్, అవకాడొ, కొబ్బరి, నువ్వులు, పొద్దుతిరుగుడు నూనెలు వాడుకోవచ్చు.
- **నెయ్యి:** ఆయుర్వేదంలో నెయ్యి స్వర్ణంతో సమానం. వెన్న, నెయ్యి జీర్ణశక్తిని పెంచి, శరీర కణజాలాలకు శక్తినిస్తాయి.

డాక్టర్ డి.వి. ప్రశాంత్ కుమార్
పంచకర్మ నిపుణులు,
శక్తి ఆయుర్వేదిక్ క్లినిక్,
ఈస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్.



ఆరోగ్యమే మహా భాగ్యం

ఆ సువాసనలు ప్రమాదకరం

సువాసనలు వెదజల్లే కొవ్వొత్తులు, అగర్బత్తీలు, రూమ్ ఫ్రెషనర్లు ఆహ్లాదకరమైన సువాసనలు వెదజల్లుతూ హాయిగొలుపుతాయి. అయితే ఈ సువాసనలు దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలను కూడా తెచ్చిపెడతాయి. ఎలాగంటే...

గదుల్లోని దుర్వాసనలు పారదోలి, సువాసనలతో కూడిన వాతావరణాన్ని సృష్టించడం కోసం అగర్బత్తీలు, కొవ్వొత్తులు, రూమ్ ఫ్రెషనర్ స్ప్రేలను తరచూ వాడుతూ ఉంటాం. కానీ ఇవి దుర్వాసనలను పారదోలుతూ గదుల్లో గాలి కలుషితాలను పెంచుతాయి. కిటికీలన్నీ మూసి ఉంచిన గదుల్లో సువాసనలు వెదజల్లే కొవ్వుత్తులు, అగర్బత్తీలను వెలిగించడం వల్ల వాటి ద్వారా వెలువడే పొగలు, వాసనలు ఇంట్లోని వాతావరణాన్ని కలుషితం చేసి, సూక్ష్మ రేణువుల సాంద్రతను పరిమితికి మించి 15 రెట్లు పెంచుతాయి. ఈ పరిస్థితి సాధారణ స్థితికి చేరుకోడానికి కొన్ని గంటల సమయం పడుతుంది. సువాసన వెదజల్లే అగర్బత్తీలు, కొవ్వుత్తులను వెలిగించడం వల్ల వాటి నుంచి మిశ్రమ రసాయనాలతో పాటు, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయానాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్స్ మొదలైన విషపూరిత వాయువులు వెలువడతాయి. రూమ్ ఫ్రెషనర్లలో ఉండే సేంద్రీయ



సమ్మేళనాలు ఆరోగ్యానికి హాని చేస్తాయి. స్వల్ప వ్యవధుల పాటు వీటికి బహిర్గతం కావడం వల్ల దగ్గు, తుమ్ములు, కళ్లు, ముక్కు, గొంతు మంట లాంటి సమస్యలు వేధిస్తాయి. అయితే దీర్ఘ కాలం పాటు వీటికి బహిర్గతమైతే, తీవ్ర ఊపిరితిత్తుల సమస్యలు తప్పవు. వీటికి బహిర్గతమైతే, ఉబ్బసం వ్యాధిగ్రస్థుల ఇబ్బందులు మరింత పెరుగుతాయి. సహజసిద్ధ సేంద్రీ పదార్థాలతో తయారైన కొవ్వొత్తులు సురక్షితమైనవి అనుకుంటే పొరపాటు. వీటిని వెలిగించినప్పుడు, సహజసిద్ధ సువాసనల్లో కలిసి ఉండే హానికారక రసాయనాలు విడుదలై కాలుష్యాన్ని పెంచుతాయి.

ఫలాహారం

పండ్లు పరిమితంగానే...

బరువు తగ్గడం కోసం కొంతమంది పూర్తిగా పండ్ల మీదే ఆధారపడుతూ ఉంటారు. కానీ ఫలాహారం ఆరోగ్యకరం కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.


సమతులాహారంలో భాగంగా తరచూ పండ్లు తింటూ ఉండడం కచ్చితంగా ఆరోగ్యకరమే! అయితే ఆ అలవాటులో భాగంగా అవసరానికి మించి పండ్లు తింటున్నామా? అని ఎవరైనా, ఎప్పుడైనా ఆలోచించారా? ఎందుకంటే... 'అతి అనర్థదాయకం' అంటారు. ఈ సూత్రం పండ్లకూ వర్తిస్తుంది. అతిగా పండ్లు తినడం వల్ల ఒరిగే ప్రభావం ప్రత్యేకించి కాలేయానికి ప్రతికూలంగా ఉంటుంది. ఎక్కువ కాలం పాటు అధిక మోతాదుల్లోని ఫ్రక్టోజ్ కాలేయానికి చేరినప్పుడు, కాలేయం ఆ అదనపు ఫ్రక్టోజ్‌ను కొవ్వుగా మార్చుకుంటుంది. ఫలితంగా ఆ పరిస్థితి, నాన్‌ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్‌కు దారి తీస్తుంది. అదనంగా పండ్లు తినడం వల్ల, కడుపుబ్బరం, డయేరియా లాంటి తాత్కాలిక సమస్యలు కూడా తలెత్తే అవకాశాలుంటాయి. అలాగే పండ్లలోని సహజసిద్ధ ఆమ్లాలు, చక్కెరల వల్ల దంతక్షయం ప్రమాదం ఉంటుంది. అలాగే రక్తంలో చక్కెర మోతాదులు హెచ్చుతగ్గులకు గురవుతాయి కాబట్టి మధుమేహులు, హైపర్‌గ్లైసీమియా లేదా క్లోమ సమస్యలు ఉన్నవాళ్లు పండ్లు వీలైనంత పరిమితంగా తీసుకోవాలి.



మెదడు మొద్దుబారకుండా...

డిజిటల్ పరికరాల వాడకం మెదడు ఏకాగ్రతను తగ్గించి, జీవితంలోని సాధారణ సరదాల నుంచి ఆనందం పొందే సామర్థ్యాన్ని కుంటు పరుస్తుంది. ఈ పరిస్థితి మరింత దిగజారకుండా ఉండాలంటే, ముందుగానే అప్రమత్తం కావాలి.

డిజిటల్ పరికరాలను ఎక్కువగా ఉపయోగించడం వల్ల మెదడు అవసరానికి మించి ప్రేరేపితమై, ఏకాగ్రత సామర్థ్యాన్ని కోల్పోతుంది. ఈ పరిస్థితికి లోనైన మెదడుకు 'పాప్‌కార్న్ బ్రెయిన్' అని అమెరికాకు చెందిన డేవిడ్ ఎమ్. లెవీ అనే కంప్యూటర్ సైంటిస్టు నామకరణం చేశాడు. తరచూ స్క్రీన్ మీద ప్రత్యక్షమవుతూ ఉండే నిరంతర నోటిఫికేషన్లు, లైక్స్‌ను చూడగానే చటుక్కున పెరిగిపోయే డోపమైన్ హార్మోన్‌ల ఆధారంగా పాప్‌కార్న్ బ్రెయిన్ అనే పదాన్ని సృష్టించాడాయన. ఫోన్‌లో మోగే ప్రతి నోటిఫికేషన్ శబ్దం, అవసరమైన పనులపై నుంచి మనసును మళ్లించి, ఏకాగ్రతను కుంటుపరుస్తుంది. మన మెదడెప్పుడూ కొత్తదానికి ఆకర్షితమయ్యేలా రూపొంది ఉంటుంది. కాబట్టి ఈ లక్షణాన్ని సద్వినియోగం చేసుకునే డిజిటల్ పరికరాలు, వినోదం కోసం అంతులేనన్ని కొత్తమార్గాలను ఆవిష్కరిస్తున్నాయి. సామాజిక మాధ్యమాలు, వీడియో గేమ్స్, నిరంతర స్ట్రీమింగ్‌లు, ఫీల్‌గుడ్ హార్మోన్‌ను విడుదల చేస్తూ, పదే పదే ఆ వినోదాన్ని కోరుకునేలా మెదడును దాసోహం చేస్తాయి. ఇలా మెదడుకు చేరుకునే డిజిటల్ సమాచారం వల్ల కొంతకాలానికి మెదడు నిరంతరం దృష్టి పెట్టవలసిన పనుల పట్ల ఏకాగ్రతను కేటాయించే సామర్థ్యాన్ని కోల్పోతుంది. పుస్తక పఠనం, అర్థవంతమైన సంభాషణలను కొనసాగించడం కష్టతరమైపోతుంది. ఈ డిజిటల్ సంతృప్తికి అలవాటు పడిన వాళ్లు ఎలాంటి తక్షణ సంతృప్తినిచ్చే స్క్రీన్ల తోడు లేకుండా కుదురుగా కొద్దిసేపు కూడా కూర్చోలేకపోతూ ఉంటారు.



పెరిగే నిద్రలేమి

డిజిటల్ పరికరాలతో పొందే అవసరానికి మించిన ప్రేరణ ఆందోళన, మానసిక కుంగుబాటులకు, తమలో ఏదో లోపించిందనే భావనలకూ దారి తీస్తుంది. మరీ ముఖ్యంగా నిద్రకు ముందు ఎక్కువ సమయాల పాటు ఫోన్లకు అతుక్కుపోవడం వల్ల నిద్రకు తోడ్పడే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గి నిద్రలేమి వేధిస్తుంది. ఫోన్ల నుంచి వెలువడే నీలి వెలుగు, మెదడును చురుగ్గా ఉంచి, నిద్ర నాణ్యతను తగ్గిస్తుంది. దీర్ఘకాలం పాటు స్క్రీన్‌కు బహిర్గతమయ్యేవారికి శరీర భంగిమలు, కంటి సమస్యలు కూడా తప్పదు.

పరిమితి ఇలా...

- డిజిటల్ పరికరాల వాడకానికి సమయ పరిమితి విధించాలి. సామాజిక మాధ్యమాల వాడకాన్ని నిర్దిష్ట సమయానికే పరిమితం చేయాలి.
- పడగ్గది, భోజనాల గది, స్నానాల గదుల్లో వాటి వాడకాన్ని మానేయాలి. ఇంట్లో ఆడుకునే ఆటలు, పుస్తకాలు లాంటి ఇతర కాలక్షేపాలను పెంచి స్క్రీన్ టైమ్ తగ్గించాలి.
- తోట పని, బొమ్మలు గీయడం, వ్యాయామం లాంటి వ్యాపకాలను అలవరుచుకోవాలి
- స్క్రీన్లతో సంబంధం లేని వ్యాయామాలు, ధ్యానాలకు సమయం కేటాయించాలి.
- నిద్రకు గంట ముందు నుంచి స్క్రీన్లకు దూరంగా ఉండడం అలవాటు చేసుకోవాలి
- వీడియో స్ట్రీమింగ్‌కు బదులుగా ఆడియో బుక్స్, పాడ్‌కాస్ట్స్, రేడియో వినడం అలవాటు చేసుకోవాలి.

గ్రూప్-2 పరీక్షల వాయిదాకు హైకోర్టు నో

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్ని ఏర్పాట్లు పూర్తయిన నేపథ్యంలో ఈనెల 15 నుంచి జరగనున్న గ్రూప్-2 పరీక్షల వాయిదాకు హైకోర్టు నిరాకరించింది. రైల్వే పరీక్షలు జరగనున్న దృష్ట్యా గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ పలు జిల్లాలకు చెందిన 22 మంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది వాదిస్తూ ఈనెల 15, 16 తేదీల్లో జరగనున్న పరీక్షలకు ఇప్పటికే లక్ష మందికి పైగా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని పేర్కొన్నారు. కొద్ది మంది కోసం పరీక్ష వాయిదా వేయడం సమంజసం కాదని తెలిపారు. దీంతో ఏకీభవించిన ధర్మాసనం ఈ దశలో ఎలాంటి స్టే ఇవ్వలేమని పేర్కొంది. వివరణ ఇవ్వాలని టీజీపీఎస్సీ, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, రైల్వే శాఖ తదితరులకు నోటీసులు జారీచేస్తూ విచారణను వాయిదా వేసింది.

గ్రూప్-2 హాల్‌టికెట్ల విడుదల

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు విడుదల అయ్యాయి. పబ్లిక్ సర్వీసు కమిషన్ వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను అందుబాటులోకి తీసుకువచ్చామని, అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ నెల 15, 16వ తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఈ పరీక్షలను నిర్వహించనున్నారు.

జీవో-46పై వివరణ ఇవ్వండి

- తెలంగాణ సర్కారుకు సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగాల భర్తీకి సంబంధించి జారీ చేసిన జీవో-46పై వివరణ ఇవ్వాలని తెలంగాణ సర్కారుకు సోమవారం సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రత్యేక పోలీసుల భర్తీ విషయంలో ఉమ్మడి హైదరాబాద్ జిల్లాకు 53 శాతం, మిగిలిన రాష్ట్రానికి 47శాతం పోస్టులు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 46ను జారీ చేసింది. దీనిని సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లపై ఈ నోటీసులు ఇచ్చింది. తొలుత ఇదే విషయమై కొందరు హైకోర్టును ఆశ్రయించగా అక్కడ నిరాశ ఎదురయింది. దాంతో మాటూరి శ్రీకాంత్, గోగుల సందీప్, రూపావత్ శంకర్, రామావత్ అజయ్, బొమ్ము ఆంజనేయులు సహా మరికొందరు అక్టోబరు 18న సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. దీనిపై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం అన్ని వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

మెరుగవుతున్న శ్రీతేజ ఆరోగ్యం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 ప్రీమియర్ షో రోజు సంధ్య సినిమా హాలు వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడి.. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ ఆరోగ్య పరిస్థితిలో క్రమంగా మెరుగుదల కనిపిస్తోందని వైద్యులు తెలిపారు. శ్రీతేజ పూర్తిసాయిలో స్పృహలోకి రాలేదని ఇంకా వెంటిలేటర్‌పైనే చికిత్స అందిస్తున్నామని వారు చెప్పారు. ట్యూబ్ ద్వారా ఇచ్చే ఆహారం తీసుకుంటున్నాడని, అప్పుడప్పుడు జ్వరం వస్తోందని తెలిపారు. శరీరం ఎడమ వైపుతో పోల్చుకుంటే కుడివైపు స్పర్శ తక్కువగా ఉందని, ఇప్పటికిప్పుడు స్పృహలోకి పూర్తిగా వచ్చే సంకేతాలు కనిపించడం లేదని చెప్పారు.

భర్త పెన్షన్ డబ్బులు భార్యకు ఇవ్వడానికి లంచం

- ఏసీబీకి చిక్కిన ఖమ్మం ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే చనిపోయిన విశ్రాంత ఉద్యోగికి సంబంధించిన పెన్షన్ డబ్బులను ఆయన భార్యకు ఇప్పించేందుకు రూ.40వేలు లంచం అడిగిన సీనియర్ అకౌంటెంట్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఖమ్మం జిల్లా సుబ్లేడు పీహెచ్‌సీలో అటెండర్‌గా ఉద్యోగ విరమణ చేసిన మల్లయ్య ఇటీవల మరణించాడు. మల్లయ్య పెన్షన్ డబ్బులు రూ.4లక్షలు ఆయన భార్యకు రావాల్సి ఉంది. అయితే, ఆ సొమ్మును ఇప్పించేందుకు తనకు రూ.40వేలు ఇవ్వాలని ఖమ్మం కలెక్టరేట్‌లోని ట్రెజరీ విభాగంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న కట్టా నగేశ్ డిమాండ్ చేశాడు. దీంతో ఆమె ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. సోమవారం బాధిత మహిళ డబ్బులు ఇస్తుండగా నగేశ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

కంటేనే పిల్లలని అంటే ఎలా?



చట్టబద్ధంగా దత్తత తీసుకోలేదంటూ తొమ్మిది మంది పిల్లలను తల్లిదండ్రులకు దూరం చేసిన అధికారులు

- ఆరు నెలలుగా శిశువిహార్‌లోనే ఉంటున్న చిన్నారులు
- బిడ్డల కోసం పెంపుడు తల్లిదండ్రుల న్యాయపోరాటం
- మనోవేదనకు గురై గుండెపోటుతో ఒక తండ్రి మృతి
- కాళ్లావేళ్లాపడి వేడుకున్నా బిడ్డల్ని చూడనివ్వని వైనం
- దత్తత తీసుకుంటామన్నా కుదరదంటున్న అధికారులు
- చట్ట ప్రకారమే వ్యవహరిస్తామని కోర్టుకు నివేదిక?

నవమాసాలు మోసి కనలేదుగానీ.. పొత్తిళ్లలోని పసికందులను తెచ్చుకుని సొంతబిడ్డల్లా గుండెలకు హత్తుకున్నారు వారు! కడుపున పుట్టకపోయినా.. కడుపులో పెట్టుకొని పెంచి, పెద్దచేసి ప్రయోజకులను చేయాలని కలలుగన్నారు. కానీ.. వారి కలలకు చట్టాలు అడ్డుగా మారాయి. చట్టబద్ధంగా దత్తత తీసుకోలేదన్న కారణంతో.. అధికారులు వారి నుంచి ఆ పిల్లలను స్వాధీనం చేసుకున్నారు! అప్పటికే ఆ పిల్లల ముద్దు చేష్టలకు.. అలవాటుపడ్డ ఆ తల్లిదండ్రులు ఈ అనూహ్య పరిణామంతో తల్లడిల్లిపోయారు! వారిని దత్తత తీసుకునే అవకాశం కల్పించాలని కోరుతూ న్యాయపోరాటానికి దిగారు! మానవీయ కోణం లేని చట్టాల కారణంగా బిడ్డలకు దూరమై విలపిస్తున్న తొమ్మిది జంటల వ్యథ ఇది!!

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని బాపట్ల జిల్లాకు చెందిన ఒక జంట.. పెళ్లయి ఏళ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టకపోవడంతో.. తెలిసినవాళ్ల ద్వారా 20 రోజుల పాపను తెచ్చుకొని పెంచుకోవడం ప్రారంభించారు! దివ్యాంగురాలైన ఆ పాపను అల్లారుముద్దుగా సాకుతున్నారు. ఊరంతా పిలిచి అన్నప్రాసన, పుట్టినరోజు వేడుకలు చేశారు. కానీ.. ఉన్నట్టుండి ఒక రోజు పోలీసులు వారికి ఫోన్ చేసి.. 'మీ పాపను చట్టబద్ధంగా దత్తత తీసుకోలేదు కనుక వెంటనే స్టేషన్‌కు రండి' అని పిలిచారు. వెళ్లగానే వారి వద్ద నుంచి పాపను తీసేసుకుని అధికారులకు అప్పగించారు. ప్రస్తుతం ఆ చిన్నారి శిశువిహార్‌లో ఉంటోంది. పాప కన్నవాళ్లు ఎవరో తెలియదు గనక.. ఆ చిన్నారిని తమకే అప్పగించాలని, చట్టప్రకారం దత్తత కూడా తీసుకుంటామని ఆరు నెలలుగా ఆ దంపతులు న్యాయపోరాటం చేస్తున్నారు. అయితే.. పాపే ప్రాణంగా బతుకుతున్న ఆ తండ్రి కూతుర్ని చూడకుండా ఎక్కువ రోజులు ఉండలేకపోయాడు. ఒక్కసారైనా, బిడ్డను చూపించండంటూ అధికారులను ప్రాధేయపడ్డాడు. కుదరదు పొమ్మని వారు తేల్చిచెప్పడంతో.. ఆ తండ్రి గుండె పగిలింది! దూరమైన బిడ్డను తల్చుకుని తల్చుకుని మనోవేదనకు గురై.. చిన్నవయసులోనే గుండెపోటుతో కన్నుమూశాడు. అయినా అధికారులు కరగట్లేదు.

"మీకు పిల్లలు పుట్టే అవకాశం లేదు" అని వైద్యులు తేల్చిచెప్పడంతో.. రెండు రోజుల పసిబిడ్డను నాలుగేళ్ల కిందట అనధికారికంగా దత్తత తీసుకున్న జంటది మరో వ్యధ! బాగా కలిగిన కుటుంబం కావడంతో.. ఆ పాపను అల్లారుముద్దుగా పెంచుకుంటూ, లక్షల రూపాయల విలువైన బంగారు నగలు కూడా చేయించారు. మంచిపేరున్న ప్లే స్కూల్లో చేర్పించారు. అమ్మాయి భవిష్యత్తుకు అందమైన ప్రణాళికలు రచించారు. కానీ.. అధికారికంగా దత్తత తీసుకోలేదన్న కారణంతో అధికారులు ఆ పాపను శిశువిహార్‌కు తరలించడంతో వారి కలలన్నీ కల్లలయ్యాయి. బిడ్డ కోసం వారూ కోర్టుమెట్లెక్కారు. తీవ్ర అనారోగ్యంతో తమ చేతుల్లోకి వచ్చిన పసికందును ఎంతలా కంటికిరెప్పలా కాపాడుకున్నదీ.. కోర్టుకు వివరంగా విన్నవించుకున్నారు. పాపకు వివిధ ఆస్పత్రుల్లో చేయించిన చికిత్సలకు సంబంధించి.. 300 పేజీలకు పైగా రిపోర్టులు సమర్పించారు. తమ బిడ్డ దత్తతను చట్టబద్ధం చేయాలని వేడుకుంటున్నారు.

సంతానం లేని మరొక జంట.. తెలిసినవారి ద్వారా నాలుగేళ్ల క్రితం ఒక చంటిబిడ్డను తెచ్చుకున్నారు. కన్నవారెవరో తెలియని ఆ బాలుడిని తమ కొడుకుగా ప్రపంచానికి పరిచయం చేశారు. రెండేళ్ల క్రితం ఆ దంపతులు ఉద్యోగరీత్యా బాబుతో సహా విదేశాలకు వెళ్లారు. అక్కడే బాబును బాగా చదివించి, ప్రయోజకుడిని చేయాలని కలలుగన్నారు. కానీ.. మే నెలాఖరులో వారి ఆనందమంతా ఒక్కసారిగా ఆవిరైంది. పోలీసుల ఆదేశాల మేరకు హైదరాబాద్ వచ్చి బాబును సంబంధిత అధికారులకు అప్పగించారు. ఆనాటి నుంచి ఉద్యోగానికి దీర్ఘకాలపు సెలవు పెట్టి బాబు కోసం ఇండియాలోనే ఉండిపోయారు. శిశువిహార్‌లో ఉన్న తమ బిడ్డను తమకు అప్పగించాలని కోర్టును కోరుతున్నారు.



..ఇలా అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డలకు చట్టాల కారణంగా దూరమైన తొమ్మిది జంటల్లో ఒక్కో జంటదీ ఒక్కో వ్యధ! వారికి కలిగిన ఈ శోకానికి మూలం.. ఆర్నెల్ల క్రితం పోలీసులు ఛేదించిన ఒక కేసులో ఉంది. ఆ కథేంటంటే.. ఢిల్లీ, పూణె తదితర ప్రాంతాల నుంచి పొత్తిళ్లలోని పసిబిడ్డలను అక్రమంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు తీసుకొచ్చి అమ్ముతున్న అంతరాష్ట్ర ముఠాను రాచకొండ, మేడిపల్లి పోలీసులు కొన్నినెలల క్రితం పట్టుకున్నారు. పీర్జాదీగూడకు చెందిన ఒక సంతాన సాఫల్య కేంద్రం నిర్వాహకురాలు వారితో చేతులు కలిపి.. ఆ పిల్లలను సంతానం లేనివారికి విక్రయిస్తున్నట్టు గుర్తించి ఆమెను, మరికొందరిని అరెస్టు చేశారు. వారి నుంచి రాబట్టినసమాచారం మేరకు 13మంది పిల్లలు ఎక్కడ ఉంటున్నారో గుర్తించి.. వారందరినీ వారి తల్లిదండ్రుల నుంచి మే 28న స్వాధీనం చేసుకున్నారు. అప్పట్నుంచీ ఆ పిల్లలు హైదరాబాద్‌లోని శిశువిహార్‌లోనే ఉంటున్నారు. పెంపుడు తల్లిదండ్రులు వారిని తెచ్చి పెంటుకుంటున్నారు తప్ప.. నిబంధనల ప్రకారం అధికారికంగా దత్తత తీసుకోకపోవడమే అందుకు కారణం. అందులో నాలుగు జంటలు కేసులు, కోర్టులకు భయపడి తమకు పిల్లలు అక్కర్లేదని మౌనంగా ఉండిపోయాయి. మిగతా తొమ్మిది జంటలూ బిడ్డల కోసం న్యాయపోరాటాన్ని ప్రారంభించాయి. "కన్నవారెవరో తెలియని పిల్లలను సొంతబిడ్డలకన్నా మిన్నగా పెంచుకుంటున్నాం. మా బిడ్డలను వదిలి బతకలేం. వారిని మాకే అప్పగించండి. చట్టప్రకారం వారిని దత్తత ఇస్తామంటే.. వేరెవరికో ఎందుకు? ఆ అవకాశం మాకే కల్పించండి" అని కోరుతూ వారు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం... జువెనైల్ జస్టిస్ చట్టంలోని సెక్షన్ 37 ప్రకారం ఈ కేసును విచారించి, తుది నిర్ణయాన్ని రెండువారాల్లో తెలియజేయాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ)ని ఆదేశించింది. వారు తమ నిర్ణయాన్ని ఇప్పటికే నివేదిక రూపంలో సమర్పించినట్లు తెలుస్తోంది. దీంతో పాటు.. ఆ పిల్లల పెంపుడు తల్లిదండ్రులు చట్ట ప్రకారం సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీకి (కారా) చేసుకున్న దరఖాస్తులనూ పరిశీలించి, నాలుగు వారాల్లోగా నిర్ణయం వెల్లడించాలని కారాను న్యాయస్థానం ఆదేశించింది. అయితే.. అధికారులు మాత్రం చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకోని ఈ తొమ్మిది జంటలకూ బిడ్డలను ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. వారు తమ పట్ల మానవతా దృక్పథంతో స్పందిస్తారన్న నమ్మకం లేదని ఒక చిన్నారి తండ్రి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోర్టు ద్వారానే తమకు న్యాయం దక్కుతుందన్న ఆశతో రోజులు వెళ్లదీస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తమ ఆస్తిపాస్తులన్నింటినీ పిల్లల పేరు మీద రాయడానికి కూడా సిద్ధమేనని పలువురు చెబుతున్నారు. "ప్రతి నెలా పిల్లలను ప్రభుత్వ అధికారుల ముందు హాజరుపరచడం లాంటి నిబంధనలు విధించినా, వాటన్నింటిని ఆనందంగా అంగీకరిస్తాం. కానీ బిడ్డలను మాత్రం మా నుంచి దూరం చేయద్దు" అని కోరుతున్నారు. ఒకవేళ కన్నవారెవరైనా వస్తే, వారికి పిల్లలను అప్పగించడానికి తమకేమీ అభ్యంతరం లేదని అంటున్నారు. అంతేతప్ప, తాము ఉండగా పిల్లలు అనాథ ఆశ్రమంలో పెరగడాన్ని మాత్రం భరించలేకపోతున్నామని వారంతా రోదిస్తున్నారు.

ఓ తండ్రి ఆవేదన

"పదేళ్లు పిల్లలకోసం ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఒక సంతాన సాఫల్యకేంద్రం వాళ్లు ఫోన్ చేసి.. 'మూడవ కాన్పులోనూ ఆడపిల్ల పుట్టడంతో.. కన్నవాళ్లు వదిలేసి వెళ్లారు. ఆ పాపను మీరు పెంచుకుంటారా?' అని అడిగితే, తెచ్చుకుని మహాలక్ష్మిలా సాకడం మొదలుపెట్టాం. తొమ్మిదినెలలు మోసి కనలేదన్న మాటేగానీ, నా భార్య పాపను విడిచి ఒక్క క్షణం కూడా ఉండలేనంతగా ప్రేమను పెంచుకుంది. అలాంటిది, చట్టబద్ధంగా దత్తత తీసుకోలేదంటూ అధికారులు మా చిట్టితల్లిని మాకు దూరం చేస్తే, తట్టుకోలేకపోతున్నాం. కడుపునిండా తిని, కంటినిండా నిద్రపోయి ఆరునెలలవుతోంది. పాప దూరమైన నాటి నుంచి నా భార్య డిప్రెషన్‌లోకి వెళ్లింది. కన్నవారెవరో తెలియని ఆ బిడ్డను మా నుంచి దూరం చేయడం సరైనదేనా?"

- శిశువిహార్‌లో ఉన్న పిల్లల్లో ఒక పాప తండ్రి

కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు

'ఇవాళ నా బిడ్డ పుట్టినరోజు. కొత్తగౌను తొడిగి, గుండెలకు హత్తుకోవాలి' అనే ఆశతో నల్గొండ జిల్లా నుంచి హైదరాబాద్‌లోని శిశువిహార్‌కు వచ్చిన ఓ తల్లికి గేటు దగ్గరే నిరాశ ఎదురైంది. 'మా అమ్మాయిని ఒక్కసారి చూపించండి' అని ఆ తల్లి అధికారుల కాళ్లావేళ్లాపడ్డా లాభంలేకపోయింది. చివరికి, తాను తెచ్చిన గౌను తీసుకెళ్లి అమ్మాయికి తొడగాలని.. కంటికీ మంటికీ ఏకధారగా విలపిస్తూ వేడుకున్నా అక్కడున్న భద్రతా సిబ్బంది గుండెలు కరగలేదు.

వారికే దత్తత ఇస్తే తప్పేంటి?

పిల్లలను కన్నవారి ఆచూకీ తెలియనప్పుడు.. వారిని పెంచుకున్న తల్లిదండ్రులకే దత్తత ఇస్తే తప్పేమిటని.. పలువురు బాలల హక్కుల ఉద్యమకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. డబ్బుచెల్లించి పిల్లలను సొంతం చేసుకోవడం చట్టరీత్యానేరమని.. ఆ నేరం చేసిన వారికి మానవతాదృక్పథం పేరుతో తిరిగి చిన్నారులను అప్పగిస్తే, అలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను సమర్థించడమే అవుతుంది కదా అన్నది మరి కొందరి వాదన. ఆ పిల్లల్లో నలుగురు.. తమ పెంపుడు తల్లిదండ్రులను గుర్తించే స్థాయిలో ఉన్నారు. ఇన్నాళ్లూ తమ తల్లిదండ్రులుగా భావించిన వారు నిజమైన పేరెంట్స్ కాదని తెలిస్తే వారి మనసులు ఎంత గాయపడతాయో అర్థం చేసుకోవాలని సైకాలజిస్టులు సూచిస్తున్నారు.

నవ్య | చిత్రజ్యోతి

మంచు కుటుంబంలో మంటలు

- ఊహించని మలుపులు, నిమిషానికో పరిణామం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మనోజ్
- చిన్న కొడుకు నుంచి రక్షణ కల్పించాలని సీపీని అభ్యర్థించిన మోహన్‌బాబు





మంచు కుటుంబంలో అగ్గి రాజుకుంది. సోమవారం అది ఊహించని మలుపులు తిరిగి పెద్ద మంటలా మారింది. మోహన్‌బాబు, ఆయన తనయుడు మనోజ్ .. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ పోలీస్ స్టేషన్ కు వెళ్లడంతో వివాదం మరింత ముదిరింది. ఆస్తుల పంపకాల విషయంలో మోహన్‌బాబుకు, ఆయన చిన్న కొడుకు మనోజ్‌కు మధ్య గొడవ జరిగినట్లు, ఇద్దరూ కొట్టుకున్నట్లు ఆదివారం మీడియా వర్గాల్లో వార్తలు హల్‌చల్ చేశాయి. అదంతా నిజం కాదని, అబద్ధపు వార్తలు ప్రచారం చేయొద్దని మోహన్‌బాబు ట్విటర్‌లో ప్రకటించిన కొన్ని గంటలకే బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఎంఎల్‌సీ (మెడికల్ లీగల్ సర్టిఫికెట్) చేయించిన మనోజ్ ఆ మెడికల్ రిపోర్టులతో సహా.. వెళ్లి పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, ఆదివారం పది మంది గుర్తుతెలియని వ్యక్తులు తమ ఇంటికి (జల్‌పల్లిలోని మోహన్‌బాబు నివాసం) వచ్చి గట్టిగా అరుస్తూ భయభ్రాంతులకు గురిచేశారని, వారిని అడ్డుకునే సమయంలో తన దాడి చేశారనీ, ఇంటి ఆవరణలోని సీసీటీవీ ఫుటేజీలు ఎత్తుకెళ్లారని, దుండగులను పట్టుకొని చట్ట ప్రకారం శిక్షించాలని మనోజ్ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

మనోజ్, మౌనికపై సీపీకి ఫిర్యాదు చేసిన మోహన్‌బాబు

ఇదిలా ఉంటే తన కొడుకు మనోజ్, ఆయన భార్య మౌనిక, వారి అనుచరుల ద్వారా తనకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని రాచకొండ సీపీకి మోహన్‌బాబు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీపీకి రాసిన లేఖను మోహన్‌బాబు మీడియాకు విడుదల చేశారు. కొంతమంది సంఘ విద్రోహ శక్తులతో కలిసి తన ఇంటిని, ఆస్తులను లాక్కోవాలని చూస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. తన కొడుకు మనోజ్, కోడలు మౌనిక ప్లాన్ ప్రకారమే ఇదంతా జరుగుతున్నట్లు నమ్ముతున్నానని వెల్లడించారు. తను 78 ఏళ్ల సీనియర్ సిటిజన్‌ననీ, తనకు రక్షణ కల్పించాలని అభ్యర్థిస్తున్నట్లు సీపీకి రాసిన లేఖలో మోహన్‌బాబు పేర్కొన్నారు. తన తండ్రి, అన్న విష్ణు అనుచరులు తనపై దాడిచేశారని మనోజ్ పోలీసు స్టేషన్‌కు వెళ్లడం, మనోజ్ దంపతులు వల్లనే తనకు ప్రాణహాని ఉందని మోహన్‌బాబు సీపీకి లేఖ రాయడం.. వంటి ఊహించని మలుపులతో కథ క్లైమాక్స్‌కు చేరింది. అసలు మోహన్ బాబు ఇంట్లో ఏం జరుగుతోందని అటు సినీ అభిమానుల్లో, ఇటు ఇండస్ట్రీలో తీవ్ర చర్చ జరుగుతోంది.

బౌన్సర్లతో నిండిపోయిన జల్‌పల్లి నివాసం..


ఆదివారం మనోజ్‌పై తన తండ్రి మోహన్‌బాబు, ఆయన అనుచరులతో పాటు.. మంచు విష్ణు ప్రధాన అనుచరుడు, మోహన్‌బాబు స్కూళ్ల పర్యవేక్షకుడు వినయ్ సహా.. కొంతమంది బౌన్సర్లు మనోజ్, ఆయన భార్య మౌనికపై దాడి చేసి గాయపరిచినట్లు తెలిసింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న మనోజ్ దంపతులు తమకు రక్షణగా సుమారు 40 మంది బౌన్సర్లను రంగంలోకి దింపినట్లు తెలిసింది. అంతేకాకుండా రాయలసీమ నుంచి భూమా అనుచరులు, కొంతమంది మహిళా బౌన్సర్లు మనోజ్ దంపతులకు రక్షణగా వచ్చినట్లు తెలిసింది. అలాగే మంచు విష్ణు కూడా తన తండ్రి మోహన్‌బాబుకి రక్షణగా పెద్ద సంఖ్యలో బౌన్సర్లను ఏర్పాటు చేశారు. దాంతో జల్‌పల్లి నివాసం బౌన్సర్ల మయంగా మారిపోయింది.

అక్క మాట వినని మనోజ్

ముంబైలో ఉంటున్న మంచు లక్ష్మి ఈ వివాదం గురించి తెలుసుకుని సోమవారం ఉదయం జల్‌పల్లిలోని ఇంటికి వచ్చారు.. తమ్ముడికి నచ్చజెప్పడానికి ఆమె ప్రయత్నించినట్లు సమాచారం. అయితే మనోజ్ తన మాట వినక పోవడంతో చేసేదేమీ లేక మంచు లక్ష్మి వెనుదిరిగి ముంబై వెళ్లిపోయినట్లు తెలిసింది. ఆమె వెళ్లిన కాసేపటికి మోహన్‌బాబు కూడా ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఇలా తండ్రీకొడుకుల మధ్య వివాదం రాను రాను ముదురు తుండడంతో మోహన్‌బాబు కుటుంబానికి సన్నిహితులు, శ్రేయోభిలాషులు రంగంలోకి దిగి వివాదాన్ని పరిష్కరించడానికి ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. మంగళవారం సమస్యలన్నీ ఓ కొలిక్కి వచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.


- హైదరాబాద్ సిటీ/ పహాడీషరీఫ్ (ఆంధ్రజ్యోతి)

ముఫాసా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా



హాలీవుడ్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'ద లయన్ కింగ్' సినిమాకు కొనసాగింపుగా తెరకెక్కిన చిత్రం 'ముఫాసా: ద లయన్ కింగ్'. బారీ జెంకిన్స్ దర్శకత్వంలో వాల్ట్ డిస్నీ సంస్థ నిర్మించింది. ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సినిమా తెలుగు డబ్బింగ్ వెర్షన్‌లో 'ముఫాసా' పాత్రకు మహేశ్‌బాబు వాయిస్ అందివ్వనున్న సంగతి తెలిసిందే. తాజాగా, ఈ సినిమా కోసం వాయిస్ ఇవ్వడంపై మహేశ్ ఆనందం వ్యక్తం చేశారు. "ముఫాసా' ఇప్పటివరకూ వచ్చిన అత్యంత పాపులర్ పాత్రల్లో ఒకటి. ఈ ప్రాజెక్ట్‌లో భాగమవ్వడం ఎంతో సంతోషాన్నిస్తోంది. ముఫాసా తన కుటుంబాన్ని చూసుకునే విధానం అద్భుతం. ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని చెప్పారు. కాగా, 'లయన్ కింగ్' మొదటి భాగం 1994లో విడుదలై సంచలన విజయం సాధించింది. దీనిని 2019లో మళ్లీ రీమేక్ చేసిన మేకర్స్.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులని ఆకట్టుకున్నారు.

ఆర్ఆర్ఆర్ పై డాక్యుమెంటరీ



రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆర్ఆర్ఆర్' ఆస్కార్‌తో పాటు ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రబృందం ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చింది. 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' పేరుతో ఒక డాక్యుమెంటరీని చిత్రీకరించినట్లు ప్రకటించింది. ఈ నెలలోనే రిలీజ్ చేయనున్న ఈ డాక్యుమెంటరీలో 'ఆర్ఆర్ఆర్' చిత్రం తెరవెనుక ఏం జరిగింది. దీన్ని ఎలా రూపొందించారో చూపిస్తామని చిత్రబృందం పేర్కొంది. 2022లో అల్లూరి సీతారామరాజు, కొమురం భీమ్ ప్రధాన పాత్రలతో రూపొందిన ఈ కల్పిత కథ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అల్లూరి సీతారామరాజు పాత్రలో రామ్‌చరణ్, కొమురం భీమ్ పాత్రలో ఎన్టీఆర్ నటించారు.



రష్మికపై కవిత అల్లిన విజయ్

రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి నటిస్తున్న చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. సోమవారం ఈ సినిమా టీజర్‌ను హీరో విజయ్ దేవరకొండ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఇందులోని ప్రతీ విజువల్ ఆకట్టుకుంటుంది. ప్రతీ ప్రేక్షకుడిని కదిలించేలా సినిమా ఉంటుందని ఆశిస్తున్నా. నటిగా రష్మికను ఓ మెట్టు ఎక్కించే చిత్రమిది. టీమ్ మొత్తానికి ఆల్ ద బెస్ట్" అని చెప్పారు. టీజర్‌లో రష్మిక పాత్రను విజయ్ ఓ అందమైన కవితను చెప్తూ పరిచయం చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది.

రంగాచారి పాత్ర దక్కడం అదృష్టం



రాజేంద్ర ప్రసాద్

మ్యాగీ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న వెబ్ సిరీస్ 'హరికథ'. రాజేంద్రప్రసాద్, శ్రీరామ్, దివి, పూజిత పొన్నాడ, మౌనిక రెడ్డి, అర్జున్ అంబటి, రుచిర సాదినేని, శ్రీయా కొట్టం, ఉప్పశ్రీ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సిరీస్ ఈనెల 13 నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవనుంది. ఈ సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'హరికథ'లాంటి గొప్ప స్క్రిప్ట్ రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఎన్టీఆర్, ఏఎన్నార్ చేయాల్సిన రోల్ నాకు దక్కడం సంతోషంగా ఉంది. హరికథలు చెబుతూ జీవితాంతం హరి నామస్మరణ చేసే రంగాచారి పాత్రలో కనిపిస్తాను' అని చెప్పారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ తెలుగు వెబ్‌సిరీస్‌లలో ఒక స్టాండర్డ్ క్రియేట్ చేసేలా 'హరికథ' ఉంటుంది' అని అన్నారు. దర్శకుడు మ్యాగీ మాట్లాడుతూ' ఈ స్క్రిప్ట్ చాలా వైవిధ్యమైనది. చాలా పెద్ద స్క్రిప్ట్. యూనిట్‌లోని ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి సక్సెస్‌ఫుల్‌గా సిరీస్ మీ ముందుకు వచ్చేలా చేశారు' అని అన్నారు.

సైలెంట్ మ్యాన్ వైలెంట్‌గా మారితే...



చియాన్ విక్రమ్ నటిస్తున్న యాక్షన్ డ్రామా 'వీర ధీర శూరన్:2'. ఎస్‌జే సూర్య, సూరజ్ వెంజరమూడు, దుషార విజయన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్‌యు అరుణ్‌కుమార్ దర్శకత్వంలో రియా శిబు నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన గ్లింప్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. సోమవారం టీజర్‌ను విడుదల చేశారు. ఇందులోని పోరాట సన్నివేశాలు.. విజువల్స్ ఆకట్టుకున్నాయి. కిరాణా కొట్టు నడుపుకొనే ఓ సాధారణ మధ్య తరగతి వ్యక్తి.. ఓ సమస్యలో చిక్కుకుని హఠాత్తుగా వయొలెంట్‌గా మారి విలన్లతో తలపడితే ఎలా ఉంటుందో ఆసక్తికరంగా చూపించారు. వచ్చే ఏడాది జనవరిలో చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: జీకే ప్రసన్న, సినిమాటోగ్రాఫర్: తేని ఈశ్వర్, సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్.

లీగల్ థ్రిల్లర్ సినిమా



రవి గోగుల దర్శకత్వంలో వీర్ రెడ్డి, దయానంద్ రెడ్డి, ఢిల్లీ గణేశన్, గిరిధర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లీగల్లీ వీర్'. ఎం.వీరనారాయణ రెడ్డి సమర్పణలో శాంతమ్మ మలికిరెడ్డి నిర్మించారు. ఈ చిత్రం 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రానికి సంబంధించిన గ్లింప్స్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరో వీర్‌రెడ్డి మాట్లాడుతూ 'మంచి సినిమా చేద్దాం అనుకున్నా. స్వతహాగా లీగల్ లాయర్‌ను కాబట్టి ఈ పాత్రను చేయడం సులభంగా అనిపించింది. ఇంతవరకు మన దగ్గర లీగల్ థ్రిల్లర్ సినిమాలు అంతగా రాలేదు. రియల్ కోర్ట్ డ్రామా ఎలా ఉంటుందో చూపించాలని అనుకున్నాను. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని తెలిపారు.

టాటా మోటార్స్, కియ కార్ల ధరలు పెంపు

న్యూఢిల్లీ: టాటా మోటార్స్, కియ ఇండియా కార్ల ధరలు పెంచుతున్నట్లు ప్రకటించాయి. టాటా మోటార్స్. ఎలక్ట్రిక్ వాహనాలు సహా అన్ని ప్యాసింజర్ కార్ల ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు వెల్లడించగా కియ ఇండియా తన ఉత్పత్తుల ధరలను 2 శాతం మేర పెంచుతున్నట్లు తెలిపింది. పెంచిన ధరలు జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని ఇరు సంస్థలు తెలిపాయి. ముడి సరుకుల ధరలు పెరిగిపోవటంతో కార్ల ధరలు పెంచకతప్పటం లేదని పేర్కొన్నాయి. ఇప్పటికే మారుతి సుజుకీ, హ్యుండయ్, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్, బీఎండబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్, ఆడి ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి.

ఆర్‌బీఐ కొత్త గవర్నర్
సంజయ్ మల్హోత్రా



3 ఏళ్ల కాలానికి నియామకం.. రేపు బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కొత్త గవర్నర్‌గా ప్రస్తుత రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు. అపాయింట్ మెంట్స్ కమిటీ ఆఫ్ కేబినెట్ (ఏసీసీ) ఆయన నియామకానికి సోమవారం ఆమోదం తెలిపింది. ఆర్‌బీఐ 26వ గవర్నర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించనున్న 56 ఏళ్ల మల్హోత్రా.. మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. రాజస్థాన్ కేడర్‌కు చెందిన 1990 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన మల్హోత్రా.. ప్రస్తుత ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్థానాన్ని భర్తీ చేయనున్నారు. ఈ నెల 10తో దాస్ పదవీకాలం ముగియనుంది.

కంప్యూటర్ సైన్స్ ఇంజనీర్.. ఫైనాన్స్, ట్యాక్సేషన్‌లోనూ అపార అనుభవం

ఐఐటీ కాన్పూర్ నుంచి కంప్యూటర్స్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన మల్హోత్రా.. ఆ తర్వాత అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ పట్టా పుచ్చుకున్నారు. ఐఏఎస్ అధికారిగా 33 ఏళ్ల ప్రస్థానంలో ఆయన పవర్, ఫైనాన్స్, ట్యాక్సేషన్, ఐటీ, మైన్స్ సహా పలు శాఖల్లో పనిచేశారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖలోని రెవెన్యూ డిపార్ట్‌మెంట్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతక్రితం ఆర్థిక సేవల విభాగ కార్యదర్శిగానూ పనిచేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల స్థాయిలో ఫైనాన్స్, ట్యాక్సేషన్ విభాగాల్లో ఆయనకు అపార అనుభవం ఉంది. ఏకాభిప్రాయ సాధనలో దిట్ట. కొత్త ఆదాయం పన్ను విధానం అమలులోనూ ఆయన కీలకపాత్ర పోషించారు.

ఆరేళ్లపాటు దాస్ సారథ్యం



ఆర్‌బీఐ 25వ గవర్నర్‌గా 2018 డిసెంబరు 12న బాధ్యతలు స్వీకరించిన శక్తికాంత దాస్ ఆరేళ్ల పదవీకాలం మంగళవారంతో ముగియనుంది. తొలుత మూడేళ్ల కాలానికి గవర్నర్‌గా నియమితులైన దాస్ పదవీకాలాన్ని ప్రభుత్వం మరో మూడేళ్లు పొడిగించింది. మిగులు నిధుల బదిలీకి సంబంధించి ఆర్‌బీఐ, కేంద్రం మధ్య వివాదం నెలకొనడం, అప్పటి గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆకస్మికంగా పదవికి రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. అలాంటి సున్నిత పరిస్థితుల్లో పగ్గాలు చేపట్టిన దాస్.. ఆర్‌బీఐ పట్ల మార్కెట్ వర్గాల్లో విశ్వాసాన్ని తిరిగి నిలబెట్టడంతో పాటు ఆర్‌బీఐ-కేంద్రం మధ్య సంబంధాలను పునరుద్ధరించడంలో సఫలమయ్యారు. అత్యంత గడ్డుకాలమైన కొవిడ్ సంక్షోభంలోనూ దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు అవసరమైన ద్రవ్యపరపతి విధాన చర్యలు చేపట్టిన ఘనత కూడా ఆయనదే. అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మేగజైన్ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో దాస్ రెండు సార్లు టాప్ సెంట్రల్ బ్యాంకర్‌గా నిలిచారు. తమిళనాడు కేడర్‌కు చెందిన 1980 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన దాస్.. ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టకముందు ఆర్థిక సేవల కార్యదర్శిగానూ పనిచేశారు. జీఎస్‌టీ, పెద్ద నోట్ల రద్దు అమలు సమయంలోనూ కీలక పాత్ర పోషించారు.

శ్రీసిటీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ప్లాంట్

- రూ.7,000 కోట్ల పెట్టుబడి
- 300 ఎకరాలు కేటాయించాలని ఏపీ ప్రభుత్వానికి వినతి
- నేరుగా 1,500 మందికి ఉద్యోగాలు !



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో మరో బహుళ జాతి సంస్థ (ఎంఎన్‌సీ) కొలువు తీరనుంది. దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల దిగ్గజం ఎల్‌జీ గ్రూప్ అనుబంధ సంస్థ 'ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా' శ్రీసిటీ లేదా దానికి సమీపంలో ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. రూ.15,000 కోట్ల పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) కోసం సెబీకి సమర్పించిన ముసాయిదా పత్రం (డీఆర్‌హెచ్‌పీ)లో కంపెనీ ఈ విషయం తెలిపింది. ఈ ప్లాంట్ ఏర్పాటు కోసం 300 ఎకరాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్టు సమాచారం. ఈ ప్రాజెక్టు కోసం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా రూ.7,000 కోట్ల వరకు ఖర్చు చేయనుంది. ఇందులో రూ.5,000 కోట్లు కంపెనీ నేరుగా పెట్టుబడి పెడుతుంది. మిగతా రూ.2,000 కోట్ల పెట్టుబడులు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్‌కు విడిభాగాలు సరఫరా చేసే కంపెనీల నుంచి వస్తాయి. ఈ ప్రాజెక్టు అమలుకు నోచుకుంటే నేరుగా 1,500 మందికి ఉద్యోగావకాశాలు ఏర్పడతాయని అంచనా.

ఎందుకంటే?

ఎజీ ఎలక్ట్రానిక్స్ ఇండియాకు ఇప్పటికే వివిధ గృహోపకరణాల ఉత్పత్తి కోసం ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా, మహారాష్ట్రలోని పుణెల్లో రెండు ఉత్పత్తి యూనిట్లు ఉన్నాయి. ఈ ప్లాంట్ల స్థాపిత సామర్థ్యం 1,39,90,000 యూనిట్లుగా ఉంది. దక్షిణ భారత మార్కెట్ కోసం ఈ రెండు ప్లాంట్ల నుంచే ఉత్పత్తిని తరలించాల్సి వస్తోంది. ఇందుకు రవాణా ఖర్చులతో పాటు వివిధ సరఫరా సమస్యలు ఎదురవుతున్నాయి. శ్రీసిటీలో కొత్త ప్లాంటు ఏర్పాటు ద్వారా ఈ సమస్యలను అధిగమించాలని కంపెనీ భావిస్తోంది. దీనికి తోడు ఈ ప్లాంటులో ఉత్పత్తి చేసే ఏసీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, టీవీలను కంపెనీ ఇతర దేశాలకూ ఎగుమతి చేయాలని యోచిస్తోంది. ఈ పెట్టుబడి అమలుకు నోచుకుంటే ఒక కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ మన దేశంలో ఇంత పెద్ద మొత్తం పెట్టుబడి పెట్టడం ఇదే మొదటిసారి అవుతుంది. శ్రీసిటీలో ఇప్పటికే బ్లూస్టార్, డైకిన్, హావెల్ వంటి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు కొలువు తీరాయి. కాగా ఏపీలో ఏర్పాటు చేయనున్న ప్లాంట్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి విధానం కింద ఆర్థికపరమైన ప్రోత్సాహకాలు పొందేందుకు ఆమోదం లభించింది.

రూపాయి ధమాల్

ఒకే రోజు 20 పైసలు పతనం

సరికొత్త రికార్డు కనిష్ఠ స్థాయి .. రూ.84.86కు ఎక్స్ఛేంజ్ రేటు

ముంబై: భారత కరెన్సీ విలువ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి క్షీణించింది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం 20 పైసలు నష్టపోయి 84.86 వద్ద ముగిసింది. గడిచిన నెల రోజులకు పైగా కాలంలో (నవంబరు 6 తర్వాత) రూపాయికిదే అతిపెద్ద ఒక్కరోజు పతనం. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల, ఈక్విటీ మార్కెట్లో నష్టాలు ఇందుకు ప్రధాన కారణమయ్యాయి. దిగుమతిదారులు, విదేశీ బ్యాంకుల నుంచి డాలర్‌కు డిమాండ్ నెలకొనడంతో రూపాయి మరికొద్ది రోజులు బలహీనంగానే ఉండనుందని ఫారెక్స్ వర్గాలు అభిప్రాయపడ్డాయి. కాగా, అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 0.89 శాతం పెరిగి 71.75 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

సెన్సెక్స్ 200 పాయింట్లు డౌన్

ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనైన ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన మిశ్రమ సంకేతాలు, రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఎఫ్‌ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు నష్టాలకు కారణమయ్యాయి. సెన్సెక్స్ 200.66 పాయింట్లు కోల్పోయి 81,508.46 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 58.80 పాయింట్ల నష్టంతో 24,619 వద్ద స్థిరపడింది.

కాగా ఇంటర్నేషనల్ జెమ్మోలాజికల్ ఇన్‌స్టిట్యూట్ (ఇండియా) లిమిటెడ్ ఐపీఓ ఈ నెల 13న ప్రారంభమై 17న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని రూ.397-417గా నిర్ణయించింది. అలాగే ఇన్వెంచురస్ నాలెడ్జ్ సొల్యూషన్స్ ఐపీఓ ఈ నెల 12న ప్రారంభమై 16న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని రూ.1,265-1,329గా కంపెనీ నిర్ణయించింది.

12-13 తేదీల్లో టీజీ-ప్యాకాన్ సదస్సు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఈ నెల 12-13 తేదీల్లో హైదరాబాద్ మరో జాతీయ సదస్సుకు వేదికవుతోంది. సీఐఐ (తెలంగాణ చాప్టర్) ఏర్పాటు చేసే ఈ రెండు రోజుల సదస్సుకు దేశ, విదేశాలకు చెందిన 250 మంది ప్రతినిధులు హాజరవుతారని సీఐఐ టీజీ ప్యాకాన్ సదస్సు చైర్మన్ ఏవీపీఎస్ చక్రవర్తి చెప్పారు. తొలి రోజు సదస్సులో ప్యాకేజింగ్ రంగంలో నవ కల్పనలు, అభివృద్ధి మీద, రెండో రోజు ప్యాకేజింగ్ రంగంలో సుస్థిర అభివృద్ధి గురించి చర్చ జరుగుతుందన్నారు. పరిశ్రమ తాజా పరిమాణాలపై 50 నుంచి 60 మంది సీఈఓలతో రౌండ్ టేబుల్ చర్చ కూడా ఉంటుందన్నారు.

మరో 100 ఎయిర్‌బస్ విమానాలకు ఆర్డర్

ఎయిర్ ఇండియా

ముంబై: టాటా గ్రూప్ గూటికి చేరిన ఎయిర్ ఇండియా పెద్దఎత్తున విస్తరణ చేపట్టింది. ఇందులో భాగంగా ఎయిర్‌బస్ నుంచి మరో 100 విమానాలు కొనుగోలు చేసేందుకు ఆర్డర్ పెట్టింది. గత ఏడాది పెట్టిన 250 విమానాల ఆర్డర్‌కు ఇది అదనం. ఈ వంద విమానాల్లో 10 వైడ్ బాడీ ఏ350 విమానాలు, మిగతా 90 న్యారో బాడీ ఏ320 రకం విమానాలని తెలిపింది.

ఏఎంజీ అమ్మోనియాకు జెంటారి విద్యుత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మలేషియా ప్రభుత్వ నిర్వహణలోని పెట్రోనాస్ గ్రూప్ అనుబంధ సంస్థ జెంటారి- ఏఎం గ్రీన్ అమ్మోనియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎంజీ అమ్మోనియా) మధ్య ఒక దీర్ఘకాలిక విద్యుత్ సరఫరా ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం జెంటారి అనుబంధ సంస్థ జెంటారి రెన్యువబుల్స్ ఇండియా కాస్టర్ వన్ ప్రైవేట్ లిమిటెడ్, ఏఎంజీ అమ్మోనియా ఏర్పాటు చేసే గ్రీన్ అమ్మోనియా ప్లాంట్లకు నిరంతరం 650 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేస్తుంది. ఇందుకోసం జెంటారి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో 2,400 మెగావాట్లు ఉత్పత్తి సామర్థ్యం ఉన్న పవన, సౌర విద్యుదుత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. వీటిని 350 మెగావాట్లు/2,100 మెగావాట్ల ఇంధన స్టోరేజీ ప్లాంట్లతో అనుసంధానం చేసి ఏఎంజీ అమ్మోనియా ప్లాంట్లకు సరఫరా చేస్తారు. ఏఎం గ్రీన్ అమ్మోనియా 2030 నాటికి ఏటా 50 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న గ్రీన్ అమ్మోనియా ప్లాంట్లను ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ సహా దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసి యూరోపియన్ యూనియన్ (ఈయూ) దేశాలకు ఎగుమతి చేస్తుంది.

రెండున్నర నెలల్లో 800 కోట్ల స్పామ్ కాల్స్

80 కోట్ల స్పామ్ ఎస్‌ఎంఎస్‌లు: భారతీ ఎయిర్‌టెల్

ఢిల్లీలో అత్యధిక స్పామ్ కాల్స్.. ఆ తర్వాత స్థానంలో ఏపీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రైవేట్ టెలికాం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పరిష్కారాల ద్వారా స్పామ్ కాల్స్ మెసేజ్‌లపై యుద్ధం ప్రకటించింది. గడిచిన రెండున్నర నెలల్లో తన నెట్‌వర్క్‌లో 800 కోట్ల స్పామ్ కాల్స్, 80 కోట్ల స్పామ్ ఎస్‌ఎంఎస్‌లను గుర్తించినట్లు ఎయిర్‌టెల్ సోమవారం వెల్లడించింది. తమ ఏఐ ఆధారిత నెట్‌వర్క్‌లో ఆధునిక ఆల్గోరిథమ్స్‌ను ఉపయోగించి రోజుకు దాదాపు 10 లక్షల మంది స్పామర్లను గుర్తించినట్లు సంస్థ తెలిపింది. గత రెండున్నర నెలల్లో నమోదైన మొత్తం కాల్స్‌లో 6 శాతం స్పామ్ కాల్సేనని, మొత్తం ఎస్‌ఎంఎస్‌లలో 2 శాతం స్పామ్ మెసేజ్‌లేనని పేర్కొంది. రెండున్నర నెలల్లో దాదాపు 25.2 కోట్ల మంది కస్టమర్లను సందేహాస్పద కాల్స్‌పై ముందుగా అలర్ట్ చేయడం జరిగిందని, ఈ తరహా కాల్స్‌ను స్వీకరించే కస్టమర్ల సంఖ్య కూడా 12 శాతం మేర తగ్గిందని ఎయిర్‌టెల్ పేర్కొంది. ఢిల్లీలోని కస్టమర్లు అత్యధిక స్పామ్ కాల్స్ అందుకున్నారని తెలిపింది. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ యూపీ ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. అత్యధిక స్పామ్ కాల్స్ చేసిందీ ఢిల్లీ సర్కిల్ నుంచేనని..ముంబై, కర్ణాటక ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయని ఎయిర్‌టెల్ తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,780 ▲	71,300 ▲	1,00,000 ▲
ముంబై	76,692 ▲	70,250 ▲	91,800 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	625
వరంగల్	622	గోదావరి	625
చిత్తూరు	633	విశాఖపట్నం	615
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	104
వరంగల్	100	గుంటూరు	99
కరీంనగర్	100	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	75
కర్నూలు	100	నెల్లూరు	75
విశాఖపట్నం	96	అనంతపురం	75
గోదావరి	104		

స్పోర్ట్స్

షమి అదరగొట్టె..
బెంగాల్ క్వార్టర్స్ చేరె..

బెంగళూరు:. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో భాగంగా చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో మహ్మద్ షమి ఆల్‌రౌండ్ షోతో బెంగాల్ 3 పరుగుల తేడాతో గెలిచి క్వార్టర్‌ఫైనల్ చేరింది. మొదట బెంగాల్ 20 ఓవర్లలో 159/9 స్కోరు చేసింది. 114 పరుగులకే 8 వికెట్లు కోల్పోయిన దశలో పదో నెంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన షమి 17 బంతులు ఎదుర్కొని 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 రన్స్ బాది అజేయంగా నిలిచాడు. ఛేదనలో చండీగఢ్ 20 ఓవర్లలో 156/9 స్కోరుకే పరిమితమై ఓటమిపాలైంది. 139 కి.మీ వేగంతో బౌలింగ్ చేసి ఓ వికెట్ పడగొట్టిన షమి.. 4 ఓవర్లలో 13 డాట్ బాల్స్ వేయడం విశేషం.

ఆంధ్ర పోరు ముగిసింది

యూపీ చేతిలో ఓటమి

బెంగళూరు: సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఆంధ్ర జట్టు కథ ముగిసింది. సోమవారం ఇక్కడ జరిగిన ప్రీ క్వార్టర్‌ఫైనల్ పోరులో నాలుగు వికెట్ల తేడాతో ఉత్తరప్రదేశ్ చేతిలో పరాజయం పాలైంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 156 పరుగులు చేసింది. ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ (34 నాటౌట్) టాప్ స్కోరర్. కెప్టెన్ రికీ భుయ్ (23), శశికాంత్ (23 నాటౌట్) పర్వాలేదనిపించగా.. ఓపెనర్ భరత్ (4) నిరాశపరిచాడు. యూపీ బౌలర్లలో భువనేశ్వర్, విప్‌రాజ్ నిగమ్ చెరో రెండు వికెట్లు తీశారు. ఛేదనలో కర్ణ్ శర్మ (48), రింకూ సింగ్ (27 నాటౌట్), ఆఖర్లో విప్‌రాజ్ నిగమ్ (8 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 27 నాటౌట్) అదరగొట్టడంతో యూపీ 19 ఓవర్లలో 157/6 స్కోరు చేసి గెలిచింది. ఆంధ్ర బౌలర్లలో సుదర్శన్ (3/22) మూడు, త్రిపురాన విజయ్ (2/21) రెండు వికెట్లు పడగొట్టారు.

చెలరేగిన రూథర్‌ఫర్డ్

తొలి వన్డేలో బంగ్లాపై విండీస్ గెలుపు

సెయింట్ కిట్స్/నేవిస్: బంగ్లాదేశ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో ఆతిథ్య వెస్టిండీస్ శుభారంభం చేసింది. తొలి మ్యాచ్‌లో షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ (80 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్సర్లతో 113) సెంచరీతో చెలరేగడంతో విండీస్ ఐదు వికెట్లతో గెలిచింది. మొదట బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 294 పరుగులు చేసింది. మెహిదీ హసన్ (74), టాంజిద్ (60), మహ్మదుల్లా (50 నాటౌట్) రాణించారు. షెపర్డ్ 3, అల్జారీ జోసెఫ్ 2 వికెట్లు తీశారు. ఛేదనలో రూథర్‌ఫర్డ్ విజృంభణతో పాటు హోప్ (86), గ్రీవ్స్ (41 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడడంతో.. విండీస్ 47.4 ఓవర్లలోనే 295/5 చేసి గెలిచింది.

టైటాన్స్‌కు నిరాశ

పుణె: ప్రొ కబడ్డీ లీగ్‌లో గత మ్యాచ్ విజయంతో వరుస ఓటములకు చెక్ పెట్టిందనుకున్న తెలుగు టైటాన్స్‌కు అంతలోనే నిరాశ ఎదురైంది. సోమవారం హరియాణా స్టీలర్స్‌తో జరిగిన పోరులో టైటాన్స్ 25-46తో చిత్తయింది. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 30-26తో పుణెరి పల్టాన్స్‌పై గెలిచింది.



రోహిత్ ఓపెనర్‌గా రావాలి..

కెప్టెన్‌తో చెడిందా?

అందుకే షమికి బెర్త్ దక్కడం లేదా?

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

భారత పేసర్ మహ్మద్ షమికి.. కెప్టెన్ రోహిత్ శర్మకు మధ్య సంబంధాలు బెడిసి కొట్టాయా? షమి జట్టులోకి రావడం హిట్ మ్యాన్‌కు ఇష్టం లేదా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఓవైపు ఫిట్‌గా లేడని, అతడి గాయం తిరగబెట్టిందని రోహిత్ మీడియాకు వివరణ ఇస్తుండగా.. మరోవైపు షమి మాత్రం మైదానంలో దుమ్ము రేపుతున్నాడు. ఆదివారం అడిలైడ్‌లో ముగిసిన రెండో టెస్టులో పరాజయం పాలైన తర్వాత రోహిత్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...షమి మోకాలు మళ్లీ వాచిందని, గాయాన్ని తాము క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పాడు. గాయం తగ్గకముందే బరిలోకి దింపి షమిని ఒత్తిడిలోకి నెట్టదలచుకోవడం లేదని కూడా రోహిత్ వెల్లడించాడు. కానీ సీన్ కట్ చేస్తే.. సోమవారం సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో చండీగఢ్‌పై షమి ఆల్‌రౌండ్‌షోతో అదరగొట్టాడు. 17 బంతుల్లోనే 32 పరుగులు చేసిన ఈ పేసర్.. అటు బౌలింగ్‌లో 13 డాట్ బాల్స్ వేసి ఓ వికెట్ తీశాడు. మరి.. రోహిత్ చెబుతున్నట్టు షమికి గాయం తిరగబెడితే అతను విశ్రాంతి తీసుకోవాలి. కానీ బరిలోకి దిగి ఇంత మెరుగ్గా ఎలా ఆడగలుగుతున్నాడనే చర్చ ఆరంభమైంది. అందుకే ఇద్దరి మధ్య చెడిందనే కథనాలు వినిపిస్తున్నాయి.

అసలేం జరిగిందంటే..

న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌కు ముందు షమి తాను పూర్తి ఫిట్‌గా ఉన్నట్టు ప్రకటించాడు. అయితే కెప్టెన్ రోహిత్ మాత్రం కివీస్‌తోనే కాకుండా ఆసీస్ పర్యటనకు కూడా షమి అందుబాటులో ఉండడని, అతడి గాయం తిరగబెట్టిందని ప్రకటించాడు. అప్పుడే షమి ఈ విషయంలో సోషల్ మీడియాలోనూ ఖండించాడు. అలాగే షమి ఎన్‌సీఏ పునరావాస శిబిరంలో ఉన్నప్పుడు బెంగళూరులో కివీస్‌తో తొలి టెస్టు జరిగింది. ఈ సమయంలో రోహిత్‌ను షమి కలిశాడట. తన ఫిట్‌నెస్‌పై తప్పుడు ప్రకటనలు ఎందుకు చేస్తున్నావని షమి గట్టిగానే ప్రశ్నించాడని, అప్పుడే ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగిందంటూ మీడియాలో వచ్చిన కథనం సంచలనం సృష్టిస్తోంది.

దేశవాళీల్లో అదరగొడుతున్నా..

మహ్మద్ షమి చివరిసారి భారత జట్టు తరఫున 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ ఆడాడు. మోకాలి గాయంతో అప్పటి నుంచి ఏడాదిపాటు పునరావాస శిబిరంలో ఉండి కోలుకున్నాడు. జాతీయ జట్టులోకి రావాలంటే షమి ముందుగా దేశవాళీల్లో నిరూపించుకోవాల్సి రావడంతో బెంగాల్ తరఫున రంజీ మ్యాచ్ ఆడాడు. దీంతో పాటు రెండు వారాల్లోనే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 8 మ్యాచ్‌లు కూడా ఆడాడు. తద్వారా ఫిట్‌నెస్ నిరూపించుకున్న షమి జాతీయ జట్టులోకి పునరాగమనం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సంకేతాలు పంపినట్టయింది. కానీ అతడికి ఇప్పటివరకు ఎన్‌సీఏ నుంచి అనుమతి లభించలేదు. అది లభించాకే తను ఆసీస్ పర్యటనకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఒకవేళ అన్నీ అనుకూలించి తను ఆస్ట్రేలియా వెళ్తే చివరి రెండు టెస్టుల్లో ఆడే వీలుంటుంది.

గవాస్కర్, రవిశాస్త్రి సూచన

అడిలైడ్: ఆసీస్‌తో రెండో టెస్టులో భారత జట్టు చిత్తుగా ఓడడంతో కెప్టెన్ రోహిత్ శర్మపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఆటగాడిగానే కాకుండా నాయకుడిగానూ విఫలమయ్యాడని మాజీలు ఆరోపిస్తున్నారు. అడిలైడ్ టెస్టులో ఆసీస్‌కు రోహిత్ పూర్తిగా లొంగిపోయినట్టు కనిపించాడని మాజీ కోచ్ రవిశాస్త్రి ఘాటుగా స్పందించాడు. రాబోయే మ్యాచ్‌ల్లో ఓపెనర్‌గా ఆడి పుంజుకోవాలని కోరాడు. 'మైదానంలో రోహిత్‌లో దూకుడు కనిపించలేదు. అతడి బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే ఆసీస్‌కు లొంగిపోయినట్టుగా అర్థమైంది. రోహిత్ ఓపెనర్‌గా రావడం మంచిది. రాహుల్‌ను విడిలార్డర్‌లో ఆడించాలి' అని శాస్త్రి సూచించాడు. మరోవైపు రోహిత్ లేడు కాబట్టే తొలి టెస్టులో రాహుల్ ఓపెనింగ్ చేశాడు, తిరిగి ఆ స్థానంలో కెప్టెన్ ఆడితేనే బావుంటుందని గవాస్కర్ కూడా చెప్పాడు. అయితే గాబాలో ఎరుపు కూకాబుర్రా బంతులను ఎదుర్కొనేందుకు రోహిత్ మిడిలార్డర్‌లో ఆడితేనే మేలంటూ బీసీసీఐకి చెందిన ఓ కోచ్ తెలిపాడు. అప్పటికి బంతి మెరుపు కోల్పోయి సీమ్ తగ్గుతుందని చెప్పాడు.

సిరాజ్‌కు జరిమానా



హెడ్‌కు మందలింపు

దుబాయ్: భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన రెండో టెస్టులో మాటల యుద్ధానికి తెర తీసిన పేసర్ మహ్మద్ సిరాజ్-బ్యాటర్ హెడ్‌పై ఐసీసీ చర్యలకు దిగింది. సహచర ప్లేయర్‌తో అనుచితంగా ప్రవర్తించి.. సిరాజ్ ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించాడని, అందుకే అతడి మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత విధిస్తున్నట్టు పేర్కొంది. అలాగే హెడ్‌ను మందలించినట్టు తెలిపింది. దీంతోపాటు క్రమశిక్షణ ఉల్లంఘన కింద ఇరువురి ఖాతాలో ఒక్కో డీమెరిట్ పాయింట్‌ను కూడా చేర్చింది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ సెంచరీ సాధించిన హెడ్‌ను క్లీన్‌బౌల్డ్ చేసిన సిరాజ్ కోపంతో.. బయటికి వెళ్లిపో అనేలా సైగ చేశాడు. అటు హెడ్ కూడా ఏదో అనడం కనిపించింది. అయితే సిరాజ్ చర్యను పలువురు మాజీలు తప్పుబడుతున్నారు. సెంచరీ చేసిన హెడ్‌ను గౌరవించాల్సింది పోయి దుందుడుకుగా ప్రవర్తించడం సరికాదని గవాస్కర్, శ్రీకాంత్ విమర్శించారు. అలాగే ఆసీస్ మాజీ బ్యాటర్ సైమన్ కటిచ్ కూడా సిరాజ్‌ది మతిలేని చర్యగా పేర్కొన్నాడు. హెడ్ మ్యాచ్ విన్నింగ్ గేమ్ ఆడాడని, అతను అవుటైనప్పుడు భుజం తట్టి మెచ్చుకోవాల్సిందని అన్నాడు.

గుకేష్‌కు ఎదురుదెబ్బ



12వ రౌండ్‌లో పరాజయం

సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్ మరో రెండు రౌండ్లలో ముగుస్తుందనగా భారత యువ జీఎం దొమ్మరాజు గుకేష్‌కు ఎదురుదెబ్బ తగిలింది. సోమవారం ముగిసిన పన్నెండో రౌండ్లో గుకేష్‌పై వరల్డ్ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా) 39 ఎత్తుల్లో గెలుపొందాడు. ఈ మెగా ఫైనల్లో డింగ్ తెల్ల పావులతో విజయం సాధించడం ఇదే తొలిసారి. అంతేకాక 14 రౌండ్ల ఈ సుదీర్ఘ ఫైనల్లో 11 గేమ్‌ల తర్వాత డింగ్ నెగ్గడం విశేషం. ఈ ఫైనల్ మొత్తం పరిశీలిస్తే గుకేష్ పేలవంగా ఆడిన రౌండ్ ఇదే కావడంతో అందుకు తగిన మూల్యం చెల్లించుకున్నాడు. డింగ్ తాజా విజయంతో ఇరువురి స్కోర్లు 6-6తో సమమయ్యాయి. తదుపరి రెండు రౌండ్లలో ఎవరైతే 1.5 పాయింట్లు సాధిస్తారో వారే విజేతగా నిలుస్తారు. ఒకవేళ ఆ రెండు గేమ్‌లు డ్రా అయితే టైబ్రేకర్ ఫలితంతో చాంపియన్‌ను నిర్ణయిస్తారు. మంగళవారం విశ్రాంతి రోజు. బుధ, గురువారాల్లో ఆఖరి రెండు రౌండ్లు జరగనున్నాయి.

జీఎంకు 9 ఏళ్ల బాలుడి షాక్



న్యూఢిల్లీ: అమెరికా గ్రాండ్‌మాస్టర్ రాసెట్ జియాటినోవ్‌కు భారతీయ చెస్ బుడతడు ఆరిత్ కపిల్ షాకిచ్చాడు. సోమవారం జరిగిన కేఐఐటీ ఇంటర్నేషనల్ ఓపెన్ టోర్నమెంట్ ఆఖరిదైన తొమ్మిదో రౌండ్లో 66 ఏళ్ల రాసెట్‌పై తొమ్మిదేళ్ల ఆరిత్ 63వ ఎత్తులో విజయం సాధించాడు. తెల్లపావులతో బరిలోకి దిగిన ఆరిత్ ప్రారంభంలో తడబడినా ఆట సాగేకొద్దీ పట్టు బిగించి గెలుపొందాడు. అత్యంత పిన్న వయస్సులో (9 సంవత్సరాల 2 నెలలు) జీఎంను ఓడించిన భారత చెస్ క్రీడాకారుడిగా ఆరిత్ అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచంలో అయితే భారత మూలాలు గల సింగపూర్ క్రీడాకారుడు అశ్వథ్ కౌశిక్ (8 సంవత్సరాల 6 నెలలు) ఈ జాబితాలో ప్రథమ స్థానంలో ఉండగా, ఆరిత్ మూడో స్థానంలో నిలిచాడు. ఇక, రష్యా జీఎం బోరిస్ సావచెంకో టైటిల్ సాధించాడు.

సఫారీలదే రెండో టెస్టు

2-0తో సిరీస్ కైవసం

గెబెహ: శ్రీలంకతో రెండో టెస్టులోనూ గెలిచిన దక్షిణాఫ్రికా 2-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో సఫారీలు 109 పరుగుల తేడాతో లంకను చిత్తు చేశారు. ఆటకు చివరిరోజైన సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 205/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన లంక 238 రన్స్‌కు ఆలౌటైంది. ఐదు వికెట్లతో కేశవ్ మహరాజ్ (5/76) లంక పతనాన్ని శాసించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 358 రన్స్ చేసిన దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 317కు ఆలౌటైంది. లంక తొలి ఇన్నింగ్స్‌లో 328 రన్స్ చేసింది.

'డబ్ల్యూటీసీ' టాప్‌లోకి దక్షిణాఫ్రికా: దక్షిణాఫ్రికా డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఇప్పటిదాకా రెండో స్థానంలోనున్న సఫారీ జట్టు 63.33 విజయాల శాతంతో టాప్‌నకు చేరుకుంది. భారత్‌పై గులాబీ టెస్టు గెలుపుతో టాప్‌లోకొచ్చిన ఆస్ట్రేలియా (60.71) ఇప్పుడు రెండో స్థానానికి పడిపోయింది. టీమిండియా (57.29) మూడో స్థానంలో, శ్రీలంక (45.45) నాలుగో స్థానంలో ఉన్నాయి.

బ్రాండింగ్‌లో కింగ్..ధోనీ



న్యూఢిల్లీ: నాలుగేళ్ల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటికీ.. మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ క్రేజ్ ఇసుమంతైనా తగ్గలేదు. కార్పొరేట్ ప్రపంచం అతడిని తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉపయోగించుకునేందుకు ఇప్పటికీ క్యూ కడుతోంది. ధోనీ ప్రస్తుతం 42 కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని టాప్‌లో ఉండడమే ఇందుకు నిదర్శనం. ఈ విషయంలో అతను బాలీవుడ్ దిగ్గజాలు అమితాబ్ బచ్చన్ (41 కంపెనీలు), షారుక్ ఖాన్ (34)లను కూడా దాటేశాడు. చెన్నై తరఫున ఐపీఎల్‌లో మాత్రమే ఆడుతున్న 43 ఏళ్ల ధోనీ.. మొత్తం ఆస్తి రూ.1,040 కోట్లుగా సమాచారం.

పంచాయతీరాజ్, పురపాలక, జీహెచ్ఎంసీ చట్టంలో సవరణలు

» వస్తు సేవలు, వేతనాలు, పింఛన్ల చట్టంలోనూ..

» శాసనసభలో ఐదు ఆర్డినెన్స్‌లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శాసనసభ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజు సోమవారం ప్రభుత్వం సభలో ఐదు ఆర్డినెన్స్‌లు ప్రవేశపెట్టింది. ఇందులో పంచాయతీరాజ్ చట్టం, పురపాలక చట్టం, జీహెచ్ఎంసీ చట్టం, వస్తుసేవల(జీఎస్టీ) చట్టం, వేతనాలు పింఛన్ల చట్టంలో సవరణలు ఉన్నాయి. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్యలో రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 51 గ్రామ పంచాయతీలను సంబంధిత పురపాలికల్లో విలీనం చేయడానికి సంబంధించి తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018, తెలంగాణ పురపాలక చట్టం-2019లో సవరణలు చేపట్టారు. అలాగే జీహెచ్ఎంసీ పరిధిలో ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల నిర్వహణ, ఆక్రమణలకు గురవుతున్న జలాశయాలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు సమర్థ పద్ధతులు అమలుచేసేందుకు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు సహాయకంగా ప్రత్యేక ఏజెన్సీ సేవలు అనుమతించడం, జీఎస్టీ చట్టంలో సవరణలు వీటిలో ఉన్నాయి. అలాగే వివిధ రంగాలకు చెందిన నిపుణులను ప్రభుత్వ సలహాదారులుగా నియమించుకునేందుకు తెలంగాణ వేతనాలు, పింఛన్ల చట్టంలో సవరణలు ఉన్నాయి.

రాష్ట్ర ఏర్పాటులో నాది క్రియాశీల పాత్ర

» 2010 జనవరి 5న అఖిలపక్ష భేటీకి కాంగ్రెస్ తరఫున హాజరై రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేశా: ఉత్తమ్



హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడటంలో తనది క్రియాశీలక పాత్ర అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణపై సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. డిసెంబరు 9వ తేదీకి తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందని, 2009, డిసెంబరు 9వ తేదీనే అప్పటి కేంద్ర మంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రకటన చేశారని గుర్తు చేశారు. 2010 జనవరి 5న చిదంబరం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినప్పుడు తెలంగాణ నుంచి కాంగ్రెస్ ప్రతినిధిగా తాను ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను తెలుపుతూ వందల పేజీల నివేదికలను అందజేశానన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం శ్రీకృష్ణ కమిషన్ ఏర్పాటు చేసినప్పుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరాన్ని తెలుపుతూ వినతి పత్రాలు సమర్పించానన్నారు. తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేస్తున్నామని 2013 జూలై 30న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రకటన చేసిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఆవిష్కరించుకుంటున్నందున.. ఇక నుంచి అన్ని జిల్లా కార్యాలయాల్లో ఏటా డిసెంబరు 9న తెలంగాణ చరిత్రను గుర్తు చేస్తూ అధికారికంగా వేడుకలను నిర్వహిస్తామని ఉత్తమ్ చెప్పారు. సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుపై శాసన సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీధర్‌బాబు సీట్లో బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రొటోకాల్ విషయమై బీజేపీ, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. తన నియోజకవర్గంలో ప్రొటోకాల్ పాటించడం లేదని, ఉద్దేశపూర్వకంగానే తనను దూరం పెడుతున్నారని బీజేపీ కామారెడ్డి ఎమ్మెల్యే కె. వెంకటరమణారెడ్డి ఆరోపించారు. సభ ప్రారంభంకాగానే శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు సీట్లో కూర్చొని వినూత్న రీతిలో వెంకటరమణారెడ్డి నిరసన వ్యక్తం చేశారు. జాతీయ గీతం ఆలపిస్తున్న సమయంలో ఆయన శ్రీధర్‌బాబు పక్కనే ఉన్నారు. ఈ సందర్భంగా మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలుగజేసుకొని ఏదైనా సమస్య ఉంటే సభ దృష్టికి తీసుకురావాలని సూచించారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు తప్పకుండా న్యాయం చేస్తామని, స్పీకర్‌తో మాట్లాడతామని తెలిపారు.

పోరాట సంస్కృతికి ప్రతిరూపం 'తెలంగాణ తల్లి'

» టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోరాట సంస్కృతీ వారసత్వానికి ప్రతి రూపంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించడం అభినందనీయమని టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. దేవతామూర్తిగా కాకుండా సాధారణ మాతృమూర్తిగా, వ్యవసాయ కుటుంబ మహిళగా తెలంగాణ తల్లి నిరాడంబర దర్పం ప్రదర్శిస్తున్నట్టుగా ఉందని ఆయన ప్రశంసించారు. మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనపై రాద్ధాంతం తగదని అన్నారు.

మాజీ సర్పంచుల అసెంబ్లీ ముట్టడి భగ్నం!

మంగళ్‌హాట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతున్న సందర్భంగా ముట్టడికి ప్రయత్నించారు. తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలనే ప్రధాన డిమాండ్‌తో మంత్రులను కలిసి వినతి పత్రం అందజేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో సర్పంచ్‌లు.. రవీంద్ర భారతి నుంచి నేరుగా అసెంబ్లీ వైపుకు దూసుకురావడంతో వెంటనే స్పందించిన పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. కొందరిని సొంత ఊర్లలోనే ఇళ్ల వద్ద నిర్బంధించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు సుర్వీ యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. అప్పులు చేసి గ్రామాల అభివృద్ధి చేసిన తమకు బిల్లులు మంజూరు చేయకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. బాధలు చెప్పుకునేందుకు వస్తే అక్రమంగా అరెస్ట్ చేసి తమ గొంతులు నొక్కుతున్నారని మండిపడ్డారు.

ట్రాక్టర్‌పై అసెంబ్లీకి బీజేపీ ఎమ్మెల్యేలు



హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ బీజేపీ ఎమ్మెల్యేలు సోమవారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. తలపాగాలు ధరించి ట్రాక్టర్‌పై అసెంబ్లీకి వచ్చారు. బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్ స్వయంగా ట్రాక్టర్ నడపగా, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్‌బాబు, రామారావు పాటిల్ చెరో పక్క కూర్చున్నారు. ఉదయం 9.30గంటలకు ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి వారు నేరుగా అసెంబ్లీ వద్దకు చేరుకోగా, మెయిన్ గేటు వద్ద సూర్యనారాయణగుప్తా, వెంకటరమణారెడ్డి, రాకేశ్‌రెడ్డిలు వారితో జత కలిశారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ... రుణమాఫీ, రైతుభరోసా వంటి హామీల అమలు చేయకుండా కాంగ్రెస్, మోసం చేసిందని, ఇప్పటికీ లక్షల మంది రైతులకు రుణమాఫీ జరగలేదని ఆరోపించారు. కాగా, ముందు ఎడ్లబళ్లపై అసెంబ్లీకి వెళ్లాలని బీజేపీ ఎమ్మెల్యేలు భావించారు. అయితే, ఎడ్లు బెదిరే అవకాశం ఉన్నందున ట్రాక్టర్‌పై వచ్చారు.

పవన్‌కు బెదిరింపు కాల్

» ఏపీ డిప్యూటీ సీఎం ఓఎస్డీకి కాల్ చేసిన ఆగంతకుడు

» నిందితుడు తిరువూరు వాసిగా గుర్తింపు

విజయవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి అభ్యంతరకర భాషతో మాట్లాడుతూ ఓ ఆగంతకుడు ఓఎస్డీ వెంకటకృష్ణకు కాల్ చేశాడు. అంతేకాకుండా కొద్ది రోజుల క్రితం హోంమంత్రి అనితకూ ఈ తరహా కాల్ వెళ్లింది. ఇద్దరికీ కాల్స్ చేసిన వ్యక్తి ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన నక్కా మల్లికార్జునరావుగా గుర్తించారు. 9505505556 ఫోన్ నంబర్‌తో ఈ కాల్స్ వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు ఎంజీ రోడ్డు నుంచి ఈ ఫోన్ కాల్స్ చేసినట్టు గుర్తించారు. ఈ రెండు బెదిరింపు కాల్స్‌పై డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదులు అందాయి. దీంతో విజయవాడ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎంజీ రోడ్డును జల్లెడపట్టారు. స్థానికులను విచారించగా అటువంటి వ్యక్తి ఇక్కడెవరూ లేరని స్థానికులు చెప్పారు. దీంతో బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ముమ్మరంగా గాలించారు. అతడి ఆచూకీ మాత్రం లభించలేదు.

అమ్మ రూపమే

ప్రతి ఇంట్లోని కన్న తల్లిలా తెలంగాణ తల్లి



» మన సంస్కృతికి రూపమైన బహుజన తల్లి

» జాతి అస్తిత్వానికి ప్రతీకగా విగ్రహం

» పదేళ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు

» తెలంగాణ తల్లి విగ్రహం.. రాష్ట్ర గీతం లేవు

» మేం వచ్చాకే ఈ నిర్ణయాలు తీసుకున్నాం

» శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూస్తే ప్రతి ఇంట్లోని కన్నతల్లిని చూసిన భావన కలుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరికీ అమ్మను చూసిన భావన కలిగేలా విగ్రహాన్ని రూపొందించామని చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, అస్తిత్వం ఉట్టిపడేలా బహుజనుల తెలంగాణ తల్లిగా రూపొందించామన్నారు. విగ్రహ రూపకల్పన సందర్భంలో రెండు అంశాలు ప్రస్తావనకు వచ్చాయని, దేవతలా ఉండాలా? సొంత మాతృమూర్తిలా ఉండాలా? అన్న చర్చ జరిగిందని పేర్కొన్నారు. దేవత గుడిలో ఉంటుందని, తల్లి ఇంట్లో ఉంటుందని, మనల్ని ఒడిలో పెట్టుకుని పెంచుతుందని గుర్తు చేశారు. పైగా అందుకే తల్లి రూపమే ఉండాలన్న అభిప్రాయాల మేరకు బహుజనుల తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని వెల్లడించారు. సోమవారం అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10.30 గంటలకు సభ ప్రారంభం కాగానే.. స్పీకర్ ప్రసాద్‌కుమార్ అనుమతితో తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారు. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడారు. "తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన సందర్భంలో రెండు అంశాలు చర్చకు వచ్చాయి. విగ్రహం.. వజ్ర వైడూర్యాలు, కిరీటాలు, భుజకీర్తులతో దేవతలా ఉండాలా? లేక మనల్ని గుండెల్లో పెట్టుకుని చూసుకునే మన అమ్మలా ఉండాలా? అనే ప్రస్తావన వచ్చింది. మేధావులు, ఉద్యమకారులు, కవులు, కళాకారులందరూ తెలంగాణ తల్లి విగ్రహం మన తల్లిలా ఉండాలని అభిప్రాయపడ్డారు. దేవత గుడిలో ఉంటుంది.. తల్లి మన ఇంట్లో ఉంటుంది. తల్లి ఒడిలోనే మనం పెరుగుతాం కాబట్టి.. తెలంగాణ తల్లి కావాలని చెప్పారు. తల్లి ప్రతిరూపాన్ని పెట్టుకోవాలని సూచించారు. ఆ మేరకే ప్రతి ఇంట్లో కన్న తల్లిని చూసినట్టుగా ఉండే విగ్రహాన్ని రూపొందించాం" అని సీఎం అన్నారు.

మాతృమూర్తిలా రాష్ట్రాన్నిచ్చిన సోనియా

ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోవడానికి ఈ తెలంగాణ సమాజం శక్తినంతా కూడదీసుకుని వీరోచితంగా పోరాటం చేసిందని సీఎం రేవంత్ అన్నారు. ఆ పోరాటాల్లో ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు ప్రత్యేక భూమికను పోషించాయన్నారు. "ఉన్నత విద్య కోసం, తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం తండాలు, గూడేలు, మారుమూల పల్లెల్లోని పేదలు, అత్యంత నిరుపేదలైన బహుజనులు తమ పిల్లలను ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలకు పంపించారు. కానీ, ఆ విద్యార్థులు చదువొక్కటే కాదు.. సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల పరిష్కారానికి కూడా పోరాటం చేయాలని భావించారు. లక్షలాది మంది విద్యార్థులు తెలంగాణ పోరాట బాట పట్టారు. వారి స్ఫూర్తితోనే తొలి దశ, మలి దశ ఉద్యమాలు సాగాయి. వివిధ కారణాల వల్ల ప్రత్యే రాష్ట్ర ఆకాంక్ష వాయిదా పడుతూ వచ్చినప్పుడు... చివరి రక్తపు బొట్టు వరకు, ఆఖరి శ్వాస వరకు, సమిధలైనా పర్వా లేదంటూ ఆనాడు యువత ఉద్యమానికి ముందుకొచ్చింది. శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కిష్టయ్య, యాదయ్య, ఇషాన్‌రెడ్డి... ఇలా ఎంతో మంది విద్యార్థులు ఉద్యమకారులు, ఆకాశంలో తారాజువ్వలై, రాష్ట్రం కోసం అమరులయ్యారు. అలాంటి సందర్భంలో సోనియా గాంధీ.. ఒక మాతృమూర్తిగా, రాజకీయ ఆలోచనలను పక్కనపెట్టి, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి, ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి ఉదాత్తమైన నిర్ణయం తీసుకున్నారు. 2009 డిసెంబరు 9న తెలంగాణ ప్రక్రియ ప్రారంభమైందంటూ ప్రకటన ఇప్పించారు. ఆ తర్వాత అవాంతరాలు ఎదురైనా, పార్టీపరంగా ఎన్నో కోల్పోయినప్పటికీ.. తెలంగాణ రాష్ట్రాన్నిచ్చారు" అని రేవంత్ వివరించారు.

పదేళ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు..

"గత పదేళ్లలో తెలంగాణ రాష్ట్ర గీతం, తెలంగాణ తల్లి ప్రతిరూపాన్ని సృష్టించడం వంటి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేదని సీఎం రేవంత్ ఆరోపించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అప్పటి కొత్త ప్రభుత్వం వెంటనే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాల్సి ఉన్నా.. అది జరగలేదన్నారు. బండ్లపైనే కాకుండా.. గుండెలపైనా రాసుకున్న టీజీని పునరుద్ధరించలేదని పేర్కొన్నారు. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే టీజీని పునరుద్ధరించామని ప్రకటించారు. "వేలాది మందిని ఉద్యమం వైపు నడిపిన జయ జయహే తెలంగాణ గీతాన్ని అప్పటి ప్రభుత్వం రాష్ట్ర గీతంగా ప్రకటించలేదు. దాంతో పదేళ్లలో రాష్ట్ర గీతమనేదే లేకుండా పోయింది. కానీ ఒక గొప్ప స్ఫూర్తిని, పోరాట పటిమను చూపిన, ఉద్యమ బాట వైపు నడిపించిన గీతాన్ని రాష్ట్ర గీతంగా చేయాలని అనుకున్నాం. ఇప్పుడు ఏ కార్యక్రమం నిర్వహించినా... ఈ గీతాన్ని ఆలపిస్తున్నాం. గత పదేళ్లలో అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహం లేదు. అందుకే తెలంగాణ భావన, ఆలోచన, ఆత్మగౌరవం, అస్తిత్వం ఉట్టిపడేలా, కవులు, కళాకారులు, ఉద్యమకారులతో చర్చించి తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించాం" అని సీఎం చెప్పారు.

కొంత మందికి నచ్చలేదు

"తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, అస్తిత్వంతో బహుజనుల తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించుకుంటున్నాం. ఇంత గొప్ప నిర్ణయం తీసుకున్నప్పుడు.. డిసెంబరు 9న ఎలాంటి రాజకీయ వివాదాలకు తావు లేకుండా, తెలంగాణ సమాజం, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, రైతు కూలీ సంఘాలు, నాలుగు కోట్ల ప్రజలు ఏక గళంతో తెలంగాణ తల్లి ఉత్సవాలను జరుపుకొంటే బాగుంటుందని భావించాం. అందరూ కలిసి వస్తే ఇతర రాష్ట్రాలు, దేశ ప్రజల్లో మన గౌరవం పెరిగేది. దురదృష్టవశాత్తు కొంత మందికి ఇది నచ్చలేదు. ఒక వ్యక్తి, ఒక కుటుంబం, ఒక పార్టీ ఆలోచనే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆలోచన, భావన అనుకోవడం సమంజం కాదు. మధ్య యుగాల ఆలోచనలతో ప్రజా ప్రభుత్వం నడవదు. నాలుగు కోట్ల ప్రజలు ఏమి కోరుకుంటున్నారో, వారి ఆలోచనల ప్రతిరూపమే ఈనాటి ప్రజా ప్రభుత్వం. రాష్ట్రాన్ని పరిపాలించే సచివాలయం పరిపాలనకు గుండెకాయ. ఆ సచివాలయ గుండెల్లోనే తెలంగాణ తల్లి ఉండాలని ప్రభుత్వం భావించి, విగ్రహాన్ని ప్రతిష్ఠించింది. ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రావాలంటూ ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని, అసదుద్దీన్ ఒవైసీ, కమ్యూనిస్టు సోదరులు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని, గవర్నర్‌ను మా మంత్రి పొన్నం ప్రభాకర్ కలిసి ఆహ్వాన పత్రికలు అందించారు" అని సీఎం తెలిపారు.

ప్రతి ఏటా 'తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం'


తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనపై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటన సారాంశం.. "చరిత్ర ఉన్నంతవరకు ప్రజల గుండెల్లో మధుర జ్ఞాపకంగా నిలిచిపోయే అంశాన్ని ఈరోజు పవిత్ర శాసనసభలో ప్రకటిస్తున్నాను. నా తెలంగాణ కోటి రతనాల వీణ... నా తెలంగాణ తల్లి కంజాత వల్లి అన్న మహాకవి దాశరథి మాటలు నిత్య సత్యాలు. తెలంగాణ జాతికి నిరంతర స్ఫూర్తి వ్యాక్యాలు. ఏ జాతికైనా గుర్తింపు, గౌరవం ఆ జాతి అస్తిత్వమే. ఆ అస్తిత్వానికి మూలం సంస్కృతి. ఆ సంస్కృతికి ప్రతిరూపమే తల్లి. స్వరాష్ట్ర సుదీర్ఘ పోరాట ప్రస్థానంలో సకల జనులను, సబ్బండ వర్ణాలను ఐక్యం చేసి నడిపించిన శక్తి స్వరూపిణి తెలంగాణ తల్లి. మనల్ని నిరంతరం చైతన్యపరిచి, లక్ష్యసాధన వైపు నడిపించిన గొప్ప స్ఫూర్తి తెలంగాణ తల్లి. అలాంటి తెలంగాణ తల్లి స్వరూపంపై పలు రూపాలు ఇప్పటికే జన బాహుళ్యంలో ఉన్నాయి. వాటిలో దేనికీ ఇప్పటివరకు అధికారిక గుర్తింపు లేదు. అధికారికంగా మనం గౌరవించుకోలేదు. అనేక ప్రజా పోరాటాలకు ఊపిరి పోసిన మాతృమూర్తిని గౌరవించుకునే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహానికి రూపకల్పన చేసి, సచివాలయంలో ప్రతిష్ఠించింది. తెలంగాణ తల్లి అంటే ఒక భావన మాత్రమే కాదు.. నాలుగు కోట్ల బిడ్డల భావోద్వేగం. ఆ భావోద్వేగానికి నిండైన రూపం మన తెలంగాణ తల్లి. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మన సంప్రదాయాలు, సంస్కృతులు, చారిత్రక నేపథ్యాలను పరిగణనలోకి తీసుకుని తీర్చిదిద్దడం జరిగింది. మన సంస్కృతికి అద్దం పడుతూ ప్రశాంత వదనంతో సంప్రదాయ కట్టుబొట్టుతో, మెడకు కంటె, గుండు పూసల హారంతో, చెవులకు బుట్ట కమ్మలతో, ముక్కు పుడకతో, బంగారు అంచు కలిగిన ఆకుపచ్చ చీరలో, చేతికి గాజులు, కాళ్లకు కడియాలు, మెట్టెలతో, చాకలి ఐలమ్మ, సమ్మక్క, సారలమ్మ పోరాట స్ఫూర్తితో, ఎంతో హుందాతో కూడిన ఆహార్యంతో మన తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించాం. కుడి చేతిలో అభయాన్నిస్తూ, ఎడమ చేతిలో తెలంగాణ మాగాణంలో పండే సంప్రదాయ పంటలైన వరి, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న పంటలతో మన సంస్కృతికి, సంప్రదాయానికి నిలువెత్తు రూపంగా తీర్చిదిద్దాం. తెలంగాణ తల్లి నిల్చున్న పీఠం మన చరిత్రకు దర్పణంగా ఉంది. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని ప్రపంచంలోనే సమున్నతంగా నిలబెట్టాలన్న లక్ష్యాన్ని గుర్తు చేస్తూ చేతులన్నీ కలిపి పీఠాన్ని మోస్తున్న తీరు తెలంగాణ పునర్నిర్మాణ రీతిని తెలియజేస్తుంది. విగ్రహ రూపకల్పనలో వర్ణాలకు కూడా ప్రత్యేకత, గొప్ప తాత్వికత ఉంది. పీఠంలో నీల వర్ణం.. గోదావరి, కృష్ణమ్మలు తల్లి నిను తడుపంగ అన్న అందెశ్రీ గీతంలోని వాక్యాలు. ఆకుపచ్చ వర్ణం.. పచ్చని మా నేలల్లో పసిడి సిరులు పండంగ, ఎరుపు వర్ణం.. మార్పునకు, ప్రగతికి, చైతన్యానికి ప్రతీక. బంగారు వర్ణం.. శుభానికి, ఐశ్వర్యానికి, సమృద్ధికి నిదర్శనం. తెలంగాణ తల్లి విగ్రహమే కాదు.. మన జాతి ఆత్మగౌరవ ప్రతీక. అస్తిత్వ పతాక. మన జీవన గమనాన్ని నిర్దేశించే దీపిక. మన భవిష్యత్తు కర్తవ్యాన్ని నిరంతరం గుర్తు చేసే విధాత. అందుకే.. ఇకపై ప్రతి ఏటా డిసెంబరు 9న 'తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాన్ని' నిర్వహించాలని నిర్ణయించాం. ఉద్యమ సమయం నుంచి తెలంగాణ ఆకాంక్షను, ఆత్మగౌరవాన్ని, అస్తిత్వాన్ని, జాతి జనుల కీర్తిని నలుదిశలా వ్యాప్తి చేసిన 'జయజయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించాం. అంత గొప్ప గీతాన్ని మనకు అందించిన రచయిత అందెశ్రీని గౌరవించాం".

సోనియాగాంధీకి జన్మదిన శుభాకాంక్షలు..

ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీకి తెలంగాణ ప్రజలతో విడదీయరాని అనుబంధం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం సోనియా జన్మదినాన్ని పురస్కరించుకొని అసెంబ్లీలో ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

సభకు రాకుంటే.. ఎమ్మెల్యేలుగా విఫలమైనట్లే!

శాసనసభ్యులు సభకు రాకపోతే.. వారు ఎమ్మెల్యేలుగా విఫలమైనట్లేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్క సభ్యుడూ సభకు హాజరై సభలో జరిగే ప్రతి చర్చలో భాగస్వాములు కావాలన్నారు. అందరు సభ్యులూ తమకు నచ్చిన అంశంపై చర్చ జరుగుతున్నప్పుడు అందులో భాగస్వాములై మాట్లాడాలని సూచించారు. సభలో సభ్యులు ఎవరూ నోరు జారొద్దని, హుందాగా మాట్లాడాలని అన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. శాసనసభ సమావేశాల ప్రారంభానికి ముందు అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన సీఎల్పీ సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. "డిసెంబర్ 9కి ఎంతో ప్రాధాన్యం ఉంది. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీ జన్మదినం.. తెలంగాణ ఏర్పాటుకు చిదంబరం ప్రకటనతో పునాది రాయి పడింది ఈ రోజునే. ఇప్పుడు తెలంగాణ తల్లి ఆవిర్భావ ఉత్సవంగానూ డిసెంబరు 9నే గుర్తిస్తున్నాం" అని రేవంత్ అన్నారు.





కేటీఆర్ చెల్లికి దేవతా రూపంతో.. తెలంగాణ తల్లిని ప్రజలపై రుద్దారు

పదేళ్లు విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదు?: సీతక్క

హైదరాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి కేటీఆర్ చెల్లెలుకు దేవతా రూపం ఇస్తే ఎలా ఉంటుందో అలాంటి విగ్రహాన్ని తయారు చేసి తెలంగాణ ప్రజలపై రుద్దారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. విగ్రహాన్ని మారుస్తున్నారంటూ.. సొంత ఎజెండాతో బీఆర్ఎస్, బీజేపీ రాజకీయం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి కొత్త విగ్రహం ఏర్పాటు, కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని డిసెంబరు 9న తెలంగాణ ఏర్పాటు ప్రకటన అంశాలపై అసెంబ్లీలో సీతక్క మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని, అప్పుడు బీజేపీ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డల అస్తిత్వానికి అనుగుణంగా తాము విగ్రహాన్ని రూపొందిస్తే విమర్శిస్తారా అని నిలదీశారు. దళిత బిడ్డ రచించిన 'జయజయహే తెలంగాణ'ను రాష్ట్ర గీతం చేయాలనే సోయి గత సర్కారుకు ఎందుకు రాలేదన్నారు. తాము చేస్తుంటే మాత్రం అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఉద్యమ కాలంలో టీజీ అని.. రాష్ట్రం వచ్చాక టీఆర్ఎస్ పేరు కలిసొచ్చేలా టీఎస్ అని మార్చారని ఆరోపించారు. పార్టీ పేరులో ఉన్న తెలంగాణ పదాన్ని కూడా కేసీఆర్ తొలగించారన్నారు. "రాష్ట్ర మహిళలు మట్టి బిడ్డలు, గట్టి బిడ్డలు. ఆ శ్రామికతకు ప్రతిరూపంగానే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించాం. దానిని చూస్తుంటే అక్కాచెల్లెళ్లను చూసినట్లే ఉంది. విగ్రహ మార్పులో ఎలాంటి రాజకీయం లేదు. పార్లమెంటులో సోనియాను ప్రధాని మోదీ అవమానించారు. తల్లిని చంపి, బిడ్డను బతికించారంటూ తెలంగాణ ఏర్పాటును ఎద్దేవా చేశారు. అప్పుడు బీజేపీ వాళ్లు ఎందుకు మాట్లాడలేదు. బీఆర్ఎస్ శాసనసభ వెలుపల, బీజేపీ సభ లోపల గొడవ చేస్తున్నాయి. ఆ రెండూ ఒక్కటే'నంటూ సీతక్క మండిపడ్డారు.

నాడు ధనిక రాష్ట్రం.. అందుకే ధనవంతురాలిగా..

తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఆవిర్భవించిందని, అందుకే నాటి విగ్రహం ధనికంగా కనిపించిందని ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల పాల్జేయడంతో ఇప్పటి తెలంగాణ తల్లి పేదల తల్లిగా ఉందని ప్రజలు అనుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా తెలంగాణ తల్లి విగ్రహాలను మారుస్తారా అని సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ప్రశ్నించారు. విగ్రహ రూపకల్పనలో బీజేపీ సలహాలు, సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం ప్రజల మనోభావాలకు అద్దం

ప్రతి ఏటా డిసెంబరు 9న ఉత్సవం

బీఆర్ఎస్ నేతలకు అధికారం పైనే ప్రేమ

తెలంగాణ తల్లి అంటే గౌరవం లేదు: భట్టి

మా నాయనమ్మ గుర్తుకొస్తోంది: దామోదర





హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహం.. తెలంగాణ ప్రజల మనోభావాలకు అద్దం పడుతుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విగ్రహ ఆవిష్కరణ పండుగ.. ప్రజల గుండెల్లో మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుందన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూస్తుంటే ఒక అమ్మ, ఒక నాయనమ్మ కనిపిస్తున్నారని, చేతులెత్తి దండం పెట్టాలనిపిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై సోమవారం శాసన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై, శాసనమండలిలోనూ భట్టి విక్రమార్క మాట్లాడారు. సభలో సీఎం ప్రకటనపై సభ్యులందరూ చర్చించాలని మంచి సంప్రదాయానికి ప్రభుత్వం తెరతీస్తే.. సభలో తమ అభిప్రాయాలు చెప్పకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బయటికి పోవడం సరికాదన్నారు. ప్రతిపక్షం సభలో ఉండి వారి అభిప్రాయాలను పంచుకుని ఉంటే బాగుండేదని, కానీ.. బీఆర్ఎస్ వాళ్లకు అధికారంపై ప్రేమ తప్ప.. తెలంగాణపై, తెలంగాణ తల్లిపై గౌరవం లేదని విమర్శించారు. ప్రతి ఏటా డిసెంబరు 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం శాసనమండలిలో ప్రకటించారు. తెలంగాణ కీర్తిని విశ్వవేదికపై వైభవోపేతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుందని తెలిపారు.

మా నాయనమ్మ గుర్తుకొస్తోంది..

"తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూస్తుంటే మా నాయనమ్మ గుర్తుకొస్తోంది" అని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటయ్యాక కొన్ని విషయాలు బాధ కలిగించాయన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం విద్యార్థులు, కవులు, కళాకారులే ఎక్కువగా ఉద్యమించారని, కానీ.. గత పదేళ్లలో వారికి సముచిత గుర్తింపు దక్కలేదన్న బాధ తనలో ఉందన్నారు. పట్టుదలకు, తెగింపునకు ప్రతిరూపం ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలన్నారు. తాను ఉస్మానియా నుంచే వచ్చానని, తనలో ఉన్న పట్టుదల, తెగింపు తత్వంతోనే ఇంతదూరం రాగలిగానని తెలిపారు.కాగా, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ పేరును తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా మార్చాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శాసనమండలిలో మాట్లాడుతూ కోరారు. టి.జీవన్‌రెడ్డి మాట్లాడుతూ డిసెంబరు 9ని తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర అంకురార్పణ దినోత్సవంగా పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం పల్లె తల్లుల శ్రమైక జీవితానికి ప్రతిరూపంగా ఉందని అలగుబెల్లి నర్సిరెడ్డి ప్రశంసించారు. కాగా, ప్రభుత్వం మారినపుడల్లా విగ్రహం రూపాన్ని మార్చకుండా కట్టడి చేసేందుకు చట్టం చేయాలని ఎమ్మెల్సీలు రఘోత్తంరెడ్డి, ఏవీఎన్ రెడ్డి కోరారు.

శాసనమండలి 16కు వాయిదా

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై సోమవారం ఉదయం చర్చ అనంతరం శాసనమండలి సమావేశాలు వచ్చే ఈ నెల 16కు వాయిదా పడ్డాయి. కాగా, సోమవారం.. మండలికి నూతనంగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాం, ఆమెర్ అలీఖాన్‌లను చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభకు పరిచయం చేశారు. శాసన మండలి కార్యకలాపాలపై సభ్యులకు రెండురోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.

కిరీటం లేకపోతే అమ్మను కాదంటామా?

» బీఆర్ఎస్ వాళ్లకు మాట్లాడే హక్కు లేదు: కోమటిరెడ్డి

» అసెంబ్లీకి రాకుండా బీఆర్ఎస్ వ్యూహం: శ్రీధర్‌బాబు


హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణ తల్లి విగ్రహంపై కొంత మంది మాట్లాడుతూ తలపై కిరీటం లేదు, మెడలో నెక్లెస్ లేదు, ఒంటిపై పట్టు చీర లేదంటున్నారు. కానీ.. కిరీటం లేదన్న కారణంతో అమ్మను కాదంటామా" అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ తల్లి రూపకల్పనపై అసెంబ్లీలో సోమవారం ఆయన మాట్లాడుతూ అచ్చమైన తెలంగాణ తల్లి రూపాన్ని విగ్రహం పోలి ఉంటే.. అస్తిత్వం దెబ్బతిన్నదని వాదించడం సిగ్గుచేటన్నారు. రాజకీయ ఎదుగుదల కోసం తెలంగాణ పేరును తొలగించుకుని టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారిందని, కానీ.. తాము మాత్రం టీపీసీసీగానే(తెలంగాణతోనే) ఉన్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అని పెట్టుకున్న వాళ్లకు తెలంగాణ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం గురించి మాట్లాడం ఇష్టం లేకనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా వ్యూహం పన్నారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. అసెంబ్లీకి వస్తే విగ్రహం గురించి మాట్లాడాల్సి వస్తుందన్న కారణంతో అసెంబ్లీ నియమాలు, విధానాలకు విరుద్ధంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. నిజానికి ఈ విగ్రహం తెలంగాణ చరిత్రకు దర్పణమని, ఇలాంటి సందర్భంలో మాట్లాడడానికి కూడా బీఆర్ఎస్ నాయకుడు బయటికి రాలేదని కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. కొత్తగా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని అన్ని జిల్లాలు, మండలాల్లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. ఈ విగ్రహాన్ని తెలంగాణ సంస్కృతి స్ఫూర్తితో రూపొందించామని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా రాజకీయం చేస్తే చరిత్ర క్షమించదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించినప్పుడు ప్రతిపక్షాలను పిలవలేదని గుర్తు చేశారు. కాగా, తెలంగాణ తల్లి విగ్రహం చేతిలో బతుకమ్మ ఉంటే బాగుండేదని బీజేపీ ఎమ్మెల్యే శంకర్ అన్నారు.

కేటీఆర్‌తో మాకు పోలికా?

» భవిష్యత్తులో కేటీఆర్ సీఎం అయినా.. పట్టించుకోను: చిట్‌చాట్‌లో కోమటిరెడ్డి

» నెలలో ఒక రోజు సంక్షేమ హాస్టళ్ల పరిశీలన

» విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేస్తాం: భట్టి



హైదరాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): " ఎన్ఎస్‌యూఐ కార్యకర్త స్థాయి నుంచి కష్టపడి ఎదిగిన నాయకులం మేము. కేటీఆర్‌తో మాకు పోలికా? కేసీఆర్ లేకుండా కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యేవాడా?" అని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. భవిష్యత్తులో ఒక వేళ కేటీఆర్ సీఎం అయినా.. తాము ఆయనకు విలువ ఇవ్వబోనని స్పష్టం చేశారు. అసెంబ్లీ లాబీలో భట్టి విక్రమార్కతో కలిసి మీడియాతో చిట్‌చాట్‌గా కోమటిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి.. ఆమె పుట్టిన రోజున అసెంబ్లీకి వచ్చి కృతజ్ఞతలు తెలిపరా? అని కేసీఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చిన తర్వాత సోనియా వద్దకు కుటుంబ సమేతంగా వెళ్లిన కేసీఆర్.. ఆమె కాళ్లు మొక్కి గ్రూప్ ఫొటో దిగారన్నారు. సోనియా లేక పోతే తెలంగాణ వచ్చేది కాదంటూ అసెంబ్లీ సాక్షిగా చెప్పిన కేసీఆర్.. ఈ రోజు అసెంబ్లీకి ఎందుకు రాలేదని నిలదీశారు. కాగా, జిల్లాల పర్యటనకు వచ్చినప్పుడు డిప్యూటీ సీఎం భట్టి.. చేతికి ఎముక లేదన్నట్లుగా ఏది అడిగినా ఓకే అంటున్నారని, సచివాలయానికి పని కోసం వస్తే మాత్రం పైసలు లేవంటున్నారని నవ్వుతూ వ్యాఖ్యానించారు. అంతకుముందు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రతి నెలలో ఒక రోజు ప్రజా ప్రతినిధులు, అధికారులు తరలివెళ్లి సంక్షేమ హాస్టళ్లను పరిశీలించే కార్యక్రమాన్ని త్వరలోనే చేపట్టనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందులోభాగంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు సహా అధికారులు సంక్షేమ హాస్టళ్లను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యత తదితర అంశాలను పరిశీలిస్తారని చెప్పారు. అలాగే, విద్యార్థులతో కలిసి భోజనమూ చేస్తారన్నారు. ఈ నెల 16 లేదా 17న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించే అవకాశం ఉందన్నారు.

ఆనాడు అధికారికంగా ఎందుకు ప్రతిష్ఠించలేదు?

- విగ్రహాన్ని మార్చుతున్నారని ఇప్పుడు విమర్శలా?
- పదేళ్లు బీఆర్ఎస్ రాజ్యహింస పాలన సాగించింది
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చుతున్నారని విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు.. గత పదేళ్ల అధికారంలో ఉండి అధికారికంగా విగ్రహాన్ని ఎందుకు ప్రతిష్ఠించలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు తలెత్తుకునే విధంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన డిసెంబర్ 9వ తేదీని సర్కారు ఏటా రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తుందని ప్రకటించారు. సోమవారం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సభలో ఆయన మాట్లాడుతూ.. 'గత పదేళ్ల పాటు ఆత్మగౌరవంతో బతకాల్సిన ప్రజలను బందీ చేసి అనుక్షణం అవమానాలకు గురి చేసి బీఆర్ఎస్ సర్కారు రాజ్యహింసతో పాలన సాగించింది. తెలంగాణను మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజలపై భారం మోపింది. బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ఆనాటి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి రాష్ట్రంలో భారీ బహిరంగ సభలు నిర్వహించగా, సీఎల్పీ నాయకుడిగా నేను ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పీపుల్స్ పాదయాత్ర చేశా.. ప్రజలు కాంగ్రెస్‌ను ఆశీర్వదించి అధికారాన్ని కట్టబెట్టారు. తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నట్టుగా ప్రజాస్వామ్యయుత పాలన అందిస్తున్నాం. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసి 56 వేల మందికి ఉద్యోగాలిచ్చాం. మహిళలు ఆత్మగౌరవంతో, ఆత్మాభిమానంతో ఎదగాలని ఏటా రూ.20 వేల కోట్లు వడ్డీ లేకుండా రుణాలిస్తున్నాం. వచ్చే ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలిచ్చి వారిని వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దబోతున్నాం. రాష్ట్రం అప్పుల్లో ఉన్న రూ.21 వేల కోట్లతో రైతుల రుణాల మాఫీ చేశాం' అని చెప్పారు. తెలంగాణ ప్రజలు తలెత్తుకునే విధంగా మన అమ్మ, అక్క, నాయనమ్మ ప్రతిరూపంగా తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించుకున్నామన్నారు. అమ్మగా, ఆరాధ్య దైవంగా, పోరాటానికి స్ఫూర్తిగా, పసిడి పంటలు పండించే తల్లిగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని తెలిపారు. ధరించిన ఆకుపచ్చ చీర ప్రగతిశీల భావాలు, ఉద్యమాలకు గుర్తుగా ఎరుపు రంగు, బహుజనుల పోరాట స్ఫూర్తిని గుర్తు చేసే విధంగా నీలం రంగు, రాజ్య హింస పెరిగినప్పుడు ప్రజలు తిరుగుబాటుకు గుర్తుగా పిడికిళ్లతో విగ్రహాన్ని రూపొందించామన్నారు.


గాంధీభవన్‌లో మెగా రక్తదాన శిబిరంలో భట్టి, పొన్నం, దీపాదాస్ మున్షీ, మహేశ్‌కుమార్ గౌడ్

పునర్వికాసం వైపు తెలంగాణ పయనం

- విపక్షాల కుట్రలను ఛేదించి దిగ్విజయంగా ఏడాది పాలన: మహేశ్ గౌడ్
- గాంధీభవన్‌లో సోనియా జన్మదిన వేడుకలు

హైదరాబాద్/న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కారు పాలనలో తెలంగాణ పునర్వికాసం వైపు పయనిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. ప్రజల ఆశీర్వాదాలతో రాష్ట్రాన్ని మరింత ప్రగతి పథంలోకి నడిపిస్తామన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. టీపీసీసీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతల కుట్రలను తిప్పికొడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనను దిగ్విజయంగా పూర్తి చేసుకుందన్నారు. 'డిసెంబర్ 9న రాష్ట్రంలో రెండు పండుగలు జరుగుతున్నాయి. ఒకవైపు ప్రజాపాలన విజయోత్సవాల పండుగ అవుతుంటే.. మరోవైపు తెలంగాణ ఇచ్చిన సోనియా జన్మదిన ఉత్సవాలు జరుగుతున్నాయి' అని అన్నారు.

సోనియా గాంధీ వల్లే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. ఈ విషయాన్ని కేసీఆర్ కూడా ఎన్నోసార్లు చెప్పారని గుర్తు చేశారు. సోనియా జన్మదినాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎంపీలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోందని చెప్పారు. ఎంపీ చామల మాట్లాడుతూ.. తెలంగాణలో ఏడాది కాంగ్రెస్ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు.

నేతన్నలను ఆదుకునేందుకు 874 కోట్లు విడుదల

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



అమీర్‌పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి మెరుగ్గా లేకున్నా రైతాంగానికి చేసిన విధంగానే నేతన్నలను ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.874 కోట్ల పాత బకాయిలను విడుదల చేసినట్టు చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందులో టెస్కోకు రావాల్సిన రూ.488.38 కోట్లలో రూ.465 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని చేనేత, జౌళి శాఖలు హైదరాబాద్‌లోని అమీర్‌పేట కమ్మ సంఘంలో నిర్వహించిన హస్తకళలు, వస్త్ర ప్రదర్శన ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల హాజరై మాట్లాడారు. చేనేతను కాపాడాలన్న లక్ష్యంతో అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు, ప్రభుత్వ సంస్థలకు కావాల్సిన వస్త్రాలను టెస్కో నుంచి కొనాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. నేత కార్మికులకు నిరంతరం పని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. వేములవాడలో నూలు డిపో ఏర్పాటుతో దాదాపు 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న మరమగ్గాల కార్మికుల కల నెరవేరిందన్నారు. నేతన్న బీమా పథకంలో నమోదైన చేనేత కార్మికుడు ఏ కారణం చేతనైనా మరణిస్తే అతని నామినీకి రూ.5 లక్షలు చెల్లించనున్నట్టు చెప్పారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ)ని సీఎం రేవంత్ రెడ్డి ఏర్పాటు చేశారని తెలిపారు.

మూసీ నిర్వాసితులకు రూ. 2 లక్షలు

- రూ. 25 కోట్లతో మైనార్టీ మహిళా యోజన పథకం
- మూడు కొత్త పథకాలు ప్రకటించిన టీఎస్ఎంఎఫ్‌సీ

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మూసీ నిర్వాసితులకు రూ. 2 లక్షల పరిహారం అందిస్తామని తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ప్రకటించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో మూసీ నది గర్భంలో ఉంటున్న మైనార్టీలకు ప్రత్యేక జీవనోపాధి పథకం కింద పునరావాసాన్ని కల్పిస్తామని చెప్పారు. మైనార్టీలకు సంబంధించి మూడు కొత్త పథకాలను ఆయన ప్రకటించారు. ఇందులో మూసీ భూ నిర్వాసితుల పునరావాస పథకం కూడా ఉంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఖాళీ చేయించిన మైనార్టీ కుటుంబాలకు రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. ఇందులో రూ. 1.40 లక్షలు కార్పొరేషన్ సబ్సిడీ రుణంగా, రూ. 60 వేలను స్త్రీనిధి రుణంగా అందిస్తామన్నారు. ఇప్పటి వరకు ఖాళీ చేయించిన నిర్వాసితుల్లో 138 మైనార్టీ కుటుంబాలను గుర్తించామని, వీరికి ఆర్థికసాయం వెంటనే అందిస్తామన్నారు. అలాగే రూ. 31.64 కోట్లతో మైనార్టీలకు రెండు కొత్త పథకాలు.. ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన, ఇందిరమ్మ మహిళా శక్తి పథకాలను ఆయన సోమవారం ప్రారంభించారు. మైనార్టీ యోజన పథకంలో భాగంగా రూ. 25 కోట్లతో రాష్ట్రంలోని 5 వేలమంది పేదలకు రూ. 50 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఈ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ త్వరలో ప్రారంభం అవుతుందని, దారిద్ర్య రేఖకు దిగువనున్న మైనార్టీ కుటుంబాలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.


తెలంగాణ తల్లి విగ్రహంపై పూలు జల్లుతున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు


సభకు హాజరైన మహిళలు

అవమానిస్తే చర్యలు!

తెలంగాణ తల్లి నమూనాను మార్చితే ఊరుకోం

- మాటలతో, చేతలతో అగౌరవ పరిస్తే నేరం
- డిసెంబరు 9ని రాష్ట్ర వేడుకగా నిర్వహిస్తాం
- ఒక కుటుంబం కోసం తెలంగాణ తేలేదు
- ప్రజల అస్తిత్వానికి ప్రతీకగా తెలంగాణ తల్లి
- విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇక ఏటా డిసెంబరు 9వ తేదీన తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వం నిర్ణయించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని భవిష్యత్తులో ఎవరైనా మార్చేందుకు ప్రయత్నించినా, అవతరణ దినోత్సవాన్ని అవమానించాలని చూసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం సచివాలయంలో 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని మంత్రులతో కలిసి ఆవిష్కరించిన ముఖ్యమంత్రి కార్యక్రమానికి హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనలు తమ కుటుంబ గుర్తింపుకు, పార్టీ మనుగడకు ప్రమాదకరంగా మారాయని కొద్ది మంది వ్యక్తులకు దుఃఖం కలగొచ్చని వ్యాఖ్యానించారు. అయితే, ఆ కుటుంబం కోసమో, ఆ రాజకీయ పార్టీ కోసమో తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకోలేదన్నారు. ప్రజాస్వామిక పాలన కోసం, బహుజనుల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పడం కోసం తెలంగాణ తెచ్చుకున్నామని చెప్పారు. తెలంగాణ పాలనకు గుండెకాయ లాంటి సచివాలయంలో ఈ రోజు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని ప్రస్తావించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో అవమానాలు ఎదురయ్యాయని, తెలంగాణ రాష్ట్రంలోనూ పదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని సరిదిద్దే క్రమంలోనే రాష్ట్రాన్ని సూచించే కోడ్‌ను టీఎస్ బదులు టీజీగా మార్చుకున్నామని, జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా పాడుకుంటున్నామని, తాజాగా డిసెంబరు 9వ తేదీన తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. మన అస్తిత్వానికి, మన సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నామని సీఎం అన్నారు. బహుజనుల ఆకాంక్ష మేరకు తండాలు, గూడాలలో, మారుమూల పల్లెల్లో, జన బాహుళ్యంలో ఉన్న తెలంగాణ తల్లిని అధికారికంగా రూపుదిద్దామని చెప్పారు. ఈ రోజు ఆవిష్కరించిన తెలంగాణ తల్లిని చూసినప్పుడు తనకు తన చిన్నప్పటి తల్లి కళ్లకు కట్టినట్లుగా స్ఫురించిందన్నారు. తోటి మంత్రులు, శాసనసభ్యులు, కవులు, కళాకారులు ఎవరితో మాట్లాడినా తమ గుండెల్లోని తల్లి రూపాన్నే కళాకారుడు తీర్చిదిద్దారని కొనియాడారని గుర్తు చేశారు. డిసెంబరు 9వ తేదీ పవిత్రమైన రోజని, ఈ రోజు ఎలాంటి రాజకీయ విమర్శల జోలికి పోరాదని, ఆలోచన అంతా అమ్మ చుట్టే ఉంచాలనే సంకల్పంతో ఉన్నామని చెప్పారు.


'తెలంగాణ తల్లి' విగ్రహావిష్కరణ కార్యక్రమంలో అందెశ్రీని సన్మానిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు

టీజీగా నామకరణ

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేచినప్పుడు వాహనాలపైనే కాకుండా తెలంగాణ యువకుల గుండెలపై కూడా టీజీ అని రాసుకున్నారని రేవంత్ గుర్తు చేసుకున్నారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత టీజీ అని రాయకుండా టీఎస్‌గా నామకరణం చేసి ప్రజల ఆకాంక్షలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చాక టీజీగా మార్చుకున్నామని చెప్పారు. ఉద్యమకాలంలో నిరుద్యోగ యువకులు, విశ్వవిద్యాలయ విద్యార్థుల్లో జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం పాట ఉత్తేజం నింపిందని, గత పదేళ్లుగా ఆ పాటను రాష్ట్ర గీతంగా ప్రకటించలేదని రేవంత్ గుర్తు చేశారు. అందెశ్రీని గౌరవించుకుంటూ జయ జయహే గీతాన్ని అధికార గీతంగా మార్చుకున్నామని తెలిపారు. రాష్ట్ర సాధన సమయంలో ఆలే నరేంద్ర కావొచ్చు, విజయ శాంతి కావొచ్చు, కేసీఆర్ కావొచ్చు వివిధ పార్టీల వారు, వ్యక్తిగతంగా ఉద్యమకారులు ఆయా రాజకీయ పార్టీల ఆలోచనలకు, విధి విధానాలకు అనుకూలంగా తెలంగాణ తల్లి ప్రతిమను సృష్టించుకొని ఉద్యమంలో ముందుకు సాగారని రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల వ్యవధిలో తెలంగాణ తల్లి ప్రతిమ అధికారికంగా ఇలా ఉండాలి అని కానీ, తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు ప్రతీ సంవత్సరం జరుపుకోవాలనే ఆలోచన కానీ ఏ రోజూ చేయలేదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం కృష్ణా-గోదావరి నదులు హైదరాబాద్‌లో ప్రవహిస్తుంటే ఏ విధంగా ఉంటుందో అంత అద్భుతంగా ఉందని చెప్పారు. చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచి పోతుందని వ్యాఖ్యానించారు.

300 గజాలు... రూ.కోటి నగదు, తామ్రపత్రం

తెలంగాణ ఉద్యమం సందర్భంగా సర్వం కోల్పోయిన కొంత మంది కవులను గుర్తించి సన్మానించి, ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గూడ అంజయ్య, గద్దర్, బండి యాదగిరి, అందెశ్రీ, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్‌తేజ, జయరాజ్, పాశం యాదగిరి, ఎక్కా యాదగిరిలకు ఫ్యూచర్ సిటీలో 300 గజాల చొప్పున ఇంటి స్థలం, కోటి నగదు, తామ్ర పత్రం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో వారి పోరాటానికి గుర్తిస్తున్నట్లు వెల్లడించారు. వారి త్యాగాలు, పోరాటాలు మరువలేనివని చెప్పారు.

ప్రజల గుండెచప్పుడుగా తెలంగాణ తల్లి: అందెశ్రీ

పదేళ్ల పాటు ప్రచారంలో ఉన్న అమ్మ ఆలయంలో దేవతలా గుడిలో పెట్టుకునేదిగా ఉందని, ప్రస్తుతం ఆవిష్కరించిన తెలంగాణ తల్లి నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల గుండె చప్పుడుగా ఉందని ప్రముఖ కవి, గాయకుడు అందెశ్రీ అన్నారు. ఆమె దేవతకు ప్రతిరూపం అయితే గుండెల్లో పెట్టుకునేది ఉందని చెప్పారు. అమ్మకు శరణాఘతి అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అందెశ్రీతో పాటు తెలంగాణ తల్లి రూపకర్త, జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్, ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య టి.గంగాధర్, విగ్రహ శిల్పి రమణారెడ్డిలను సీఎం సన్మానించారు.

ప్రశాంత వదనం, ఆకు పచ్చ చీర

::: తెలంగాణ తల్లి ఆహార్యం ఇదే

- చిత్రాన్ని వక్రీకరించడం, వేరే రూపంగా చూపడం నిషేధం
- విగ్రహ రూపాన్ని ఆమోదిస్తూ జీవో జారీ

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తగా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులను జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర బహుజనుల పోరాట పటిమను, సాంస్కృతిక, సంప్రదాయ, వ్యవసాయ పద్ధతులను, శ్రమించే జీవన శైలిని, భావితరాలకు స్ఫూర్తిని కలిగించే చిహ్నంగా తెలంగాణ తల్లి ఉండాలని భావించి, తదనుగుణంగా విగ్రహాన్ని రూపొందించామని వెల్లడించింది. ఈ మేరకు దీనికి సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జారీ చేశారు. విగ్రహ రూపాన్ని డిసెంబరు 9న ప్రభుత్వం ఆమోదించిందని ప్రకటించారు.

ఇదీ ఆహార్యం

తెలంగాణ తల్లి విగ్రహ ఆహార్యాన్ని ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ తల్లి సంప్రదాయ మూర్తిగా, ప్రశాంత వదనంతో, బంగారు అంచు కలిగిన ఆకు పచ్చని చీరలో, సంప్రదాయ కట్టుబొట్టుతో, మెడకు కంటె, గుండు పూసల హారం, చేతికి గాజులు, కాళ్లకు కడియాలు, మెట్టెలు, చెవులకు బుట్టకమ్మలు, ముక్కు పుడకతో, మధ్య వయసు స్త్రీ మూర్తిలా, హుందాగా, ఎంతో స్ఫూర్తి దాయకంగా రూపొందినట్లు పేర్కొంది. కుడి చేతితో అభయాన్నిస్తూ, ఎడమ చేతిలో సంప్రదాయ పంటలైన వరి, జొన్న, సజ్జ, మొక్కజొన్న పంటలు, మన ప్రాంతీయ వ్యవసాయ సంస్కృతికి చిహ్నంగా చూపడం జరిగిందని తెలిపింది.

ఇలా చేయరాదు

- తెలంగాణ తల్లి విగ్రహం జాతి అస్తిత్వ, ఆత్మగౌరవ ప్రతీక అని, తల్లి చిత్రాన్ని, రూపాన్ని వక్రీకరించడం, వేరేవిధంగా చూపించడం నిషేధమని తెలిపింది.
- తెలంగాణ తల్లి చిత్ర రూపురేఖలను బహిరంగ ప్రదేశాలలో గానీ, ఇతర ప్రదేశాలలో గానీ ఆన్‌లైన్‌లో గానీ, సామాజిక మాధ్యమాల్లోగానీ, మాటలు, చేతలతో అగౌరవ పరచడం, ధ్వంసం చేయడం, కాల్చడం, అవహేళన చేయడం, అవమానించడం, కించపరచడం నేరంగా పరిగణిస్తారు.
- ఇక ముందు ప్రతి సంవత్సరం డిసెంబరు 9న రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాన్ని రాష్ట్ర, జిల్లా, మండల పరిధిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తగిన విధంగా అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని నిర్ణయించింది.

తల్లి కోసం తరలిన జనం!

- విగ్రహావిష్కరణలో భావోద్వేగ క్షణాలు
- సోనియాకు ధన్యవాదాలు తెలుపుతూ పాట

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ కాలం నాటి జ్ఞాపకాలు ఉబికివచ్చాయి. జై తెలంగాణ నినాదాలు నింగినంటాయి. స్వరాష్ట్రం అవతరించి పది సంవత్సరాల తర్వాత సాధారణ గృహిణి రూపంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉద్విగ్న భరితమైన వాతావరణంలో జరిగింది. సోమవారం సాయంత్రం 6.05 గంటలకు.. హుస్సేన్ సాగర తీరాన.. రాష్ట్ర సచివాలయంలో కీలకఘట్టం ఆవిష్కృతమైంది. వేలమంది మహిళల మధ్య, వేద మంత్రోచ్ఛరణల నడుమ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఒక చేతిలో పంట కంకులతో, మరో చేయిని అభయహస్తంగా చూపుతూ గ్రామీణ శ్రమైక జీవన స్ఫూర్తి ఉట్టి పడేలా తెలంగాణ తల్లి విగ్రహం ప్రజలకు దర్శనమిచ్చింది. జనమంతా చప్పట్లతో, జై తెలంగాణ నినాదాలతో తమ సంతోషాన్ని వెలిబుచ్చారు. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి మహిళలు, జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. కవి అందెశ్రీ జయ జయహే తెలంగాణ గీతంలోని పల్లవిని భావోద్వేగంతో పాడి వినిపించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తెలంగాణ తల్లి విగ్రహానికి రెండు వైపులా రెండు వేదికలను ఏర్పాటుచేశారు. ఎడమవైపు వేదికపై ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆసీనులయ్యారు. మరోవైపు ఏర్పాటు చేసిన వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వేదికపై ప్రదర్శించిన పేరణి నృత్యం, భరత నాట్యం, జయజయహే, ప్రజాపాలన, తెలంగాణ అభివృద్ధి సంక్షేమ గీతాలు అలరించాయి. డ్రోన్ షో అందరినీ ఆకట్టుకుంది.



డ్రోన్ షోలో తెలంగాణ రైజింగ్ లోగో ప్రదర్శన

ఇందులో కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను, 'తెలంగాణ రైజింగ్' లోగోను కూడా ప్రదర్శించారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో ఆకాశంలోకి దూసుకుపోయే బాణాసంచాతో అలరించారు. విగ్రహావిష్కరణలో కూడా ముసుగును తొలగించేందుకు డ్రోన్‌ను వినియోగించారు. ముఖ్యమంత్రి బటన్‌ను నొక్కగానే డ్రోన్ విగ్రహంపై ఉన్న తెరను పైకి లాగేసింది. తెలంగాణ రాష్ట్రం కల నెరవేర్చిన సోనియాగాంధీకి ధన్యవాదాలు తెలుపుతూ కొత్త పాటను విడుదల చేశారు. రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమాలు, ధర్నాలు, దీక్షలను చూపుతూ, పార్లమెంటులో తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన వీడియోను ప్రదర్శిస్తూ సోనియా మీద పాటను రూపొందించారు.

విగ్రహం బరువు ఏడున్నర టన్నులు

తెలంగాణ తల్లి కాంస్య విగ్రహాన్ని 17 అడుగుల ఎత్తులో 3 అడుగుల పీఠంపై ఏర్పాటు చేశారు. పీఠం బరువే నాలుగున్నర టన్నులుఉంటుంది. విగ్రహం రూపాన్ని ఖరారు చేయడానికి మూడు నెలల సమయం పట్టింది. తయారీకి రెండు నెలల సమయం తీసుకున్నారు. బ్రిటన్ నుంచి దిగుమతి చేసుకున్న ప్రత్యేకమైన రంగులను వినియోగించారు. విగ్రహం కోసమే రూ.1.16 కోట్లను వెచ్చించారు. పరిసరాల్లో ఏర్పాటుచేసిన పచ్చిక బయళ్లు, వాటర్ ఫౌంటెయిన్ ఇతర ఏర్పాట్లు కలిపి రూ.5.20 కోట్లను ఖర్చు చేసింది.

సోనియా,రాహుల్ ఇచ్చిన మాట తప్పరు

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే దీనికి నిదర్శనం.. వారిచ్చిన 6 హామీలను సీఎం నెరవేరుస్తున్నారు

- సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో జగ్గారెడ్డి
- 78 కిలోల కేకు కట్‌చేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

సంగారెడ్డి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ 78వ జన్మదిన వేడుకలను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సోనియా, రాహుల్ ఫొటోలతో కటౌట్లు ఏర్పాటు చేశారు. 78 కిలోల భారీ కేకును స్వయంగా జగ్గారెడ్డి కట్ చేశారు. తన చేతులతో అందరికీ కేకు తినిపించారు. సోనియాపై పాటలకు పోచమ్మలోళ్లు, పోతరాజులతో కలిసి జగ్గారెడ్డి చిందులేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడారు. ఎన్నికల సమయంలో సోనియా, రాహుల్, ఖర్గే ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలను సీఎం రేవంత్ నెరవేరుస్తున్నారని చెప్పారు. రైతులకు రుణమాఫీ, ఉచిత విద్యుత్తు, సబ్సిడీ గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదిలో ఉద్యోగాల భర్తీ వంటి వాటిని చేపట్టారని గుర్తుచేశారు. సీఎంతోపాటు మంత్రులు, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నేతలు తమదైన పాత్ర పోషిస్తున్నారని వెల్లడించారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటలను వెనక్కు తీసుకోరని, అందుకు నిదర్శనమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అని జగ్గారెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు నష్టం జరుగుతుందని తెలిసినా ఇచ్చిన మాట కోసం రాష్ట్రాన్ని ఇచ్చారని వివరించారు. ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని, ఇచ్చిన హామీలన్నింటినీ ఈ ప్రభుత్వం నెరవేరుస్తుందని జగ్గారెడ్డి భరోసా ఇచ్చారు. గతంలో ఉన్న ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. కానీ ఏడాది కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతోందని పేర్కొన్నారు. దీనికి కారణమైన సోనియా గాంధీకి తెలంగాణ ప్రజల తరఫున జన్మదిన శుభాకాంక్షలు చెప్పడం గర్వంగా ఉందన్నారు.


సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా సంగారెడ్డిలో పోచమ్మలోళ్ల మహిళకు కేకు తినిపిస్తున్న జగ్గారెడ్డి

అదుపు తప్పాయి









ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. డ్రైవర్ మృతి

చౌటుప్పల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ డిపోకు చెందిన ఆర్టీసీ డీలక్స్ బస్సు 46మంది ప్రయాణికులతో సోమవారం సాయంత్రం హైదరాబాద్ బయలుదేరింది. యాదాద్రి భువనగిరి జిల్లా దండుమల్కాపురం గ్రామ సమీపంలో మైసమ్మ ఆలయం వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని వెనుకనుంచి ఢీకొట్టింది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్ ఎండీ.సలీంపాషా(47) అక్కడికక్కడే మృతిచెందాడు. బస్సులోని 10మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికుడు వాసిరెడ్డి శ్రీకాంత్‌కు కాలు విరిగింది.

టైరు పేలి.. చెట్లలోకి దూసుకెళ్లి

చిట్యాల రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌సిటీ స్మార్ట్ ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు అదివారం రాత్రి 42 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి విజయవాడకు బయలు దేరింది. అర్ధరాత్రి 12 గంటల సమయంలో నల్లగొండ జిల్లా పెద్దకాపర్తి శివారు వద్ద బస్సు ముందు టైరు పేలిపోయింది. అదుపుతప్పిన బస్సు.. డివైడర్‌ను ఢీకొట్టి అవతలివైపు రోడ్డు పక్కనున్న చెట్లపొదల్లోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు.

పొలాల్లోకి స్కూలు బస్సు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలోని చాణక్య విజన్ ప్రైవేటు పాఠశాల బస్సు పొలాల్లోకి దూసుకెళ్లింది. మేడ్చల్ జిల్లా, బండమాదారం గ్రామ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో 20మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమని పోలీసుల విచారణలో వెల్లడైంది.

గుంతలు తప్పించబోయి..

మాడ్గుల/ఇబ్రహీంపట్నం, వికారాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు బ్రాహ్మణపల్లి మీదుగా ఇర్విన్, చారగొండకు వెళ్తోంది. పాటిగడ్డ వద్ద రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించేందుకు ప్రయత్నించగా బస్సు పక్కనే ఉన్న మైలురాయిని ఢీకొట్టింది. దీంతో ముందు వీల్ రాడ్ విరిగి పోయి బస్సు పొలంలోకి దూసుకుపోయింది. బస్సులో 130 మందివరకు ఉండగా కొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ అప్రమత్తతో ప్రమాదం తప్పిందని డిపోమేనేజర్ వెల్లడించారు. మరో ఘటనలో వికారాబాద్‌నుంచి తాండూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. డ్రైవర్ అప్రమత్తమై బస్సును పక్కనే ఉన్న గుంతలోకి తీసుకెళ్లి నిలిపివేశాడు. ఆ సమయంలో బస్సులో 50మంది ప్రయాణికులున్నారు.

స్కూళ్లలో టీచర్ల ఫొటోలు ప్రదర్శించాలి

- వారి వివరాలు కూడా వెల్లడించాలి
- పాఠశాల విద్యాశాఖ సర్క్యులర్ జారీ
- నకిలీ టీచర్ల సమస్యకు పరిష్కారంగా..
- మారుమూల ప్రాంతాల్లో తమ బదులు నకిలీలను స్కూళ్లకు పంపుతున్న కొందరు టీచర్లు

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే టీచర్ల ఫొటోలను, వివరాలను ఆయా స్కూళ్లలో ప్రదర్శించాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు తాజాగా ఓ సర్క్యులర్‌ను జారీ చేశారు. ముఖ్యంగా, నకిలీ (ప్రాక్సీ) టీచర్ల బెడదను అరికట్టటానికి ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. రాష్ట్రంలో దాదాపు లక్ష మందికి పైగా ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్నారు. అయితే.. కొన్ని స్కూళ్లల్లో ఉపాధ్యాయులు తమకు బదులుగా స్థానికంగా అందుబాటులో ఉండే ఇతరులను స్కూళ్లకు పంపి విద్యార్థులకు పాఠాలు చెప్పిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి వారిని ప్రాక్సీ టీచర్లు అని అంటున్నారు. వీరికి నెలకు రూ.5 వేల నుంచి 10 వేల వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఈ నకిలీలతోనే పాఠాలు చెప్పిస్తూ, అసలు ఉపాధ్యాయులు మాత్రం నెలలో అడపాదడపా పాఠశాలకు వెళ్తూ మొత్తం వేతనం తీసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. విద్యార్థులు సైతం నకిలీలు ఎవరు? అసలు ఉపాధ్యాయులు ఎవరు? అనేది గుర్తుపట్టలేకపోతున్నారు. ముఖ్యంగా, రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. దీనిని నివారించడానికి వీలుగా తాజా సర్క్యులర్ జారీ చేశారు. దీని ప్రకారం.. ప్రభుత్వ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులందరికీ సంబంధించిన వివరాలతో పాటు, వారి ఫొటోలను ఆఫీసు రూంలో లేదా స్కూల్ పరిసరాల్లోని గోడ వద్ద ప్రదర్శించాలి. ఉపాధ్యాయుడి పేరు, జాయినింగ్ తేదీ, రిటైర్‌మెంట్ తేదీ, సొంత ఊరు, ఏ సబ్జెక్టు బోధిస్తారు, పుట్టిన తేదీ వంటి వివరాలు వెల్లడించాల్సి ఉంటుంది. దీని ద్వారా ఉపాధ్యాయుల గురించి విద్యార్థులకు తెలియటమే కాకుండా.. స్కూళ్ల తనిఖీ కోసం వచ్చే ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులకు కూడా అక్కడి టీచర్ల వివరాలు తెలుస్తాయి. ఒక టీచర్‌కు బదులుగా ఇతరులెవరైనా వస్తున్నారా? ఆయా స్కూళ్లలో ఎంతమంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు? వారిలో రోజూ ఎంత మంది విధులకు హాజరవుతున్నారు? తదితర అంశాలపైనా స్పష్టత వస్తుంది. రాష్ట్రంలో ఇటీవలే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను నిర్వహించారు. అలాగే 10 వేలకు పైగా కొత్త ఉపాధ్యాయులను నియమించారు. బదిలీపై వచ్చిన వారితోపాటు, కొత్త ఉపాధ్యాయులను గుర్తించడానికి కొంత ఇబ్బంది ఉంటుంది. టీచర్ల ఫొటోలు, వివరాల వెల్లడితో ఇటువంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పాఠశాల విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

మళ్లీ చర్లపల్లి జైలుకు పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కస్టడీ ముగియడంతో లగచర్ల ఘటనలో ఏ-1గా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని సోమవారం పోలీసులు తిరిగి చర్లపల్లి జైలుకు తరలించారు. తొలుత కొడంగల్ మున్సిఫ్ కోర్టులో న్యాయాధికారి ముందు హాజరు పరిచి, అనంతరం జైలుకు తీసుకెళ్లారు. లగచర్లలో భూసేకరణ విషయమై అభిప్రాయాలు తెలుసుకోవడానికి వెళ్లిన అధికార్లపై దాడులు చేశారంటూ 71 మందిపై కేసులు నమోదయ్యాయి. దీని వెనుక కుట్ర ఉందనే కోణంలో పట్నం నరేందర్‌రెడ్డిని ప్రథమ నిందితుడు (ఏ1)గా పేర్కొని కేసు పెట్టారు. అయితే, ఆ దాడితో తనకు సంబంధం లేదని విచారణలో ఆయన సమాధానాలు ఇచ్చినట్టు తెలిసింది. చివరగా కోర్టులో హాజరుపర్చగా తనపై తప్పుడు కేసులు పెట్టారని ఆయన న్యాయాధికారికి చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి కొడంగల్ కోర్టు పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తెలంగాణ తల్లి కాదు.. కాంగ్రెస్ తల్లి: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ స్ఫూర్తితో రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ తల్లిగా మార్చారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ఈ దుశ్చర్యతో తెలంగాణ తల్లి కన్నీరు పెడుతోందన్నారు. కోట్లాది మంది బిడ్డల్లో స్ఫూర్తిని నింపిన తల్లి రూపాన్ని మార్చడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీ వద్ద అరెస్టు చేసిన నేపథ్యంలో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. తాము కాంగ్రెస్ తల్లిని తిరస్కరిస్తున్నామన్నారు. విగ్రహ స్వరూపాన్ని మార్చి అవమానించిన సీఎం గన్‌పార్క్ వద్ద ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. 18 ఏళ్లలో ఎవరూ తెలంగాణ తల్లి విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం అక్కసుతోనే తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చిందని ఆరోపించారు. బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి మాయం చేయడం దురదృష్టకరమని కవిత పేర్కొన్నారు. ఎన్నికల హామీని అమలు చేయమని అడిగినందుకు ఆశా వర్కర్లను పోలీసులతో కొట్టించడం అమానుషమన్నారు. సోనియా జన్మదినం సందర్భంగా రేవంత్ సర్కారు తెలంగాణ ఆడబిడ్డలకు ఇచ్చే బహుమతి ఇదేనా? ప్రజా పాలన అంటే ఇదేనా? అని కవిత ప్రశ్నించారు.

ఎన్‌ఆర్‌ఐ ఖాతా నుంచి 6.50 కోట్లు మాయం

పంజాగుట్ట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలో ఉంటున్న ఎన్ఆర్ఐ బ్యాంక్ ఖాతా నుంచి ఆయనకు తెలియకుండానే సుమారు 6.5 కోట్ల రూపాయలను ఇతర ఖాతాలకు మళ్లించి బ్యాంకు సిబ్బంది కొల్లగొట్టారని పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుని ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు యాక్సిస్ బ్యాంక్ బేగంపేట బ్రాంచ్ మాజీ మేనేజర్, సీనియర్ పార్టనర్‌తో పాటు మరో ఇద్దరు బ్యాంక్ సిబ్బందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆస్ట్రేలియాలో సిడ్నీ న్యూ సౌత్ వేల్స్‌కు చెందిన ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) పరితోష్ ఉపాధ్యాయ్‌కు 2017 నుంచి బేగంపేటలోని యాక్సిస్ బ్యాంక్‌లో ఖాతా ఉంది. అదే బ్యాంకులో సీనియర్ పార్టనర్‌గా పనిచేస్తున్న వెంకటరమణ పాసర్లతో పరితోష్ తన ఖాతాకు సంబంధించి సంప్రదింపులు జరిపేవాడు. వెంకటరమణ అదే బ్యాంకులో సర్వీస్ పార్టనర్ సురేఖ సైనీ, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హరి విజయ్, మాజీ బ్రాంచ్ మేనేజర్ శ్రీదేవి రఘు, ఆపరేషన్స్ టీమ్‌తో కుమ్మక్కై, పరితోష్‌కు తెలియకుండా లూజ్ లీఫ్ చెక్‌లను ఉపయోగించి, అతడి సంతకాన్ని ఫోర్జరీ చేసి అతని ఖాతాలో నగదును ఇతర ఖాతాలకు మళ్లించారు. పరితోష్ కొన్ని లావాదేవీలు చేయడానికి ప్రయత్నించినప్పుడు తన ఖాతాలో బ్యాలెన్స్ చాలా తక్కువగా ఉందని గమనించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఆ బ్యాంకు అధికారులను కలసి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ సంవత్సరం అక్టోబరు 21న అతని ఖాతాను మూసివేస్తున్నారని మెయిల్ ద్వారా సమాచారం అందింది. దీంతో తన ఖాతాను దుర్వినియోగం చేశారని, చెక్కులపై సంతకాలు తనకు సంబంధించినవి కావని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆలిని మార్చిన వాళ్లున్నారు.. కానీ,

తల్లిని మార్చినవాళ్లు లేరు!

ఆ పని చేసింది రేవంత్‌రెడ్డి మాత్రమే.. ఆమె తెలంగాణ తల్లి కాదు.. కాంగ్రెస్ తల్లి

- సమాధానం చెప్పలేని దద్దమ్మలు.. మమ్మల్ని అరెస్టు చేయించారు
- ఆశావర్కర్లు తల్లుల్లా కనిపించడం లేదా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం
- 'అదానీ-రేవంత్ భాయీ భాయీ' టీషర్టులతో అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- అడ్డుకున్న పోలీసులు.. గేటు బయటే అరెస్టు

హైదరాబాద్, మేడ్చల్, దుండిగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆలిని మార్చిన వాళ్లను చూశాంగానీ.. తల్లిని మార్చినవాళ్లను చూడలేదని.. సీఎం రేవంత్‌రెడ్డి తప్ప ఎవరూ ఆ పని చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ మార్పుపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 2007లోనే తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో తెలంగాణ తల్లి రూపాన్ని ఉద్యమకారులు రూపొందించారని, దానిని మార్చడానికి రేవంత్‌రెడ్డి ఎవరు అని నిలదీశారు. అసెంబ్లీ సమావేశాల తొలి రోజైన సోమవారం.. 'అదానీ, రేవంత్ భాయీ భాయీ' అనే నినాదంతో కూడిన ఫొటోలున్న టీషర్టులు ధరించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీలోకి రావటానికి ప్రయత్నించారు. అయితే, వారిని పోలీసులు అరెస్టు చేసి తెలంగాణ భవన్‌కు తరలించారు. ఈ సందర్భంగా, కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా, లగచర్ల ప్రజల తరఫున నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్తున్న తమను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. రాహుల్, ప్రియాంకతోసహా 100 మంది ఎంపీలు అదానీ, ప్రధాని బొమ్మ వేసుకొని పార్లమెంటు లోపలికి వెళ్లవచ్చు గానీ తెలంగాణలో మాత్రం తమను అసెంబ్లీ లోపలికి అనుమతించకపోవటం ఏమిటన్నారు. పార్లమెంటులో ఒక నీతి, శాసనసభలో మరో నీతి ఎలా ఉంటుందని నిలదీశారు. బీఆర్ఎస్ వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము లేని దద్దమ్మలు పోలీసులను అడ్డం పెట్టుకొని..తమను ఉభయ సభల్లోకి అడుగుపెట్టకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. స్పీకర్ ఆదేశాలతో పని లేకుండా ప్రభుత్వంలోని వ్యక్తులు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా తమను అరెస్ట్ చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు.



అసెంబ్లీ ఎదుట కేటీఆర్‌ను అరెస్టు చేసి వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

అసెంబ్లీ సమావేశాల మొదటిరోజే తమను రోడ్డు మీద నిలబెట్టారని అన్నారు. నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్ లేకుండా డిసెంబర్ 9న తెలంగాణ సాధించుకున్న దీక్షాదివస్ లేదన్నారు.

దిక్కుమాలిన భావజాలం

'తమ బతుకులు మార్చమని ప్రజలు కోరుకున్నారు. అంతేగానీ, తెలంగాణతల్లిని మార్చమని, టీఎస్‌ను టీజీ చేయమని కోరుకోలేదు. తెలంగాణ తల్లి విగ్రహంలో కిరీటం ఉంటే రాచరికపోకడనా? తల్లిని దేవతలాగా కొలిచే ఈ సమాజంలో పేదరాలిగా తల్లిని చూడాలని ఎవరూ అనుకోరు. తెలంగాణ తల్లిని పేదరాలిగా చూడాలన్న దిక్కుమాలిన భావజాలం ఏమిటో అర్థంకావడం లేదు' అని కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ అదానీకి వ్యతిరేకంగా కొట్లాడుతుంటే.. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం అదానీకి అనుచిత లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి డబ్బు సంచులు పంపిస్తున్న కారణంగానే.. అదానీతో ఆయన వ్యాపార లావాదేవీలపై కాంగ్రెస్ పార్టీ మౌనం వహించిందన్నారు. కాగా, సోమవారం సాయంత్రం మేడ్చల్ జిల్లాలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంతకు ముందటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పెట్టిన విగ్రహం తెలంగాణ తల్లి కాదని, కాంగ్రెస్ తల్లి అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతున్నదన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. 90 నుంచి 100 సీట్లతో కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని, సకల మర్యాదలతో కాంగ్రెస్ తల్లి, రాజీవ్ గాంధీ విగ్రహాలను గాంధీభవన్‌కు పంపుతామన్నారు. రేవంత్ సోదరుల ఆస్తులు అదానీని మించిపోయాయని విమర్శించారు.

పాలకపక్షం కుట్ర పన్నింది

శాసనసభ సమావేశాలు సజావుగా జరగకుండా పాలకపక్షం కుట్ర పన్నిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. శాసనమండలిలో విపక్ష నేత మధుసూధనాచారి, మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీ బయటే అడ్డగించడం దారుణమని, ఇంతకు ముందెన్నడూ ఇలా జరగలేదన్నారు. 'అదానీ, రేవంత్‌రెడ్డి ఫొటోతో ఉన్న టీషర్ట్ ధరించి సభకు వెళ్తే తప్పేమిటి? ఏ దుస్తులు వేసుకుని రావాలో స్పీకర్ చెబుతారా? అదానీ, మోదీ ఫొటో ఉన్న టీషర్ట్ ధరించి రాహుల్‌గాంధీ పార్లమెంటులోకి వెళ్తే ఆయనను ఎవరూ అడ్డుకోలేదు. మేం రాహుల్‌గాంధీనే అనుసరించాం. కానీ, ఎందుకు అనుమతించటం లేదు' అని నిలదీశారు.

దళిత, బీసీ ఆడబిడ్డలపై అరాచకమా?

ఆశావర్కర్ల ఉద్యమంపై కేటీఆర్ ఎక్స్‌లో స్పందిస్తూ.. 'మాతృమూర్తులపై మగ పోలీసులతో దౌర్జన్యమా? ఆశావర్కర్లు మీకు తల్లుల్లా కనిపించడం లేదా? వారేం పాపం చేశారని నడిరోడ్డుపైకి లాగిపారేస్తున్నారు? దళిత, బహుజన ఆడబిడ్డలపై ఇంతటి అరాచకమా?' అని ఆవేదన వ్యక్తం చేశారు. హోంశాఖ మంత్రిగా ఉన్న మీకు ఆడవాళ్లంటే అంత చులకనా.. ఇందిరమ్మ రాజ్యమంటే అణచివేతలు, అక్రమ అరెస్టులేనా అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలకు దిక్కులేదు కానీ.. ఏడో గ్యారెంటీగా ఎమర్జెన్సీని అమలు చేస్తున్నారన్నారు.



'అదానీ-రేవంత్ భాయీ భాయీ' టీషర్టులతో అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

'ఆశ'లపై నీళ్లు చల్లడం

సిగ్గుచేటు

- వారికి నిరసన తెలిపే హక్కు లేదా?
- రేవంత్, అదానీ చీకటి ఒప్పందాన్ని ప్రశ్నిస్తామనే మా ఎమ్మెల్యేల అరెస్టు: హరీశ్

హైదరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో దుర్మార్గ అరాచక పాలన సాగుతోందని, ప్రజలు, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ఆశ వర్కర్లు ఏడాదిగా పోరాడుతున్నారని, ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలకు సేవలందించే ఆశా వర్కర్లకు నిరసన తెలిపే హక్కు లేదా? అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ అమలు చేయాలంటూ ఆశాలు రోడ్డెక్కితే పోలీసులతో ఇష్టారీతిన కొట్టించడం దుర్మార్గమన్నారు. ఒకవైపు తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని గొప్పలు చెబుతూ.. మరోవైపు ఆశా తల్లులపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని "ఎక్స్" వేదికగా పేర్కొన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సభలోకి వెళ్లకుండా ప్రతిపక్ష నాయకులను అడ్డుకొని అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. అదానీ, రేవంత్‌ల చీకటి ఒప్పందాలు బయటపడతాయనే ప్రతిపక్షాన్ని సభలోకి రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. కాగా, పెండింగ్ బిల్లులు చెల్లించాలని మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చేందుకు వస్తున్న మాజీ సర్పంచ్‌లు, ఆ సంఘం నాయకులను సొంత ఊర్లలోనే నిర్బంధించడం, ఎక్కడికక్కడ అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రశ్నించడమే పాపం అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఏడాదిగా మాజీ సర్పంచ్‌లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుండటం దుర్మార్గమన్నారు. బడా కాంట్రాక్టర్లకు వందల కోట్ల బిల్లులు చెల్లిస్తున్న సీఎం.. మాజీ సర్పంచ్‌ల పట్ల నిర్లక్ష్యం వహించడం తగదన్నారు.

ఫిబ్రవరి 12న తుది వాదనలు!

- ఎమ్మెల్సీల నియామకం కేసులో సుప్రీంకోర్టు
- తమ నియామకాన్ని పక్కన పెట్టటంపై దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ పిటిషన్

న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించిన కేసును సుప్రీంకోర్టు ఫిబ్రవరి 12వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజు తుది వాదనలు వింటామని తెలిపింది. బీఆర్ఎస్ హయాంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణను ప్రతిపాదిస్తూ అప్పటి రాష్ట్ర మంత్రివర్గం గవర్నర్‌కు సిఫారసు చేసింది. రాజకీయ నేపథ్యం ఉందంటూ వారి పేర్లను అప్పటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. దీనిపై దాసోజు, కుర్రా సత్యనారాయణ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఆ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గం జనవరి 13న కోదండరాం, ఆమీర్ అలీఖాన్‌లను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమిస్తూ సిఫారసు చేసింది. ఆ సిఫారసును గవర్నర్ ఆమోదించారు. అయితే, తమ పిటిషన్లు విచారణలో ఉండగా గవర్నర్ మరో ఇద్దరిని ఎమ్మెల్సీలుగా ఎలా నియమిస్తారని దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ హైకోర్టులో సవాల్ చేశారు. హైకోర్టు మార్చి 17న తీర్పును వెలువరించింది. శ్రవణ్, సత్యనారాయణ నామినేషన్లను తిరసరిస్తూ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు తీర్పులో వెల్లడించింది. అలాగే, ఎమ్మెల్సీలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు స్పష్టం చేసింది. ఆ తర్వాత, ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కోదండరాం, అలీఖాన్ పేర్లను రాష్ట్ర మంత్రివర్గం మరోసారి గవర్నర్‌కు సిఫారసు చేసింది. దానిని గవర్నర్ ఆమోదించారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్‌పై సోమవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బి.వరాలేతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. దాసోజు తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గి వాదనలు వినిపించారు. విచారణను ధర్మాసనం ఫిబ్రవరి 12న వాయిదా వేసింది. అదే రోజున తుది వాదనలు వింటామని పేర్కొంది.

చెన్నమనేని జర్మనీ పౌరుడే!

ఆయన భారత పౌరసత్వం రద్దు సబబే.. కేంద్రం నిర్ణయం సరైందే.. హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు

- జర్మనీ పౌరసత్వాన్ని దాచినందుకు రూ.30 లక్షల జరిమానా

హైదరాబాద్/వేములవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కేంద్ర హోంశాఖ ఆయన పౌరసత్వాన్ని రద్దు చేయడం సబబేనని స్పష్టం చేసింది. భారత పౌరసత్వాన్ని రద్దు చేస్తూ 2019లో కేంద్ర హోం శాఖ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ రమేశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. జర్మనీ పౌరుడన్న విషయాన్ని దాచిపెట్టినందుకు రూ.30 లక్షలు జరిమానా విధిస్తూ సోమవారం సింగిల్ జడ్జి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి తీర్పు ఇచ్చారు. రమేశ్ పౌరసత్వంపై మొదటి నుంచి పోరాడుతూ ఆర్థికంగా నష్టపోయినందుకు గాను ప్రస్తుత వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రూ.25 లక్షలు చెల్లించాలని.. మిగతా రూ.5 లక్షలు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల సంస్థకు నెల రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించారు. రమేశ్ జర్మనీ పౌరసత్వాన్ని దాచిపెట్టడం ద్వారా గత 15 ఏళ్లుగా కోర్టు, అధికారుల సమయాన్ని వృథా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పౌరసత్వం విషయం బయటపెట్టకుండా 15 ఏళ్లు ఎమ్మెల్యే పదవి అనుభవించారని కోర్టు పేర్కొంది. 'తాను జర్మనీ పౌరుడిని కాదని నిరూపించేలా రమేశ్ ఇప్పటి వరకు జర్మనీ ఎంబసీ నుంచి ఒక్క ఆధారం కూడా సమర్పించలేదని స్పష్టంచేసింది. తప్పుడు పత్రాలు సమర్పించడం ద్వారా పిటిషనర్ కోర్టు సమయాన్ని వృథా చేశారంది. జర్మనీ పాస్‌పోర్టుతోనే రమేశ్ ఆ దేశానికి వెళ్లి వస్తున్నారని తెలిపింది. ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది.

ఆది నుంచీ పోరాడుతున్న ఆది శ్రీనివాస్..

చెన్నమనేని రమేశ్‌కు భారత పౌరసత్వం ఇవ్వడం చెల్లదని.. ఆయన జర్మనీ పౌరసత్వాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొంటూ గతంలో ఆయనపై పోటీ చేసి ఓడిపోయిన ప్రస్తుత వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ 2009 నుంచీ పోరాడుతున్నారు. 2009 ఫిబ్రవరిలో రమేశ్‌కు భారత పౌరసత్వం రాగా 2009 సాధారణ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. 2009 జూన్‌లో రమేశ్ పౌరసత్వం రద్దు చేయాలంటూ ఆది శ్రీనివాస్ కేంద్ర హోంశాఖ వద్ద రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత రమేశ్ 2010 ఉప ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలుపొందగా.. ఆ ఎన్నిక చెల్లదంటూ శ్రీనివాస్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను అనుమతించిన హైకోర్టు.. రమేశ్ భారత పౌరుడు కాదని, ఎమ్మెల్యేగా ఆయన ఎన్నిక చెల్లదని ప్రకటించింది. ఈ తీర్పుపై రమేశ్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ తర్వాత 2014లో రమేశ్ మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక కూడా చెల్లదని శ్రీనివాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మొదటి కేసులో రమేశ్ అప్పీల్‌పై 2016లో సుప్రీంకోర్టు తీర్పు ఇస్తూ.. ఇకపై వచ్చే ఎన్నికల పిటిషన్ల మీద రమేశ్ పౌరసత్వంపై కేంద్ర నిర్ణయం తర్వాతే తీర్పు ఇవ్వాలని పేర్కొంది. కేంద్ర హోంశాఖ 2017లో నియమించిన త్రిసభ్య కమిటీ.. రమేశ్ భారత ప్రభుత్వాన్ని మోసగించి పౌరసత్వం పొందినట్లు నివేదిక ఇచ్చింది. దీంతో కేంద్ర హోంశాఖ రమేశ్ పౌరసత్వాన్ని రద్దుచేసింది. దీన్ని సమీక్షించాలంటూ రమేశ్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌నూ కొట్టేసింది. దీనిపై రమేశ్ 2019లో హైకోర్టును ఆశ్రయించగా కేంద్ర నిర్ణయంపై స్టే విధించింది. ప్రస్తుతం రమేశ్ జర్మనీ పౌరసత్వం కొనసాగిస్తున్నారని.. మోసం చేయడం ద్వారా ఎమ్మెల్యేగా కొనసాగారని నిర్ధారిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. మరోవైపు రమేశ్ ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్లలో తీర్పు రావాల్సి ఉంది.



న్యాయం గెలిచింది: ఆది శ్రీనివాస్

సుదీర్ఘకాలంగా తాను చేస్తున్న పోరాటం ఫలించిందని, న్యాయం గెలిచిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. హైకోర్టు తీర్పుపై సోమవారం ఆయన హర్షం వ్యక్తం చేశారు. 15 ఏళ్లుగా తాను చేస్తున్న న్యాయపోరాటానికి ఫలితం దక్కిందన్నారు. ఇన్నేళ్ల తన పోరాటానికి సహకరించిన వారికి, మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. అభ్యర్థిత్వంపై మోసం చేసినందుకు చెన్నమనేని రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరతానని చెప్పారు.

తీర్పు నిరాశ కలిగించింది: రమేశ్

హైకోర్టు తీర్పు తనకు తీవ్ర నిరాశ కలిగించిందని చెన్నమనేని రమేశ్ అన్నారు. సోమవారం ఆయన తన సహాయకుల ద్వారా తీర్పుపై అభిప్రాయాన్ని తెలియజేశారు. హైకోర్టులో తన పౌరసత్వంపై వెలువడిన తీర్పు హేతుబద్ధంగా లేదన్నారు. రాజకీయ జీవితంలో ఒడిదొడుకులు సహజమని, వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనపై కుట్ర చేసి పౌరసత్వ వివాదం సృష్టించారని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుపై అప్పీలుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని రమేశ్ తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.